
భర్తృహరి నీతి శతకము
రూ॥40/-
పేజీలు:48

నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(అబిడ్స్), హిమాయత్‌నగర్, కొండాపూర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

ఈ ఏడాది 5శాతం అభివృద్ధి
బడ్జెట్ ప్రవేశపెట్టిన శ్రీలంక అధ్యక్షుడు

తైవాన్ తిరోగమనానికి అమెరికా ప్రయత్నం

మోదీ అప్పుల రికార్డుతో దేశం కుదేలు! లోపలి పేజీల్లో

సంపుటి 08, సంచిక: 81 | మంగళవారం | 18-02-2025 | ఖమ్మం | Published from: Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00

## పంటలకు ప్రణాళిక ప్రకారం
# నీరు విడుదల

- ప్రజలకు తాగు, సాగునీటి విషయంలో ఇబ్బందులు కలగొద్దు
- కలెక్టర్లు ప్రత్యేక చొరవ చూపాలి
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశం
- శ్రీశైలం, నాగార్జునసాగర్, ఎస్ఆర్ఎస్‌పితో పాటు ప్రధాన ప్రాజెక్టుల్లో నీటిని సమర్ధవంతంగా వినియోగించుకోవాలి
- గడ్డు పరిస్థితిని ముందస్తు అంచనా వేసుకోవాలని సూచన

**రానున్న మూడునెలలు అత్యంత కీలకం**

> నిర్ణీత వాటా కంటే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎక్కువగా నీటిని తరలించకుండా కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలి. ఎపి ఏకపక్షంగా నీటిని తరలించే విషయంపై వెంటనే కేంద్రానికి అధికారులు ఫిర్యాదు చేయాలి. నిర్ణీత కోటా కంటే ఎపి ఎక్కువ నీటిని తరలించకుండా అడ్డుకట్ట వేసేందుకు టెలిమెట్రీ విధానమే పరిష్కారం. నీటి వాటాల పంపిణీ, వినియోగాన్ని లెక్కించే బాధ్యత కేంద్ర జల సంఘానిదే.
> – సిఎం రేవంత్‌రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్

రాబోయే మూడు నెలలు అత్యంత కీలకమని, రాష్ట్రమంతటా అన్ని ప్రాంతాల్లో సాగు, తాగు నీరు, విద్యుత్ డిమాండ్ గణనీయంగా పెరుగుతుందని, ఈ క్రమంలో ప్రజలకు ఇబ్బంది లేకుండా తాగు, సాగునీటిని అందించేందుకు జిల్లా కలెక్టర్లు ప్రత్యేక చొరవ చూపాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. వెంటనే సంబంధిత అధికారులతో సమావేశాలను నిర్వహించి, జిల్లాల వారిగా ప్రణాళికలు రూపొందించాలన్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాజెక్టుల కింద సాగవుతున్న పంటలకు ప్రణాళిక ప్రకారం నీటిని విడుదల చేయాలన్నారు. రైతులు ఇబ్బంది తరువాయి 2లో



## ఢిల్లీలో భూకంపం

- పరిసర ప్రాంతాల్లోనూ ప్రకంపనలు
- రిక్టర్ స్కేలుపై తీవ్రత 4.0గా నమోదు
- భయాందోళనకు గురైన ప్రజలు

**న్యూఢిల్లీ :** దేశ రాజధానిలో భూకంపం సంభవించింది. ఢిల్లీ, దాని పరిసర ప్రాంతాల్లో సోమవారం ఉదయం బలమైన భూప్రకంపనలు వచ్చాయి. భూకంప లేఖినిపై తీవ్రత 4.0గా నమోదైంది. అయితే భూకంపం వల్ల ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లినట్లు ఎలాంటి నివేదికలు రాలేదు. ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, మరిన్ని ప్రకంపనలు వచ్చే అవకాశమున్నందున ముందస్తు రక్షణ చర్యలు పాటించాలని ప్రధాని నరేంద్ర మోదీ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అధికారులు పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారన్నారు. ఈ మేరకు ప్రధాని ఎక్స్‌లో పేర్కొన్నారు. దౌలాకువాలోని జీల్ పార్క్ ప్రాంతంలో భూకంపం కేంద్రం ఉన్నట్లు అధికారులు తరువాయి 2లో



05

## వక్ఫ్ బిల్లులో లోపాలు సరిదిద్దండి

- స్పీకర్‌కు సిపిఐ ఎంపి సందోష్‌కుమార్ లేఖ



03

## గాడితప్పి మాట్లాడుతున్న బండిసంజయ్

- మాజీ ఎంపి మధుయాష్కీగౌడ్



05

## భారత్, బంగ్లా సరిహద్దుపై చర్చలు

- నేడు బిజిబితో సమావేశం కానున్న బిఎస్ఎఫ్ అధికారులు

### ఇసుక అక్రమ రవాణా అరికట్టేందుకు
## విజిలెన్స్ దాడులు

- ఇసుక రిచ్‌లను కలెక్టర్లు, ఎస్‌పిలు తనిఖీ చేయాలని సిఎం ఆదేశం
- చర్యలకు ఉపక్రమించిన మైన్స్ అండ్ జియాలజీ శాఖ

అక్రమ ఇసుక రవాణాపై ఉక్కుపాదం మోపాలని సంబంధిత అధికారులకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అదేశాలు జారీ చేశారు. ఇసుక ఓవర్ లోడ్‌తో ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న నేపథ్యంలో అక్రమ రవాణాను అరికట్టేందుకు విజిలెన్స్ దాడులను చేపట్టడంతో, పాటు ఇసుక రీచ్‌లను జిల్లా కలెక్టర్లు, ఎస్‌పిలు ఎప్పటికప్పుడు తనిఖీలను నిర్వహించాలని సిఎం ఆదేశించారు. దీంతో ఇసుక అక్రమ రవాణా కట్టడికి మైన్స్, అండ్ తరువాయి 2లో

## అర్హులకు తక్షణమే రేషన్‌కార్డులు

- ఎమ్మెల్సీ కోడ్ లేని జిల్లాల్లో అందించేందుకు చర్యలు
- డిజైన్లను పరిశీలించిన సిఎం



కొత్త రేషన్ కార్డుల కోసం సుదీర్ఘ కాలంగా ఎదురుచూస్తున్న పేదల నిరీక్షణ ఫలించనుంది. అర్హులందరికీ కొత్తరేషన్ కార్డులను తక్షణమే జారీ చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అధికారులను అదేశించారు. పోలీసు కమాండ్ కంట్రోల్‌లో సోమవారం రేషన్ కార్డు జారీకి సంబంధించి మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డితో కలిసి సిఎం పౌర సరఫరాల శాఖ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కొత్త కార్డులకు సంబంధించి పౌర సరఫరాల అధికారులు తయారు చేసిన పలు డిజైన్లను పరిశీలించారు. అనంతరం సిఎం మాట్లాడుతూ తరువాయి 2లో



## ఆదాయంలో బిజెపి టాప్

- 2023–24 ఆర్థిక సంవత్సరంలో
- రూ. 4,340.47 కోట్లు సంపాదన

**న్యూఢిల్లీ :** భారతీయ జనతా పార్టీ (బిజెపి) 2023–24 ఆర్థిక సంవత్సరంలో జాతీయ పార్టీల్లోనే అత్యధిక ఆదాయాన్ని కలిగి ఉన్నది. ఆ పార్టీ మొత్తం సంపాదన రూ. 4,340.47 కోట్లు అని అసోసియేషన్ ఆఫ్ డెమాక్రటిక్ రిఫార్మ్స్ (ఎడిఆర్) వెల్లడించింది. ఈ మొత్తం ఆరు జాతీయ పార్టీల ఆదాయంలో 74.57 శాతంగా ఉన్నట్లు తెలిపింది. 2023–24 ఆర్థిక తరువాయి 2లో

## భవిష్యత్తులో రాష్ట్రానికి బిసి సిఎం

- నాలుగేళ్లు తెలంగాణకు రేవంత్‌రెడ్డే ముఖ్యమంత్రి
- టిపిసిసి అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ స్పష్టీకరణ
- రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న 42 శాతం బిసి రిజర్వేషన్ బిల్లును షెడ్యూల్ 9లో కేంద్రం చేర్చాలని డిమాండ్




ప్రజాపక్షం/హైదరాబాద్

రానున్న నాలుగేళ్ళు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి కొనసాగుతారని, భవిష్యత్‌లో ఏదో ఒక రోజు తెలంగాణ రాష్ట్రానికి బిసి వ్యక్తి ముఖ్యమంత్రి అవుతారని, ఇది కాంగ్రెస్‌లోనే సాధ్యమని టిపిసిసి అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న 42 శాతం రిజర్వేషన్ల బిల్లును కేంద్రం షెడ్యూల్ 9లో చేర్చి, చట్టబద్ధత కల్పించి తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని సూచించారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో సోమవారం తరువాయి 2లో

## తదుపరి సిఇసి పేరు రాష్ట్రపతికి సిఫార్సు

### ఎన్నికల కమిషన్ ఎంపికపై ఉన్నతస్థాయి కమిటీ భేటీ


**న్యూఢిల్లీ :** కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి) ఎంపికపై ప్రధాని మోదీ నేతృత్వంలో సోమవారం ఉన్నత స్థాయి కమిటీ భేటీ నిర్వహించారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా, విపక్ష నేత రాహుల్ గాంధీలు పాల్గొన్న ఈ సమావేశంలో తదుపరి సిఇసి పేరును ఎంపిక చేసి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు సిఫార్సు చేసినట్లు సమాచారం. దీంతో కొత్త సిఇసికి సంబంధించి ఓ ప్రకటన వెలువడే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. ప్రస్తుత సిఇసి రాజీవ్‌కుమార్ పదవీ కాలం ఫిబ్రవరి 18తో ముగియనుండడంతో ఎంపిక కమిటీ సమావేశమైంది.

**వాయిదా వేయండి : కాంగ్రెస్**

కొత్త సిఇసి ఎంపికను వాయిదా వేయాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. సిఇసి ఎంపిక ప్రక్రియను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌ను ఫిబ్రవరి 19న సుప్రీం కోర్టు విచారించనున్నందున దీన్ని వాయిదా వేయాలని కాంగ్రెస్ నేత అభిషేక్ మనుసింఘ్వీ కోరారు. అయితే, ఈ భేటీకి రాహుల్ గాంధీ హాజరయ్యారని చెప్పినప్పటికీ.. అందులో ఏం మాట్లాడారనే విషయాన్ని మాత్రం సింఘ్వీ వెల్లడించలేదు.

## పెద్దగట్టుకు పోటెత్తిన జనం

- ఘనంగా బోనాలు, మొక్కుల సమర్పణ
- దిక్కులు పిక్కటిల్లేలా లింగా.. ఓలింగా.. అంటూ నృత్యాలు
- డోలు వాయించిన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి







ప్రజాపక్షం/సూర్యాపేట ప్రతినిధి

లింగమంతులస్వామి(పెద్దగట్టు) జాతరకు రెండవ రోజు సోమవారం భక్తులు పోటెత్తారు. లక్షలాది మంది భక్తులు లింగా... ఓ లింగా.. అంటూ శివనామ స్మరణతో భక్తులు చేసిన నినాదాలతో పెద్దగట్టు హోరెత్తింది. గజ్జెల లాగులు ధరించి... కాళ్ళకు గజ్జెలు కట్టుకొని వీర చండును తరువాయి 2లో

## దెబ్బతీస్తున్న సిండికేట్



- భారీగా తగ్గిన సుబాబుల్, జామాయిల్ ధరలు
- మూడు సంస్థలు కుమ్మక్కు - ఆందోళన దిశగా రైతులు

ప్రజాపక్షం/ఖమ్మం

ప్రధాన వాణిజ్య పంటలైనా పత్తి, మిర్చి ధరలు హెచ్చుతగ్గులు, దిగుబడుల్లో వస్తున్న ఇబ్బందుల దృష్ట్యా మెట్ట రైతులు సుబాబుల్, జామాయిల్ సాగుకు మళ్లారు. తొలుత ఫర్వాలేదనుకున్న రాను రాను కాగిత పరిశ్రమలు రైతులను నిస్సాయులను చేసి ఇష్టానుసారంగా కొనుగోలు చేస్తున్నాయి. తెలంగాణ రాష్ట్రం సిర్పూర్ కాగజ్‌నగర్‌లోని జెకె పేపర్ మిల్లు, భద్రాచలం సమీపంలోని బిపిఎల్ (ఐటిసి), రాజమండ్రిలోని ఆంధ్రప్రదేశ్ పేపర్ మిల్లులు సిండికేట్‌గా మారి 40 రోజుల్లో టన్నుకు రూ.1300ల వరకు వివిధ దశల్లో ధరను తగ్గించారు. పెరిగిన కౌలు, పెట్టుబడులను పరిగణలోకి తీసుకుని ధరను పెంపుదల చేయాల్సిన కంపెనీలు ధరను తగ్గించడం రైతులకే విస్మయం కలిగించేలా ఉంది. 2015లో సుబాబుల్ ధర టన్ను రూ.5,300 ఉండగా పదేళ్ల తర్వాత రూ.7,500 పలుకుతుంది. ఇప్పుడు 2024 డిసెంబర్‌కు ముందు రూ.8,100 ఉన్న టన్ను జామాయిల్ పలు దఫాలుగా ధర తగ్గించి రూ.6,800లకు కొనుగోలు చేస్తున్నారు. భద్రాచలం సమీపంలోని బిపిఎల్‌కు పొట్టు తీసిన సుబాబుల్‌ను మాత్రమే సరఫరా చేయాల్సి ఉంటుంది. పొట్టు తీసిన సుబాబుల్ డిసెంబర్ మాసం మొదటి వారంలో రూ. 10,500 ఉండగా వివిధ దశల్లో రూ.500, రూ.200, రూ. 300 ఇప్పుడు మరో రూ. 500 ధర తగ్గించారు. పదేళ్ల కాలంలో పెట్టుబడులు రెట్టింపైనప్పటికీ ధర మాత్రం అందుకు అనుగుణంగా పెరగ లేదు. ఇదే కంపెనీలు ఇతర ప్రాంతాల నుంచి కర్రను దిగుమతి చేసుకునేటప్పుడు మాత్రం టన్నుకు రూ. 18వేల చొప్పున చెల్లిస్తున్నారు. వియత్నం, థాయిలాండ్ దేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. ఇవే కంపెనీలు ప్రభుత్వం అటవీ భూముల్లో సాగు చేసిన జామాయిల్ కర్రను తరువాయి 2లో

## కెసిఆర్‌కు సిఎం బర్త్‌డే విషెస్



ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు జన్మదిన వేడుకలు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించారు. ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి బిఆర్ఎస్ అధినేతకు శుభాకాంక్షలు తెలియజేశారు. నిత్యం ప్రజాసేవలో నిమగ్నమవుతూ రాష్ట్రాభివృద్ధికి పాటుపడటంలో భగవంతుడు వారికి సంపూర్ణ ఆయురా రోగ్యాలు ప్రసాదించాలని ఆకాంక్షించారు. కాగా, సిద్ధిపేట జిల్లా ఎర్రవెల్లి వ్యవసాయ క్షేత్రంలో వేడుకలు జరిగాయి. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎర్రవెల్లికి వెళ్లి కెసిఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు, కార్యకర్తలకు కెసిఆర్ అభివాదం చేశారు. బిఆర్ఎస్ పార్టీ కార్యాలయం తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన కెసిఆర్ జన్మదిన వేడుకలకు బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి.రామారావు, మాజీ మంత్రులు హరీశ్ రావు, మహమూద్ అలీ, సత్యవతి రాథోడ్, వి.శ్రీనివాస్ గౌడ్, ఎంఎల్ఎలు ముఠా గోపాల్, కాలేరు వెంకటేశ్, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కెటిఆర్ మాట్లాడుతూ తెలంగాణలోని ఏ మూలకు పోయినా తిరిగి కెసిఆర్ ముఖ్యమంత్రి కావాలన్న స్వరాలు వినిపిస్తున్నాయన్నారు. కెసిఆర్‌ను తిరిగి ముఖ్యమంత్రి చేసే ఏకైక లక్ష్యంతో తరువాయి 2లో

## పాములు, మొసళ్లు దాటుకుంటూ...

- డంకీ మార్గంలో అమెరికాకు...
- తాను ఎదుర్కొన్న భయానక అనుభవాలను వివరించిన యువకుడు



**న్యూఢిల్లీ :** అధికారంలోకి వచ్చీరాగానే అక్రమ వలసదారులపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఉక్కుపాదం మోపారు. ప్రత్యేక విమానాలు ఏర్పాటు చేసి మరీ వారిని తిప్పి పంపిస్తున్నారు. అలా వందల మంది భారతీయులను కూడా స్వదేశానికి పంపించారు. ఈ పరిణామాల వేళ అమెరికా వెళ్లే అక్రమ మార్గమైన డంకీ రూట్ గురించి పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. ఎంతోమంది వలసదారులు ప్రాణాలకు తెగించి ఈ మార్గంలో అగ్రరాజ్యానికి వెళ్తున్నారు. తాజాగా స్వదేశానికి చేరుకున్న ఓ యువకుడు డంకీ రూట్‌లో తాను ఎదుర్కొన్న భయానక అనుభవాలను వివరించాడు. పాములు, మొసళ్లను దాటుకుని తాను చేసిన ప్రయాణాన్ని తలచుకుని ఉద్వేగానికి లోనయ్యాడు. మూడో విడతలో భాగంగా 112 మంది భారతీయులు ఆదివారం రాత్రి 10 గంటలకు అమెరికా సైనిక విమానంలో అమృత్‌సర్ చేరుకున్నారు. ఇందులో వచ్చిన పంజాబీ వాసి మన్‌దీప్ సింగ్ తన అనుభవాలను పంచుకున్నాడు. అమెరికా వెళ్లడానికి తరువాయి 2లో

## మేడ్చల్‌లో మరో మర్డర్

ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి

జాతీయ రహదారిపై వెంటాడి హత్య జరిగిన 24 గంటలు గడువకుండానే మేడ్చల్ మున్సిపల్ పరిధిలో మరో యువకుడి హత్య చోటు చేసుకొంది. కిష్టాపూర్ రోడ్‌లోని రాఘవేంద్ర కాలనీలో నివసించే వెంకటరమణ(32) దుండగులు దాడి చేసి ఇంట్లోనే గొంతు కోసి హత్య చేసి పరారయ్యారు. ఆదివారం నాటి హత్యోదంతంలో నిందితుల అరెస్టు వివరాలను మీడియాకు తెలిపిన కాసేపటికే మరో హత్య విషయం తెలుసుకొన్న మేడ్చల్ ఎసిపి హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకొన్నారు. హత్యకు గల కారణాలు తెలియరాలేదని ఆయన తెలిపారపు. కాగా మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో గత పదిహేను రోజుల్లోగా తాజా హత్యోదంతం నాలుగవది కావటం స్థానికులను తీవ్రంగా భయాందోళనలకు గురి చేస్తోంది.

# తైవాన్ తిరోగమనానికి అమెరికా ప్రయత్నం

## చైనా విమర్శ.. తప్పుడు సంకేతాలు పంపుతున్నదని ధ్వజం

**బీజింగ్:** తైవాన్ తిరోగమానికి అమెరికా ప్రయత్నిస్తున్నదని చైనా విమర్శించింది. అమెరికా తన వైఖరి మాధ్యమంగా తైవాన్ ప్రజలకు తప్పుడు సంకేతాలు పంపుతున్నదని ఆగ్రహం వ్యక్తం చేసింది. తైవాన్‌తో సంబంధాలపై అమెరికా ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన 'ఫ్యాక్ట్ షీట్' నుంచి ఒక వాక్యం మాయం కావడం వివాదానికి కారణమైంది. 'తైవాన్ స్వాతంత్ర్యానికి మేము మద్దతు ఇవ్వం' అనే వాక్యం తాజా ఫ్యాక్ట్‌షీట్‌లో కనిపించలేదు. తైవాన్ స్వాతంత్ర్యానికి మద్దతుని స్తున్నట్టు అమెరికా పరోక్షంగా పేర్కొందన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. తైవాన్ ప్రభుత్వం కూడా అమెరికా తాజా ఫ్యాక్ట్‌షీట్‌ను స్వాగతించింది. 'అమెరికా కొత్త డాక్యుమెంట్ మాకు అనుకూలంగా ఉంది. అమెరికా తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం' అని తైవాన్‌ను ఉటంకిస్తూ అసోసియేటెడ్ ప్రెస్ తెలిపింది. అయితే, తైవాన్ ఏ భాషలో ఈ వ్యాఖ్యలు చేసిందనే వివరాలు అందులో లేవు. 1949 అంతర్యుద్ధం సమయంలో చైనా నుంచి తైవాన్ వేరుపడింది. చైనాలో కమ్యూనిస్టు పార్టీ అధికారంలోకిరావడంతో, అక్కడ ఓటమిపాలైన వారంతా తైవాన్‌కు వెళ్లారు. అక్కడ సమాంతర ప్రభుత్వాన్ని ప్రకటించుకున్నారు. అప్పటి నుంచి తైవాన్ ఒక స్వతంత్ర దేశం మాదిరిగానే వ్యవహరిస్తున్నది. సొంత సైన్యాన్ని కూడా సమకూర్చుకుంది. అయితే, తైవాన్‌ను స్వతంత్ర దేశంగా అమెరికా ఎన్నడూ గుర్తించలేదు. ఫ్యాక్ట్‌షీట్‌లోనూ ఇదే విషయాన్ని స్పష్టం చేసింది. మొట్టమొదటిసారి 2022లో తైవాన్ స్వాతంత్ర్యాన్ని తాము గుర్తించడం లేదన్న వాక్యాన్ని దాని నుంచి తొలగించింది. చైనా తీవ్రంగా ప్రతిఘటించడంతో, తిరిగి ఆ వాక్యాన్ని చేర్చింది. ఇప్పుడు మరోసారి అలాంటి చర్యకే పాల్పడింది. ఈ పరిణామాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నట్టు చైనా అధికార ప్రతినిధి గువో జియాకున్ స్పష్టం చేశారు. డైలీ మీడియా బ్రీఫింగ్‌లో పాల్గొన్న ఆయన మీడియాతో మాట్లాడుతూ అమెరికా చేష్టలు తైవాన్ అభివృద్ధిని నిరోధించేవిగా ఉన్నాయని అన్నారు. సెమీ కండక్టర్ తయారీలో తైవాన్ శరవేగంగా అభివృద్ధి చెందుతూ, తమను అధిగమించిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల వ్యాఖ్యానించారు. అమెరికాకు ఈ రంగంలో తిరిగి ఆధిపత్యాన్ని అందించడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కాగా, జియాకున్ పరోక్షంగా ట్రంప్ వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ, తైవాన్ అభివృద్ధిని అడ్డుకోవడమేగాక, అక్కడ గందరగోళ పరిస్థితులు సృష్టించే రీతిలో వ్యవహరిస్తున్నదని అన్నారు. తైవాన్ తమ అంతర్ భాగమని, ఏవైనా సమస్యలు ఉంటే చర్చల ద్వారా పరిష్కరించుకుంటామని స్పష్టం చేశారు.



బీజింగ్‌లో సోమవారం ప్రైవేటు వ్యాపార ప్రముఖులతో చైనా అధ్యక్షుడు క్సీ జిన్‌పింగ్. కరోనా మహమ్మారి కారణంగా చైనా ఆర్థిక వ్యవస్థకు జరిగిన నష్టం, ఇటీవల దేశంలో పడిపోయిన రియల్ ఎస్టేట్ వ్యాపారం వంటి అంశాలను ఈ కార్యక్రమంలో చర్చించారు. అలీబాబా సహవ్యవస్థాపకుడు జాక్ మా కూడా ఇందులో పాల్గొనడం విశేషం. ఇటీవల షాంఘైలో జరిగిన ఒక మాట్లాడుతూ, చైనా నియంత్రణ వ్యవస్థ, ఆర్థిక విధాలపై జాక్ మా విమర్శలు కురిపించారు. తాజా సమావేశంలో ఆయన మీడియాకు దూరంగా ఉండడం గమనార్హం. ఈ సమావేశంలో బ్యాటరీ డెవలపర్ 'సిఎటిఎల్' చైర్మన్ జెంగ్ యుక్యున్, ఎలక్ట్రిక్ కార్ల తయారీ సంస్థ 'బివైడి' చైర్మన్ వాంగ్ చువాన్‌ఫూ, 'టెన్‌సెంట్' చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పోనీ మా తదితరులు పాల్గొన్నారు.

# ఈ ఏడాది 5 శాతం అభివృద్ధి

## బడ్జెట్ ప్రవేశపెట్టిన శ్రీలంక అధ్యక్షుడు దిసనాయకే అంచనా



**కొలంబో:** శ్రీలంక ఆర్థిక వ్యవస్థ 2025లో 5 శాతం వృద్ధి చెందుతుందని అంచనా వేస్తున్నట్లు అధ్యక్షుడు అనురా దిసనాయకే సోమవారం ఈ ఏడాది బడ్జెట్‌ను సమర్పిస్తూ చెప్పారు. గత ఏడాది నవంబర్‌లో అధికారంలోకి వచ్చిన నేషనల్ పీపుల్స్ పవర్ (ఎన్‌పిపి) ప్రభుత్వం ప్రవేశపెట్టిన తొలి పూర్తి స్థాయి బడ్జెట్ ఇదే. ఆర్థిక శాఖను కూడా తన వద్ద ఉంచుకున్న దిసనాయకే బడ్జెట్‌ను ప్రవేశపెడుతూ, ఇది మొత్తం ఆర్థిక వ్యవస్థ, విధాన నిర్మాణంలో ప్రభుత్వం అనుసరించే ప్రణాళికలకు ప్రతిబింబమని దిసానాయకే అన్నారు. ఈ బడ్జెట్‌లో చురుగ్గా పాల్గొనేది, వాటాదారులుగా ఉండేది, లబ్ధిదారులు కూడా ప్రజలేనని ఆయన వ్యాఖ్యానించారు. దేశ ఆర్థిక వ్యవస్థకు పునాది వేయడానికి ఉద్దేశించి ఈ బడ్జెట్‌లోని అంశాలను పొందుపరచినట్టు ఆయన పేర్కొన్నారు. 2028 నుంచి విదేశీ రుణాన్ని తిరిగి చెల్లించడం ప్రారంభించే దిశగా అన్ని రకాల ఆర్థికపరమైన చర్యలను నిర్దేశించుకుంటున్నట్టు దిశనాయకే అన్నారు. బలమైన ఆర్థిక వృద్ధి, 2.3 శాతం స్థూల జాతీయోత్పత్తి (జిడిపి)తో ప్రాథమిక మిగులు బడ్జెట్ ప్రవేశపెట్టామని, దీనితోపాటు రుణాలు లేని అభివృద్ధిని సృష్టించడమే లక్ష్యంగా ఎంచుకున్నామని వివరించారు. గత సంవత్సరం, అప్పటి అధ్యక్షుడు రణిల్ విక్రమసింఘే ఆధ్వర్యంలో, శ్రీలంక 2028 వరకు ద్వైపాక్షిక రుణ చెల్లింపులపై మూలధన గ్రేస్ పీరియడ్‌ను పొందిన విషయాన్ని దిశనాయకే ప్రస్తావించారు. ఈ ఏడాది జిడిపిలో 6.7 శాతం లేదా శ్రీలంక రూపాయలు 2.2 ట్రిలియన్ల బడ్జెట్ లోటును అంచనా వేశారని అన్నారు. ఇది అంతకుముందు సంవత్సరం 6.8 శాతంతో పోలిస్తే తగ్గిందని తెలిపారు. అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) కార్యక్రమ లక్ష్యాలకు అనుగుణంగా 2025లో పన్ను రాబడిని జిడిపిలో 15 శాతానికి పెంచాలని భావిస్తున్నట్లు తెలిపారు.ప్రభుత్వ సేవలను డిజిటలైజ్ చేసేందుకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని, నగదు రహిత ఆర్థిక వ్యవస్థ దిశగా పయనిస్తుందని దిసానాయకే చెప్పారు.

# డోగె పేరుతో మస్క్ చర్యలకు వ్యతిరేకంగా 'టెస్లా' షోరూమ్‌ల ఎదుట నిరసనల వెల్లువ








**వాషింగ్టన్ :** అమెరికా వ్యాప్తంగా 'టెస్లా' ఎలక్ట్రిక్ షోరూమ్‌ల ఎదుట శనివారం నాడు పలువురు పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేశారు. సుమారు 50 ప్రాంతాలలో ఈ నిరసనలు జరిగాయి. 'డోంట్ బై స్వస్తిక్(నాజీ చిహ్నం) కార్స్','టెస్లా కార్‌ను ఫాజిజం నడిపిస్తోంది'' ''నాజీ కార్‌ను ఎవరు కొంటారు?'', ''టెస్లా ఫాజిస్టులకు నిధులు ఇస్తోంది'', ''మస్క్‌ను గెంటేయండి'' అంటూ నిరసనకారులు నినాదాలు చేస్తూ, ప్లకార్డులు పట్టుకొన్నారు. ప్రభుత్వ ఖర్చు తగ్గింపునకు డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియెన్సీ(డోగె) పేరుతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఒక విభాగాన్ని ఏర్పాటు చేశారు. దీనికి ప్రత్యేక ప్రభుత్వ ఉద్యోగిగా ఎలాన్ మస్క్‌ను నియమించారు. ప్రభుత్వ వ్యయం తగ్గింపులో భాగంగా వేలాది ఫెడరల్ ఉద్యోగుల లే ఆఫ్‌ను తొలగించడం, కొత్తగా ఎవరినీ నియమించుకోకపోవడం వంటి చర్యలను మస్క్ తీసుకుంటున్నారు. ఈ చర్యల ద్వారా వృథా ఖర్చును తగ్గిస్తున్నానని, ప్రభుత్వం సాఫీగా సాగేందుకు చర్యలు తీసుకుంటున్నానని ఆయన గొప్పగా చెప్పుకుంటున్నారు. దీనిపై అనేక మంది అమెరికన్‌లు మండిపడుతున్నారు. ప్రభుత్వాన్ని పని చేయనీయకుండా, ఎన్నికైన నాయకులకు నిర్ణయాలు తీసుకునే అవకాశం ఇవ్వకుండా, ప్రజల ప్రైవేటు సమాచారాన్ని పొందడం వంటివి మస్క్ చేస్తున్నారని వారు విమర్శిస్తున్నారు. 'ఇది ప్రభుత్వాన్ని ఆధీనంలో తీసుకోవడమే' అని డేల్ కోయిస్టెనిన్ అనే 84 సంవత్సరాల వ్యక్తి 'బీబిసి'తో తన ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ప్రముఖ సామాజిక మాధ్యమం 'ఎక్స్', ఎలక్ట్రికల్ కార్ల కంపెనీ 'టెస్లా'తో పాటు స్పేస్ ఎక్స్‌కు ఎలాన్ మస్క్ అధిపతి. కానీ ఆయన 'టెస్లా' కారణంగానే ప్రపంచ వ్యాప్తంగా ప్రఖ్యాతి పొందారు. అందుకే ఆయన నేతృత్వంలో డోగె తీసుకుంటున్న చర్యల పట్ల ఆగ్రహానికి గురైన ప్రజలు తమ నిరసనను వ్యక్తం చేసేందుకు 'టెస్లా' ఎలక్ట్రిక్ కార్ల షోరూమ్‌లను ఎంచుకున్నారు. వారు తమ నిరసనల ప్రణాళికలను పంచుకునేందుకు మస్క్ చెందిన 'ఎక్స్'ను కాకుండా దానికి పోటీగా ఎదుగుతున్న 'బ్లూ స్కై' సామాజిక వేదికను వినియోగిస్తున్నారు. అందులో ఎప్పుడు, ఎలా, ఎక్కడ కలవాలి, ఎలా నిరసన వ్యక్తం చేయాలని చర్చించుకుంటున్నారు. ఆ విధంగా నిర్ణయించిన మేరకు శనివారం అమెరికాలో 'టెస్లా' షోరూమ్‌ల ఎదుట పెద్ద ఎత్తుననిరసన ప్రదర్శనలు జరిగాయి. ప్రముఖ మ్యూజిక్ స్టార్ షెరిల్ క్రో తన వద్దనున్న టెస్లా షేర్లను అమ్మేసి, వచ్చిన నిధులను విరాళంగా ఇవ్వాలని నిర్ణయించారు.

ప్రపంచం

# లెబనాన్‌పై ఇజ్రాయెల్ డ్రోన్ దాడి



**జెరుసలేం:** లెబనాన్‌పై ఇజ్రాయెల్ సోమవారం డ్రోన్ దాడికి పాల్పడింది. అది నేరుగా ఒక కారును ఢీకొనడంతో, ఒకరు మృతి చెందినట్టు సమాచారం. లెబనాన్ అధికార వార్తాసంస్థ 'నేషనల్ న్యూస్ ఏజెన్సీ' కథనాన్ని అనుసరించి, గత ఏడాది నవంబర్ చివరిలో హమాస్‌తో కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన తర్వాత లెబనాన్‌లో ఇజ్రాయెల్ దాడి చేయడం ఇదే మొదటిసారి. దాడికి సంబంధించిన ఫుటేజీని లెబనాన్ అధికారులు విడుదల చేశారు. అయితే, ఇజ్రాయెల్ అధికారులుగానీ, సైన్యంగానీ ఈ దాడిని ధ్రువీకరించలేదు.

# శాంతి చర్చల కోసం అరబ్ ఎమిరేట్స్‌కు జెలెన్‌స్కీ



**దుబాయ్:** రష్యా–ఉక్రేన్ దేశాల మధ్య సుమారు మూడు సంవత్సరాలుగా సాగుతున్న యుద్ధానికి తెరపడే అవకాశాలు ఉన్నాయి. ఈ క్రమంలోనే, శాంతి చర్చల కోసం యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యుఎఇ)కి చేరుకున్న ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ, పలువురు నేతలను కలుస్తారని సమాచారం. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఎన్నికల ప్రచారంలో ఇజ్రాయెల్–హమాస్ యుద్ధంతోపాటు, రష్యా–ఉక్రేన్ యుద్ధానికి కూడా తెరదించే ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు. ఆ క్రమంలో ఆయన ప్రయత్నాలు జోరందుకున్నాయి. సౌదీ అరేబియాలో శాంతి చర్చలు జరగనున్నాయి. భారీ మానవీయ సహాయాన్ని కోరేందుకు వచ్చినట్టు జెలెన్‌స్కీ అంటున్నప్పటికీ, శాంతి చర్చలే ప్రధాన అజెండాగా పరిశీలకులు పేర్కొంటున్నారు. ఇలా వుంటే, అమెరికా–రష్యా మధ్య సౌదీ అరేబియా వేదికగా ఉక్రేన్‌తో శాంతికి సంబంధించిన చర్చలు జరగనున్నాయి. అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో, పశ్చిమాసియా ప్రతినిధి స్టీవ్ విట్‌కాఫ్, జాతీయ భద్రతా సలహాదారు మైక్ వల్ట్జ్ సౌదీ చేరారు. రియాద్‌లో జరిగే సమావేశంలో వారు పాల్గొంటారు. అదే విధంగా, రష్యా ధికారులు కూడా యుఎఇకి వెళ్లి, అమెరికా అధికారులతో భేటీ అవుతారని క్రెమ్లిన్ ప్రకటించింది. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ యుఎఇ వేదికగానే భేటీ అవుతారని అంటున్నారు. అయితే, దీనికి సంబంధించిన వివరాలు ఇంకా తెలియరాలేదు. మొత్తానికి జెలెన్‌స్కీ అరబ్ ఎమిరేట్స్ చేరడంతో, యుద్ధం ముగుస్తుందనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది.

## ఆదాయంలో బిజెపి టాప్

(మొదటి పేజీ తరువాయి)

సంవత్సరంలో బిజెపి మొత్తం ఆదాయం రూ. 4,340.473 కోట్లుగా ప్రకటించింది. అందులో రూ. 2,211.69 కోట్లు (50.96 శాతం) ఖర్చు చేసింది. కాంగ్రెస్ మొత్తం ఆదాయం రూ. 1,225.12 కోట్లు కాగా, రూ. 1,025.25 కోట్లు (83.69 శాతం) ఖర్చు చేసినట్లు ఎడిఆర్ నివేదికలో వెల్లడయింది. జాతీయ పార్టీలకు ఎక్కువ మొత్తంలో ఎలక్టోరల్ బాండ్ల ద్వారానే విరాళాలు వచ్చాయి. బిజెపికి అత్యధికంగా రూ. 1,685.63 కోట్లు రాగా, కాంగ్రెస్ 828.36 కోట్లు, ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్)కు రూ. 10.15 కోట్లు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఈ మూడు పార్టీల ఆదాయం రూ. 2,524.1361 కోట్లు (46.36 శాతం) పెరిగింది. ఎన్నికల బాండ్ల పథకం రాజ్యాంగవిరుద్ధమైనదని, ఏకపక్షమైనదని గత సంవత్సరం మేలో సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఎడిఆర్ దాఖలు చేసిన ఆర్‌టిఐ దరఖాస్తుకు ప్రతిస్పందనగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అందించిన డేటా ప్రకారం, 2023–24 ఆర్థిక సంవత్సరంలో వివిధ రాజకీయ పార్టీలు రూ.4,507.56 కోట్ల విలువైన ఎన్నికల బాండ్లను తిరిగి చెల్లించాయి. ఈ మొత్తంలో జాతీయ పార్టీలు 55.99 శాతం రూ.2,524.1361 కోట్లు ఖర్చు చేశాయి. కాంగ్రెస్ ఎన్నికల సంబంధిత ఖర్చుల కోసం గరిష్టంగా రూ.619.67 కోట్లు ఖర్చు చేసింది. రూ.340.702 కోట్లు పరిపాలనా, సాధారణ ఖర్చుల కోసం ఖర్చు చేసింది. కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్ట్) పరిపాలనా, సాధారణ ఖర్చుల కోసం రూ.56.29 కోట్లు, ఉద్యోగుల ఖర్చుల కోసం రూ.47.57 కోట్లు ఖర్చు చేసింది. జాతీయ పార్టీలలోని ఆరు పార్టీలు విరాళాల ద్వారా మొత్తం రూ.2,669.87 కోట్లు అందుకున్నట్లు ప్రకటించాయి. ఆరు పార్టీలలో కాంగ్రెస్ (రూ. 58.56 కోట్లు), సిపిఐ(ఎం) (రూ. 11.32 కోట్లు) మాత్రమే కూపన్ల అమ్మకం ద్వారా మొత్తం రూ. 69.88 కోట్ల ఆదాయం అందుకున్నట్లు ప్రకటించాయని నివేదిక పేర్కొంది. సిపిఐ(ఎం), కాంగ్రెస్, బిజెపిల ఆడిట్ నివేదికలు 12 నుండి 66 రోజుల ఆలస్యంతో సమర్పించబడ్డాయి

## రాష్ట్రానికి బిసి సిఎం

(మొదటి పేజీ తరువాయి)

ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎఐసిసి ఒబిసి విభాగం అధ్యక్షుడు అజయ్ సింగ్‌తో కలిసి మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ వచ్చే మంత్రి వర్గంలో బిసిలకు అవకాశం ఉంటుందని చెప్పారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పించాలన్న చిత్తశుద్ధి బిజెపికి లేదని, పదేళ్లు అధికారంలో ఉన్న బిఆర్ఎస్ కూడా బిసిలను పట్టించుకోలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం బిసిలకు 42 శాతం రిజర్వేషన్లకు చట్టబద్ధత ఇవ్వబోతున్నామన్నారు. బిసిలకు రాజ్యాధికారం ఇవ్వాలని రాహుల్‌గాంధీ నిర్ణయం తీసుకున్నారని, వచ్చే ఎన్నికలు బిసిల చుట్టే తిరుగుతాయని చెప్పారు . బండి సంజయ్ సెక్యులర్ స్టేట్‌లో మంత్రిగా ఉండి ముస్లిం గురించి ఇష్టమొచ్చినట్టుగా ఎలా మాట్లాడుతారని ప్రశ్నించారు.

ఒబిసి విభాగం అధ్యక్షుడు అజయ్ సింగ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో చేపట్టిన కులగణన దేశంలోని అన్ని రాష్ట్రాలకు కనువిప్పు కలుగుతుందని, ఇదొక గేమ్ చేంజర్ గా మారబోతుందన్నారు. కులగణన సర్వే అనేది ఒక తాళం చెవి లాంటిదన్నారు. దేశంలో 1 శాతం జనాభా ఉన్న ఉన్నత కులాల వారి వద్దనే 40 శాతం దేశ సంపద ఉన్నదని వివరించారు. న్యాయ వ్యవస్థలో 661లో 78 ఒబిసి,17 ఎస్‌టి, 20 ఎస్‌సివర్గాల వారు ఉన్నారన్నారు. బిసిల క్రిమిలేయర్‌ను రూ.8 నుంచి 12 లక్షలకు పెంచాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రతిపక్షాలపైన కేంద్ర ప్రభుత్వం సిబిఐ, ఇడి, ఐటిలతో దాడులు చేపిస్తోందని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ ముస్లిం పార్టీ అని బిజెపి, ఆర్ఎస్ఎస్ ఆరోపిస్తుందని మండిపడ్డారు. బిజెపి సీనియర్‌నాయకులు అద్వానీ ఇద్దరు కుమార్తెలు, మురళీ మనోహర్ జోషి ఒకకుమార్తె ముస్లింవారితో వివాహం జరిగిందని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టబోతున్న బిసి రిజర్వేషన్ల బిల్లును కేంద్ర ప్రభుత్వం 9వ షెడ్యూల్‌లో చేర్చి, బిసిల పట్ల తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని బిజెపి నేతలకు హితువుపలికారు. ఇవిఎంలను నిషేధించాలన్నదే కాంగ్రెస్ నినాదమని, బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు.

## తక్షణమే రేషన్‌కార్డులు

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రమంతంట దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ రేషన్ కార్డులను జారీ చేయాలని, ముందుగా ఎంఎల్‌సి ఎన్నికల కోడ్ లేని జిల్లాలో రేషన్ కార్డులను తక్షణమే అందించేందుకు చర్యలు తీసుకోవాలని పౌరసరఫరా శాఖ అధికారులను అదేశించారు. అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు ఇవ్వాల్సిందేనని, ప్రజా పాలన, కుల గణన. గ్రామ సభలతో పాటు మీ సేవా కేంద్రాల ద్వారా వచ్చిన దరఖాస్తులన్నింటినీ పరిశీలన ప్రక్రియను శరవేగంగా పూర్తి చేయాలన్నారు.ఇప్పటికే పలుమార్లు దరఖాస్తులకు వకాశమిచ్చినప్పటికీ, మీ సేవా కేంద్రాల వద్ద రేషన్ కార్డులకు ఎందుకు రద్దీ నెలకొందని సిఎం ఆరా తీశారు. దరఖాస్తు చేసిన కుటుంబాలే మళ్లీ మళ్లీ చేస్తున్నాయని, అందుకే రద్దీ ఉంటుందని అధికారులు వివరణ ఇచ్చారు. దీంతో వెంటనే కార్డులు జారీ చేస్తే ఈ పరిస్థితి తలెత్తేది కాదని సిఎం అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆలస్యం చేయకుండా తక్షణమే కొత్త కార్డులు జారీ చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సీఎం ఆదేశించారు. అదేవిధంగా ఇప్పటికే కార్డుల కోసం దరఖాస్తు చేసిన కుటుంబాలు మళ్లీ మళ్లీ దరఖాస్తులు చేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ముందుగా ఎన్నికల కోడ్ అమలులో లేని జిల్లాల్లో కార్డులను జారీ చేయాలని చెప్పారు. కోడ్ ముగిసిన తర్వాత అన్ని జిల్లాల్లో కొత్త కార్డులు ఇవ్వాలని సూచించారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, పౌరసరఫరాల శాఖ కమిషనర్ డి.ఎస్ చౌహాన్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## విజిలెన్స్ దాడులు (మొదటి పేజీ తరువాయి)

జియాలజీ శాఖ అధికారులు చర్యలకు ఉపక్రమించారు. ఇందులో భాగంగా సచివాలయంలో సోమవారం మైన్స్‌అండ్ జియాలజీ శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.శ్రీధర్ మీడియా సమావేశంలో ప్రభుత్వం చేపట్టబోతున్న చర్యలను వివరించారు. ఈ నెల 1వ తేదీ నుంచి 12వ తేదీ వరకు మొత్తం 1222 ఇసుక వాహనాలను తనిఖీ చేపట్టామని, ఇందులో ఓవర్‌లోడ్‌తో వెళ్లుతున్న 136 లారీలపై కేసులు నమోదు చేయగా, 111 వాహనాలను సీజ్ చేయడంతో పాటు 21 మంది డ్రైవర్ల లైసెన్స్‌లను రద్దు చేసినట్లు వెల్లడించారు. రూ.14.28 లక్షల జరిమానాలను విధించనట్లు తెలిపారు. అక్రమ ఇసుక రవాణాకు సంబంధించి ప్రత్యేకంగా నంబర్లను ఏర్పాటు చేసినట్లు ఆయన ప్రకటించారు. 9848094373, 7093914343 నంబర్ల ద్వారా ఎవరైనా ఫిర్యాదు చేయవచ్చాని అధికారులు అప్పటికప్పుడు స్పందించి చర్యలు తీసుకుంటారని శ్రీధర్ వెల్లడించారు. ఇసుక సరఫరాకు లోటు లేకుండా ఇక 24 గంటల పాటు స్లాట్ బుకింగ్ సదుపాయం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఇందుకు సంబంధించి అధికారులు అదేశాలు జారీ చేశామని చెప్పారు. అదేవిధంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇందిరమ్మ ఇళ్లకు ఉచిత ఇసుకను అందించనున్నామని తెలిపారు.

## ఢిల్లీలో భూకంపం (మొదటి పేజీ తరువాయి)

గుర్తించారు. ప్రకంపనలు సంభవించిన సమయంలో పెద్ద శబ్దం వచ్చినట్లు కొంత ప్రజలు చెబుతున్నారు. ఐదు కిలోమీటర్ల లోతున నెలకొని ఉన్న భూకంప కేంద్రం నుంచి ఉదయం 5.36 గంటలకు ప్రకంపనలు వచ్చినట్లు జాతీయ భూకంపాల కేంద్రం వెల్లడించింది. ఉపరితలం నుండి ఐదు లేదా 10 కిలోమీటర్ల దిగువన ఉద్భవించే నిస్సార భూకంపాలు, ఉపరితలం క్రింద ఉద్భవించే వాటి కంటే ఎక్కువ నష్టాన్ని కలిగిస్తాయి. ప్రతి రెండేళ్లకోసారి రిఝల్ పార్క్ ప్రాంతంలో చిన్న, స్వల్ప పరిణామం గల భూకంపాలు సంభవిస్తుంటాయి. 2015లో 3.3 తీవ్రతతో భూకంపం వచ్చినట్లు అధికారులు తెలిపారు. కాగా, ఢిల్లీలో అందరూ సురక్షితంగానే ఉన్నట్లు తాము భావిస్తున్నామని ఢిల్లీ పోలీసులు ఎక్స్‌లో తెలిపారు. ఏదైనా అత్యవసర అయితే 112 హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేయాలని పౌరులకు సూచించారు. భూకంపం వల్ల బలమైన ప్రకంపనలు రావడంతో ఢిల్లీ, నోయిడా, గ్రేటర్ నోయిడా, గజియాబాద్‌లో అనేక ఎత్తయిన భవనాల్లో నివసిస్తున్న నివాసితులు భయాందోళనలతో ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. ఉదయం నడకకు వచ్చిన నోయిడా సెక్టార్ 20లోని 'ఇ' బ్లాక్‌లో నివాసం ఉండే 50 మహిళ మాట్లాడుతూ తాము పార్కులో నడుస్తుండడం వల్ల తమకు అంతగా అనిపించలేదని, కానీ భూకంపం బలంగా వచ్చిందన్నారు. మరి కొన్ని ప్రకంపనలు వస్తాయేమోనన్న భయంతో ఢిల్లీ– ఎన్‌సిఆర్ వ్యాప్తంగా ప్రజలు తమ ఇళ్ల నుంచి బయటకు వచ్చి నిలబడిన చిత్రాలు కనిపించాయి. పశ్చిమ ఢిల్లీ వాసి నరేశ్ కుమార్ మాట్లాడుతూ తాను తొలిసారిగా బలమైన భూకంపం రావడం చూశానన్నారు. ప్రయాగ్‌రాజ్‌కు వెళ్లేందుకు న్యూఢిల్లీ రైల్వేస్టేషన్‌లో వేచి ఉన్న రతన్‌లాల్ శర్మ మాట్లాడుతూ తాను ఫ్లాట్‌పారంపై ఉండగా ఒక్కసారిగా భూ ప్రకంపనలు వచ్చాయన్నారు. రైలు ఒక్కసారి వచ్చి ఆగినట్లుగా అనిపించిందని చెప్పారు. ఆప్ నేత ఆతిశీ ఎక్స్‌లో పోస్టు చేస్తూ ఢిల్లీలో బలమైన భూకంపం వచ్చిందన్నారు. అందరూ క్షేమంగా ఉండాలని తాను ఆకాంక్షిస్తున్నానన్నారు. ఢిల్లీలో వెనువెనంటే పది నిమిషాల పాటు పెద్ద ఎత్తున భూ ప్రకంపనలు వచ్చాయని ఎఐసిసి జాతీయ అధికార ప్రతినిధి రాగిని నాయక్ ఎక్స్‌లో పేర్కొన్నారు. భూకంప హిమాలయ తాకిడి జోన్ నుండి దాదాపు 250 కిలోమీటర్ల దూరంలో ఢిల్లీ ఉంది. దూర, సమీప భూకంపాల నుండి తరచుగా ప్రకంపనలు వస్తుంటాయి. ఢిల్లీ భారతదేశంలోని భూకంప జోనింగ్ మ్యాప్‌లో భూకంప జోన్–4లో ఉంది। ఇది దేశంలో రెండవ అత్యధికం. ఏప్రిల్ 12, 2020న ఈశాన్య ఢిల్లీలో 3.5తీవ్రతతో కూడిన భూకంపం, మే 10, 2020న 3.4తీవ్రతతో కూడిన భూకంపం, మే 29, 2020న రోహ్‌తక్ సమీపంలో (ఢిల్లీకి పశ్చిమాన 50 కిలోమీటర్లు) 4.4తీవ్రతతో కూడిన భూకంపం, దాని తర్వాత డజనుకు పైగా అనంతర ప్రకంపనలు జనసాంద్రత కలిగిన ఆవాసాలలో భయాందోళనలను రేకెత్తించాయి. హర్యానాలో కూడా 2022–23లో స్వల్ప భూకంపాలు నమోదయ్యాయి.

## నీరు విడుదల (మొదటి పేజీ తరువాయి)

పడకుండా, పంటలు ఎండిపోకుండా అవసరమైన అన్ని జాగ్రత్తలనూ తీసుకోవాలని సిఎం స్పష్టం చేశారు. రాష్ట్రంలో ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు, పంటలకు సాగు నీటి విడుదలపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సోమవారం కమాండ్ కంట్రోల్ సెంటర్ లో సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. శ్రీశైలం, నాగార్జునసాగర్, ఎస్ఆర్ఎస్‌పితో పాటు ప్రధాన ప్రాజెక్టుల్లో ఉన్న నీటి నిల్వలు, నీటి వినియోగ వివరాలను సిఎం అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టుల్లో ఉన్న నీటిని సమర్థవంతంగా వినియోగించుకోవాలని, సాగు, తాగునీటికి ఎక్కడా ఇబ్బంది రాకుండా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను అప్రమత్తం చేశారు. ఎండలు పెరిగిన కొద్దీ తలెత్తే గడ్డు పరిస్థితులను ముందస్తు అంచనా వేసుకుని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మూడు నెలల పాటు అప్రమత్తంగా ఉండాలని నీటి పారుదల శాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. అధికారులు ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయికి వెళ్లి పరిస్థితులను పరిశీలించాలని, వాటికి అనుగుణంగా పరిష్కార మార్గాలను అనుసరించాలని చెప్పారు. నాగార్జున సాగర్, ఎస్ఆర్ఎస్‌పి ప్రాజెక్టుల పరిధిలోని ఆయకట్టు పంటలు, నీటి విడుదలపై ఆయా జిల్లాల కలెక్టర్లు సంబంధిత ఇరిగేషన్ ఇంజనీర్లతో వెంటనే సమీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. ప్రాజెక్టులు, కాల్వలు, ఆయకట్టులో పంటలు, నీటి విడుదల తీరును కలెక్టర్ల స్వయంగా పరిశీలించాలని సూచించారు. నిర్ణీత ఎజెండాను ఖరారు చేసుకుని అన్ని జిల్లాల కలెక్టర్లతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి, తగిన ఆదేశాలు జారీ చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారిని ముఖ్యమంత్రి ఆదేశించారు.

**నీటి తరలింపుపైన 'ఎపి' పైన కేంద్రానికి ఫిర్యాదు చేయండి**

నిర్ణీత వాటా కంటే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎక్కువగా నీటిని తరలించకుండా కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని, ఎపి ఏకపక్షంగా నీటిని తరలించే విషయంపై వెంటనే కేంద్రానికి ఫిర్యాదు చేయాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. శ్రీశైలం, నాగార్జునసాగర్ నుంచి కృష్ణజలాలను వినియోగించుకునే విషయంలో అప్రమత్తంగా ఉండాలని, నిర్ణీత కోటా కంటే ఎపి ఎక్కువ నీటిని తరలించకుండా అడ్డుకట్ట వేసేందుకు టెలిమెట్రీ విధానమే పరిష్కారమని సిఎం స్పష్టం చేశారు. కాగా టెలిమెట్రీ విధానం అమలుకు అయ్యే ఖర్చులో సగం నిధులను చెల్లించేందుకు ఎపి ప్రభుత్వం ముందుకు రావడం లేదని అధికారులు సిఎం దృష్టికి తీసుకురాగా, సిఎం స్పందిస్తూ టెలి మెట్రీ విధానం అమలుకు అవసరమైన నిధులన్నీ ముందుగా మన ప్రభుత్వమే చెల్లిస్తుందని, వెంటనే టెలిమెట్రీ అమలుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ,వెంటనే కెఆర్ఎంబికి లేఖ రాయాలని సిఎం రేవంత్ రెడ్డి రాష్ట్ర నీటి పారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జాను ఆదేశించారు. నీటి వాటాల పంపిణీ, నీటి వాటాల వినియోగాన్ని లెక్కించే బాధ్యత కేంద్ర జల సంఘంపైనే ఉన్నదని అన్నారు.

## సిండికేట్ (మొదటి పేజీ తరువాయి)

గతేడాది రూ. 11,150 చొప్పున కొనుగోలు చేశారు. రైతుల వద్దకు వచ్చేసరికి ధర తగ్గించేస్తున్నారు. రైతులకు ఒక ధర, దిగుమతికి మరో ధర, అటవీ భూముల్లో సాగు చేసిన జామాయిల్ కొనుగోలు చేసేటప్పుడు మరో విధంగా కంపెనీలు ఎందుకు వ్యవహరిస్తున్నారన్న ప్రశ్నకు సమాధానం లేదు. సాగు చేసిన రైతు అమ్ముకోక ఏమి చేస్తాడన్న ధోరణిలోనే వ్యవహరిస్తున్నారు తప్ప రైతు పక్షాన ఆలోచన చేయడం లేదన్న విమర్శలు వినవస్తున్నాయి. ఇదే సందర్భంలో రైతులు నేరుగా పేపర్ మిల్లులకు సరఫరా చేసే పరిస్థితి లేదు. చిన్న చిన్న వ్యాపారులు రైతుల వద్ద నుంచి సుబాబుల్ కొనుగోలు చేసి కంపెనీలకు విక్రయిస్తారు. రెండు నెలల్లోనే రూ. 1,300 టన్నుకు తగ్గించేసరికి రైతుల వద్ద నుంచి చిన్న చిన్న వ్యాపారులు సుబాబుల్, జామాయిల్ కర్రను కొనుగోలు చేయడం లేదు. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉమ్మడి ఖమ్మంజిల్లాలో వేలాది ఎకరాల్లో పంటలను సాగు చేశారు. ధర తగ్గడంతో తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. ప్రభుత్వం కంపెనీలు, రైతులతో మాట్లాడి రైతుల మధ్య సమన్వయం చేసి సుబాబుల్, జామాయిల్ ధరలను పెంచేవిధంగా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. మరో పక్క 40 రోజుల్లో రూ.1300 టన్నుకు ధర తగ్గిన నేపథ్యంలో మధిర మండలం దెందుకూరుకు చెందిన చిరు వ్యాపారి సోమవారం గుండెపోటుకు గురై మువ్వా వీరయ్య అనే వ్యక్తి మరణించాడు. ఈ ఏడాది వ్యవసాయ ఉత్పత్తుల ధరలు రైతులను తీవ్రంగా దెబ్బతీశాయి. గతేడాది రూ. 20వేలు పైబడి పలికిన మిర్చి ధర రూ. 13వేల లోపు పలుకుతుండగా గతేడాది ఏడువేలు పైబడి పలికిన పత్తి ధర ఈ ఏడాది నాలుగువేలకు మించి పలక లేదు. సుబాబుల్ పరిస్థితి కూడా అదే రీతిలో సాగి రైతులు ఆందోళన బాట పట్టక ముందే సమస్యకు తగు పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

## పెద్దగట్టుకు పోటెత్తిన జనం

(మొదటి పేజీ తరువాయి)

భుజాన వేసుకొని వీరడోలు మోగిస్తూ భక్తులు చేసిన సందడి అంతా ఇంత కాదు. భూమి అదిరేలా... దిక్కులు పిక్కటిల్లేలా లింగా... ఓ లింగా... అంటూ చేసిన నృత్యాలు చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఆదివారం అర్ధరాత్రి నుండి మొదలైన గంపల ప్రదర్శన సోమవారం ఉదయం 9 గంటల వరకు కొనసాగింది. అనంతరం భక్తులు గట్టుపై ఉన్న శ్రీ లింగమంతులస్వామి శాఖహారి కావడంతో చౌడమ్మ తల్లికి బోనాలు చెల్లించి మేకలు, గొర్రెపోతులు, కోళ్లను బలి ఇచ్చి, తలనీలాలు సమర్పించి మొక్కులను చెల్లించారు. దీంతో పెద్దగట్టు జంతుబలితో ఒక్కసారిగా రక్తం ఎరులై పారి ఎరుపెక్కింది. భక్తులు స్వామివారికి కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. సంతానం లేని మహిళలు దేవస్థానం చుట్టూ తడిబట్టలతో పానసారాలు పంది తమ కొరికలు తీర్చాలని స్వామివారిని వేడుకున్నారు. గట్టుపై బండమీద జాగిలాకు ప్రసాదం పోసి గొల్లలు తిన్నారు.

**కట్టుదిట్టమైన చర్యలు**

స్వామివారి దర్శనం కోసం వచ్చే భక్తులకు ఏలాంటి అసౌకర్యాలు కలగకుండా ఆయా శాఖల అధికారులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. పోలీస్ శాఖ వారు గట్టు పరిసర ప్రాంతాల్లో 2వేల మందితో భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. 60 నిఘా నేత్రాలను ఏర్పాటు చేసి ప్రతిక్షణం ఏం జరుగుతుందో జిల్లా ఎస్‌పి సన్ ప్రీత్ సింగ్ పర్యవేక్షించారు. వైద్య ఆరోగ్యశాఖ వారు అస్వస్థతకు గురైన భక్తులకు ప్రథమ చికిత్స అందించేందుకు ప్రత్యేక క్యాంపులను ఏర్పాటు చేసి సేవలందించారు. అగ్నిమాపక సిబ్బంది తమ వాహనాలను జాతర వద్ద సిద్ధంగా ఉంచారు. దేవాదాయ, మున్సిపల్ పారిశుధ్య సిబ్బంది నిరంతరం గట్టు పైన, పరిసర ప్రాంతాల్లో చెత్తచెదారం తొలగింపు పనులు చేపట్టారు. గట్టుపై ఉన్న జంతుబలితో ఉన్న రక్తపు మరకలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసి బ్లిచింగ్ పౌడర్ చల్లారు. టిజిఆర్‌టిసి సూర్యాపేట డిపో నుండి జాతరకు 60 ప్రత్యేక బస్సు సర్వీసులను నడిపి భక్తులను చేరవేసింది. పోలీసులు 65వ నెంబర్ జాతీయ రహదారిపై వాహనాల మళ్లింపును కొనసాగించారు.

# గాడితప్పి మాట్లాడుతున్న బండిసంజయ్

## మాజీ ఎంపి మధుయాస్కీగౌడ్




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కేంద్ర మంత్రి బండి సంజయ్ గాడి తప్పినబండిలాగ మాట్లాడుతున్నారని టిపిసిసి ప్రచార కమిటీ చైర్మన్ మధుయాస్కి గౌడ్ ఎద్దేవా చేశారు. రాజ్యాంగం మీద ప్రమాణం చేసిన మంత్రి, రాజ్యాంగానికి వ్యతిరేకంగా ఏ కులం అని ప్రశ్నిస్తున్నారని, బండి సంజయ్‌కి మంత్రి పదవిలో ఉండేందుకు అర్హులు కాదన్నారు. బిజెపిలోనే రాష్ట్ర అధ్యక్ష పదవి కోసం పోటీ నడుస్తోందన్నారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో సోమవారం ఆయన జర్నలిస్టులతో ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల్లో బిజెపి, బిఆర్ఎస్ కలిసి పోటీ చేస్తాయని ఆరోపించారు. జాతీయ జెండానే తన మతం అని జైపూర్‌లో జరిగిన సమావేశంలో రాహుల్ గాంధీ తన మతంపై స్పష్టత ఇచ్చారన్నారు. కులగణనపైన తమ వైఖరి చెప్పకుండా తప్పించుకునేందుకే బిజెపి రాహుల్ గాంధీ కులం ఏమిటో అని ప్రశ్నిస్తుందని అన్నారు. రాజ్యాంగంలో ఉన్న వ్యక్తులు అన్ని మతాలనూ సమానంగా చూడాలని, కానీ ఏ ఒక్క కులాన్ని, మతాన్ని విమర్శించొద్దని సూచించారు. కులాలు, మతాల పేరుతో విభజించి, పాలించే బిజెపి నాయకులు పాత బస్తీలో అల్లర్లను సృష్టిస్తారని ఆరోపించారు. రాజకీయ లబ్ధి కోసం కులం, మతాన్ని వాడుకోవడం ప్రధానమంత్రి స్థాయికి తగదని హితవుపలికారు. కులగణన సర్వేలో అందరూ పాల్గొనేలా బిసి సంఘాలు, మేధావులు కృషి చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఎల్‌బినగర్ డిసిపి ఫుల్ టైమ్ ల్యాండ్ సెటిల్‌మెంట్ చేస్తారని, పార్ట్ టైంగా తన ఉద్యోగం చేస్తారని ఆరోపించారు. ఒక భూ వివాదంలో తల దూర్చి, డాక్యుమెంట్స్‌ను తీసుకువస్తే సెటిల్ చేస్తానని ఒత్తిడి చేశారని ఆయన చెప్పారు. ఈ విషయాన్ని సిఎం దృష్టికి తీసుకువెళ్తానని అన్నారు. అధికారుల విషయంలో సిఎం రేవంత్ రెడ్డి చెప్పింది వాస్తవమేనని మధుయాస్కి గౌడ్ అన్నారు.

**ప్రజల ఆకాంక్షల మేరకు కులగణన చేపట్టిన సిఎం :**
ప్రజల ఆకాంక్షల మేరకే సిఎం రేవంత్ రెడ్డి కులగణన చేపట్టారని మధుయాస్కి గౌడ్ తెలిపారు. రేవంత్ రెడ్డి సమర్థవంతంగా పనిచేస్తున్నారని, ప్రస్తుతం రాష్ట్రంలో సిఎం స్థానం ఖాళీగా లేదన్నారు. కెటిఆర్, కవిత బిసిల గురించి మాట్లాడటం దెయ్యాలు వేదాలు వల్లించినట్టుగా ఉన్నదని ఎద్దేవా చేశారు. భవిష్యత్‌లో కొడుకు, కూమార్తె ముఖ్యమంత్రులు కాబోరని, అందుకే ఇప్పటికైనా ఒక దళితుడిని సిఎంగా చేస్తానని, కొడుకు, కుమార్తె, అల్లునితో కలిసి కెసిఆర్ ప్రమాణం చేయాలని సూచించారు.

**బిసి రాజ్య స్థాపనకు పక్కా ప్రణాళిక కావాలి :**
బిసి రాజ్యస్థాపన ఒక ప్రకటనతోనే కాదని, పక్కా ప్రణాళిక అవసరమని మధుయాస్కిగౌడ్ అన్నారు. సమైక్య రాష్ట్రంలో బిసిలకు ఎదిగేందుకు అవకాశం లభించలేదని చెప్పారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత దొరల పాలన కొనసాగిందన్నారు. 2013 సంవత్సరం ఢిల్లీ ఎన్నికల్లో ఆమ్‌ఆద్మీ పార్టీతో కాంగ్రెస్ పొత్తు పెట్టుకున్నప్పుడే కాంగ్రెస్ బలహీన పడిందని ఆయన చెప్పారు. ఆమ్ ఆద్మీ పార్టీని పెంచి పోషించే బిజెపి అని మధుయాస్కి ఆరోపించారు.

# లౌకికవాదం గాడితప్పితే దేశానికి ప్రమాదం

## సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్ రెడ్డి




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పాలకులనేవారు ప్రజల సేవకులని, వారు రాజ్యాంగం ప్రకారం నడుచుకుంటే లౌకిక వాదం పరిఢవిల్లుతుందని సుప్రీం కోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి అన్నారు. కాని భారతదేశం నిర్దేశించుకున్న ప్రజాస్వామ్య లక్ష్యం నెరవేరకపోగా, గాడితప్పుతోందని ఇది దేశ ప్రజలకు చాలా ప్రమాదకరమని ఆయన పేర్కొన్నారు. దూర విద్యా దార్శనికుడు ప్రొఫెసర్.జి.రాంరెడ్డి 95వ జయంతిని పురస్కరించుకుని అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం, ప్రొఫెసర్ రాంరెడ్డి మెమోరియల్ ట్రస్ట్ సంయుక్తం ఆధ్వర్యంలో విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య ఘంటా చక్రపాణి అధ్యక్షతన సోమవారం ''గాడి తప్పుతోన్న లౌకికవాదం''అనే అంశంపై స్మారకోపన్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన సంస్థలే నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండడం దేశానికే అత్యంత ప్రమాదకరమన్నారు. దేశంలో మత ఘర్షణలు, కుల ఘర్షణలు పెరుగుతున్నాయని ప్రజాస్వామ్యానికి ఇవి మంచివి కావని తెలిపారు. విద్య అందరికీ సమానంగా, ఉచితంగా అందాలని కానీ కార్పొరేట్ విద్యా సంస్థలు విద్యను వ్యాపారమయంచేస్తున్నాయని వివరించారు. దీంతో బడుగు, బలహీన వర్గాలు, పేదలకు నాణ్యమైన ఉచిత విద్య అందడంలేదని తెలిపారు. కాపాడుకోవడం పెద్ద కష్టం కాదని వివరించారు. కార్యక్రమం అధ్యక్షులు ఘంటా చక్రపాణి మాట్లాడుతూ దేశంలో ప్రజలు, పాలకులు, న్యాయ వ్యవస్థ ఎలా వ్యవహరించాలో రాజ్యాంగంలో సమగ్రంగా ఉందని, లౌకిక వాదం, ప్రజాస్వామ్యం, రాజ్యాంగం ప్రమాదపు అంచున ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రొ. జి.రామ్ రెడ్డి మెమోరియల్ ట్రస్ట్, కార్యదర్శి ప్రొ.జి.హరగోపాల్ మాట్లాడుతూ భారత దేశ ఉన్నత విద్య చరిత్రలో ప్రొ.జి.రాంరెడ్డి ప్రస్తావన లేకుండా ఉండదని, అంతటి ప్రాచుర్యాన్ని ఆయన సంపాదించుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డా.ఎల్. విజయ కృష్ణారెడ్డి, ప్రొ.జి. రాంరెడ్డి సతీమణి ప్రమీలారాంరెడ్డి, ఆయన కుమార్తె జ్యోతి, విశ్వవిద్యాలయ మాజీ ఉపకులపతులు ఆచార్య వి.ఎస్. ప్రసాద్, ఆచార్య సీతారామా రావు, ప్రొ.డి.నరసింహారెడ్డి, ఆంధ్రజ్యోతి మాజీ సంపాదకులు కె. శ్రీనివాస్, ప్రొ.జయధీర్ తిరుమలరావు అన్ని విభాగాల అధిపతులు, డీన్స్, ఉద్యోగ సంఘాల నాయకులు, ట్రస్ట్ సభ్యులు, పాల్గొన్నారు.

# నకిలీ పురుగుల మందులను విక్రయించే డీలర్లపై పీడియాక్ట్

## మంత్రి తుమ్మల నాగేశ్వరావు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రైతులకు నాణ్యమైన పురుగుమందులు అందేలా చేయడమే ప్రభుత్వ లక్ష్యమని, నకిలీ పురుగుల మందులను విక్రయించే డీలర్లపై పీడియాక్ట్ కింద కేసులు నమోదు చేసి కఠినచర్యలు తీసుకోనున్నామనివ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హెచ్చరించారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సచివాలయంలో సోమవారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావును న్యూఢిల్లీ ఆగ్రో కెమికల్స్ అసోషియేషన్ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో పురుగు మందుల దుకాణాల లైసెన్స్ జారీ విధానాన్ని ఆన్‌లైన్ చేశామని చెప్పారు.

రాష్ట్రంలో ప్రస్తుతం 2 చోట్ల ఉన్న పురుగుమందుల పరీక్షా కేంద్రాలు ఉన్నాయని, వాటి సామర్థ్యం ఏడాదికి 4వేలు మాత్రమేనని, రానున్న కాలంలో రాష్ట్రంలో 2 నుండి 3 చోట్ల కొత్తగా పరీక్షాకేంద్రాలు ఏర్పాటు చేసి, మరింత ఎక్కువ సంఖ్యలో నమూనాలను పరీక్షించే దిశగా ప్రభుత్వం ఆలోచన చేస్తుందన్నారు. అదేవిధంగా ప్రతీ డీలరు నెలలో జరిపిన అన్ని పురుగు మందుల విక్రయ వివరాలు, కంపెనీల నుండి డీలర్లకు అందిన స్టాక్ వివరాలు నమోదు చేసేందుకు ప్రత్యేక వెబ్ సైట్ రూపొందించాలని వ్యవసాయశాఖ అధికారులను ఆదేశించారు. పురుగుమందుల విచ్చలవిడి వినియోగాన్ని నియంత్రించే విధంగా వ్యవసాయశాఖతో కలిసి సంయుక్తంగా పనిచేయాలని ఆగ్రో కెమికల్స్ అసోషియేషన్ ప్రతినిధులను మంత్రి కోరారు. పిపిపి విధానంలో పురుగుమందుల పరీక్షా కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. అంతకు ముందు ఆగ్రో కెమికల్స్ అసోషియేషన్ ప్రతినిధులు రాష్ట్రంలో కలుపు, పురుగు, తెగుళ్ల మందుల విక్రయాలు, నకిలీ మందుల సరఫరా నియంత్రణకు తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన చర్యలను అభినందించారు. ఈ సమావేశంలో వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్ , వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి, జనరల్ మేనేజర్ కమలపురం రమేష్ రెడ్డి, ధనుక అగ్రిటెక్ చైర్మన్ డా.ఆర్.జి అగర్వాల్, ఇతర కంపెనీల ప్రతినిధులు, కమిషనరేట్ అధికారులు పాల్గొన్నారు.

# రాహుల్ గాంధీ మతం, అభిమతం కులగణన

## మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి సీతక్క



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాహుల్ గాంధీ మతం, అభిమతం కులగణన అని పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి సీతక్క అన్నారు. దేశవ్యాప్తంగా కుల గణన చేపట్టి, జనాభా ప్రాతిపదికన సంక్షేమ ఫలాలు, రిజర్వేషన్లు కల్పించాలన్నదే రాహుల్ గాంధీ అభిమతమని సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో మంత్రి సీతక్క అన్నారు. రాజ్యాంగం మీద ప్రమాణం చేసి కేంద్ర మంత్రి అయిన బండి సంజయ్ నిర్దేశ ప్రసంగాలు చేస్తూ రాజ్యాంగాన్ని అవమానిస్తున్నారని విమర్శించారు. అణగారిన వర్గాలు, పేద ప్రజలంటే బిజెపికి పట్టదన్నారు. ప్రజలంతా బిజెపి నైజాన్ని గ్రహించాలని మంత్రి సీతక్క కోరారు. బిసిలకు జరుగుతున్న అన్యాయాన్ని సరిదిద్ది, న్యాయం చేయాలని రాహుల్ గాంధీ కులగణన కోసం డిమాండ్ చేస్తున్నారని తెలిపారు. రాహుల్ గాంధీ దేశ వ్యాప్తంగా బిసి కులగణన కోసం పట్టుబడుతున్నారన్నారు. కులగణన అంశాన్ని పక్కదారి పట్టించేందుకు రాహుల్ గాంధీని బిజెపి నేతలు టార్గెట్ చేస్తున్నారని విమర్శించారు. త్యాగాల కుటుంబం నుంచి వచ్చిన రాహుల్‌గాంధీ విజన్ ఉన్న నాయకుడన్నారు. 30 సంవత్సరాలుగా ఎలాంటి మంత్రిపదవుల్లో లేకుండా దేశం కోసం పనిచేస్తున్నారన్నారు. అందుకే గ్రామ స్థాయి నుంచి ప్రధాని వరకు, రాహుల్ గాంధీని టార్గెట్ చేస్తూ కించపరిచే ప్రయత్నాలు చేస్తున్నారని దుయ్యబట్టారు.

విద్వేష, విధ్వంసమే బిజెపి విధానమని మండిపడ్డారు. ప్రేమ, శాంతి, సమానత్వం కోసం రాహుల్ గాంధీ పనిచేస్తున్నారన్నారు. బిజెపి విద్వేష విధ్వంసాలు కావాలో, కాంగ్రెస్ శాంతి సమానత్వం అభివృద్ధి కావాలో ప్రజలు తేల్చుకోవాలన్నారు. కుల గణన అంశాన్ని డైవర్ట్ చేయడం కోసమే రాహుల్ గాంధీ మతంపై చర్చ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పదేళ్లుగా దేశం కోసం, పేద ప్రజల సంక్షేమం కోసం బిజెపి చేసింది ఏమీ లేదని విమర్శించారు. విభజన రాజకీయాలతో పదవులు పొందటం బిజెపి నేతల నైజమన్నారు. రాహుల్ గాంధీ పదవుల కోసం పాకులాడే మనిషి కాదన్నారు. త్యాగాల వారసత్వంతో సమాజ అభివృద్ధి కోసం, సమ సమాజ లక్ష్యం కోసం రాహుల్ గాంధీ పోరాటం చేస్తున్నారన్నారు. ఆదానీ ఆస్తుల పెంపకం కోసం రాహుల్ గాంధీ పనిచేయటం లేదన్నారు.

అట్టడుగు వర్గాల అభ్యున్నతి, అంతరాలు లేని సమాజమే రాహుల్ గాంధీ లక్ష్యమన్నారు. బిజెపి విద్వేష రాజకీయాలతో సమాజం వెనుకబాటుకు లోనవుతుందన్నారు. తొలి ప్రధాని నెహ్రూ నుంచి మన్మోహన్ సింగ్ వరకు చేపట్టిన సంస్కరణలే దేశాన్ని నిలబెడుతున్నాయన్నారు.

### కుల సర్వే కోసం ప్రభుత్వం కల్పించిన
# అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

## రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కుల సర్వేలో పాల్గొనని వారు, సమాచారం ఇవ్వని వారు ప్రభుత్వం మరోసారి ఇచ్చిన అవకాశాన్ని ఉపయోగించుకొని తెలంగాణ జనాభా లెక్కల్లో భాగస్వామ్యం కావాలని బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. తమ నాయకుడు రాహుల్ గాంధీ చెప్పినట్టు 'ఎవరెంతో వారికంత' న్యాయం జరగాలన్నారు. కామారెడ్డి డిక్లరేషన్ అమలుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. 42 శాతం రిజర్వేషన్లకు రాజకీయ విద్యా, ఉద్యోగ అవకాశాల్లో చట్టబద్ధత చేయడానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కులగణనలో పాల్గొననివారు ఈనెల 28వరకు నమోదు చేసుకోవచ్చు అని మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పారు. దీని కోసం టోల్ ఫ్రీ నెంబర్ 040211 11111ను ఏర్పాటు చేశామన్నారు. తాము కుల సర్వేలో పాల్గొనలేదని ఫోన్ చేసిన వారి ఇంటికి ఎన్యూమరేటర్లు వెళ్లి వివరాలు నమోదు చేస్తారన్నారు. ఎంపిడిఒ కార్యాలయం, వార్డు ఆఫీసులకు వెళ్లి కూడా వివరాలు నమోదు చేసుకోవచ్చు అని సూచించారు. ఆన్‌లైన్‌లో కూడా నమోదు చేసుకునేందుకు https://seeepsurvey.cgg.gov.in ద్వారా తమ సమాచారాన్ని ఇవ్వవచ్చు అన్నారు. కులగణన సర్వేలో 3,56,323 కుటుంబాలు పాల్గొనలేదని, వారు తప్పనిసరిగా ఈ సర్వేలో పాల్గొని, తెలంగాణ జనాభా లెక్కల్లో భాగస్వామ్యం కావాలని మంత్రి కోరారు. కుల సర్వేలో పాల్గొని అక్కడ కుల సంఘాల నేతలు, మేధావులు, ప్రొఫెసర్లు వారికి అవగాహన కల్పించాలని, వారిని భాగస్వామ్యం చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు.

# బిజెపి ప్రభుత్వం దళితులకు చేసింది శూన్యం

## రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని రక్షించుకుందాం
## డిహెచ్ పిఎస్ రాష్ట్ర సమావేశాల పోస్టర్ విడుదల
## వేములవాడలో మార్చి 10,11,12 తేదీల్లో సమావేశాలు




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ఈ 11 ఏళ్లలో దళితులకు చేసింది శూన్యమని దళిత హక్కుల పోరాట సమితి(డిహెచ్‌పిఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్ అన్నారు. బిజెపి పాలనలో దళితులకు రక్షణ లేకుండా పోయిందని, రాజ్యాంగాన్ని ప్రజాస్వామ్యానికి సైతం ముప్పు వాటిల్లుతోందని, వీటి పరిక్షణకు దళిత జాతి చైతన్యవంతం కావాలనిఆయన పిలుపునిచ్చారు. దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర సమావేశాలు వేములవాడలో మార్చి 10,11,12 తేదీల్లో జరగనున్నాయి. ఈ సమాశాలకు సంబంధించి పోస్టర్‌ను హైదరాబాద్‌లోని సిపిఐ రాష్ట్ర కార్యాలయం మగ్ధూంభవన్‌లో సోమవారం డిహెచ్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కె.ఏసురత్నం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.సహదేవ్, రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.వెంకటస్వామి, రాష్ట్ర కోశాధికారి ఎ.రాజ్‌కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎం.సుదర్శన్, రాష్ట్ర సమితి సభ్యుడు సిహెచ్.శ్రీనివాస్‌లు విడుదల చేశారు. ఈ సందర్భంగా అనిల్ కుమార్ మాట్లాడుతూ దేశంలో ఏదో ఒక మూల ప్రతి 3నిముషాలకు ఒక దళితుని మీద దాడి జరుగుతోందని, ప్రతి రోజు ఒక దళితుని ఇల్లు తగుల పెట్టబడుతోందని, ప్రతి వారంరోజులకు ఒక దళిత మహిళ అత్యాచారానికి గురవుతోందని నేషనల్ ఎస్‌సి కమిషన్ వెల్లడించిందన్నారు. తాజాగా ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తున్న సందర్భాల్ని కూడా పై జాబితాలో చేర్చాల్సి ఉందని, దళితులకు రక్షణను కల్పించాల్సిన ఈ చట్టాన్ని నిర్వీర్యం చేస్తున్నది పాలకులే. 7 ఏళ్ల లోపు శిక్షపడితే స్టేషన్ బెయిల్ ఇవ్వడమే అడ్డంకిగా మారుతోందని ఆవేదన వ్యక్తంచేశారు. తాజాగా వట్టినాగులపల్లిలో దళితుల మీద జరిగిన దాడిలో కూడా దోషులకు ఇదే వరం కానుందన్నారు. మోదీ ప్రధాన మంత్రి అయిన తర్వాత సుమారు రెండు లక్షల దాడులు జరిగినట్టు కేంద్ర సామాజిక న్యాయ శాఖే ప్రకటించిందని, ప్రతి చిన్న విషయంలోను దళితులనే టార్గెట్ చేయడం బిజెపి పాలనలో పరిపాటిగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశాన్ని విస్మయానికి గురిచేసిన గిరిజనుడిపై మూత్ర విసర్జన, మణిపూర్లో ఇద్దరు గిరిజన యువతులను వివస్త్రలుగా చేసి ఊరేగించిన ఘటన వంటివన్నీ ఇందులో భాగమేనని పేర్కొన్నారు. ఇన్ని జరిగినా ప్రధాని నరేంద్ర మోదీ మాత్రం నోరు విప్పరు అని, అదే సనాతన ధర్మం అంశంలో మాత్రం దాడులు తిప్పి కొట్టాలంటూ దేశ ప్రజలను రెచ్చగొట్టడంలో ముందుంటున్నారని అన్నారు.

# ఐఎఎస్‌లను తప్పు చేయమంటారా?

## సిఎం వ్యాఖ్యలపై కేంద్రమంత్రి మండిపాటు
## ఇకపై ప్రధాన ప్రతిపక్ష పాత్ర పోషించేది బిజెపినే




**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యవహరిస్తున్న తీరును చూస్తుంటే ప్రభుత్వం ఉంటుందో ఊడుతుందో తెలియని పరిస్థితి నెలకొందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి మండి సంజయ్‌కుమార్ వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ అంటేనే బాకీల సర్కారు అని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న రేవంత్‌రెడ్డి ఒక్క తప్పు చేయాలని అంటే.. ఐఎఎస్‌లు మూడు తప్పులు చేస్తున్నారని వ్యాఖ్యానించడం సిగ్గుచేటన్నారు. సిఎంగా ఉంటూ అవినీతిని, తప్పులను నిరోధించాల్సింది పోయి తప్పులు చేయాలని చెప్పడమేంటని ప్రశ్నించారు. ముఖ్యమంత్రే అవినీతి, తప్పులు జరుగుతున్నాయని ఒప్పుకున్నట్లయిందన్నారు. రాష్ట్రంలో మంత్రుల మధ్య, కాంగ్రెస్ ఎమ్మెల్యేల మధ్య చీలిక వచ్చిందన్నారు. కొందరు మంత్రులు సొంత దుకాణాలు ఓపెన్ చేసి ప్రతి పనికి 15శాతం చొప్పున కమీషన్లు దండుకుంటున్నారని విమర్శించారు. రాష్ట్రంలో ప్రతి నిరుద్యోగికి రూ.56వేల నిరుద్యోగ భృతి, ప్రతి మహిళకు స్కూటీ, తులం బంగారం, ప్రతి ఉద్యోగికి పిఆర్‌సి, 4 డిఎలు, రైతులకు రైతు భరోసా, బోనస్, రుణమాఫీ బాకీ పడిందన్నారు. టీచర్, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో సోమవారం కరీంనగర్‌లో ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ జిల్లాల్లోని బిజెపి మండలాధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్‌తో పాటు ఎంపిలు రఘునందన్ రావు, జి.నగేష్, ఎమ్మెల్యేలు కాటేపల్లి వెంకటరమణారెడ్డి, పాయల శంకర్, పాల్వాయి హరీష్‌బాబు, మాజీ ఎమ్మెల్యేలు ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, చింతల రామచంద్రారెడ్డి, బొడిగె శోభ, జిల్లా అధ్యక్షుడు గంగాడి క్రిష్ణారెడ్డి, మాజీ మేయర్లు సునీల్‌రావు, డి.శంకర్ తదితరులు సమావేశానికి హాజరయ్యారు. బిసి జాబితాలో ముస్లింలను తీసివేస్తేనే ఆ బిల్లును ఆమోదింపజేసే బాధ్యత తీసుకుంటామన్నారు. లేకుంటే ఆమోదించే ప్రసక్తే లేదన్నారు. ముస్లింలను బిసిల్లో కలిపి అన్యాయం చేస్తున్నారని, కొందరు క్రైస్తవులు ఎస్సీ సర్టిఫికెట్లు తీసుకుంటూ ఎస్సీలకు నష్టం చేస్తున్నారని వాపోయారు. ఇంత జరుగుతున్నా బిసి, ఎస్సీ సంఘాలేం చేస్తున్నాయని ప్రశ్నించారు. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీకి కొమ్ముకాయడమేనా? ఒక వర్గానికి కొమ్ముకాయాలని, హిందూ సమాజానికి తీరని నష్టం చేస్తున్న కాంగ్రెస్ పార్టీకి ఎన్నికల్లో మేధావులంతా గుణపాఠం చెప్పాలని కోరారు.

# నేడు బిసి హక్కుల సాధన సమితి సమావేశం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లతోపాటు న్యాయమైన డిమాండ్ల సాధనే లక్ష్యంగా హైదరాబాద్‌లోని సిపిఐ రాష్ట్ర కార్యాలయం మగ్ధూంభవన్‌లో మంగళవారం మధ్యాహ్నం 1 గంటకు జరగనున్న బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరగనుందని రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు, ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడు తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు హాజరు కానున్నట్లు వారు వెల్లడించారు. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 8 దశాబ్దాలు కావస్తున్నప్పటికీ నేటికీ బిసిలు వివక్షతకు గురవుతూనే ఉన్నారని, ప్రతి ఎన్నికల్లో కూడా బూర్జువా పార్టీలు బిసిలను ఉద్ధరిస్తామని, వారి అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని శుష్క వాగ్దానాలు చేస్తున్నారే తప్ప అమలు చేయడం లేదన్నారు. దేశవ్యాపితంగా కులగణన చేపట్టి ఏఏ కులాల వారి జనాభా నిష్పత్తి ఎంత ఉందో విద్యా, వైద్య, ఉద్యోగ, ఉపాధి, రాజకీయ రంగాల్లో అంతే నిష్పత్తిలో రిజర్వేషన్లతో పాటు బడ్జెట్లో నిధులు కూడా కేటాయించాలని, అందుకు అనుగుణంగా చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. బిసిల న్యాయమైన డిమాండ్లపై ఈ సమావేశం చర్చించి ఉద్యమ కార్యాచరణ రూపొందించనున్నట్లు వారు వెల్లడించారు. ఈ సమావేశానికి సభ్యులందరూ మధ్యాహ్నం ఒంటిగంట వరకు కార్యాలయానికి చేరుకోవాలని వారు కోరారు.

### పోటీ పరీక్షలకు అనుగుణంగా
# డిగ్రీ సిలబస్‌లో మార్పులు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పోటీ పరీక్షలకు అనుగుణంగా ''డిగ్రీ సిలబస్''లో మార్పులు తీసుకొచ్చేందుకు ఉన్నత విద్యా మండలి ప్రయత్నిస్తోంది. తెలుగు సబ్జెక్ట్‌లో ప్రధానంగా తెలంగాణ మాండలికాలు, జీవనవిధానం తదితర అంశాలను జోడించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రస్తుత సిలబస్‌లో 20 నుంచి 30 శాతం వరకు మార్పులు చేయాలని, ఇందులో కూడా ప్రస్తుత విద్యావిధానంలో వచ్చిన మార్పులను, పోటీపరీక్షలను దృష్టిలో పెట్టుకుని సిలబస్‌ను రూపొందించే అవకాశాలు ఉన్నట్టు అధికార వర్గాలు చెబుతున్నాయి. వచ్చే విద్యాసంవత్సరం (2025–26 జూన్ నుంచి) అమలు చేయనున్న నేపథ్యంలో సిలబస్ మార్పులపైన తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి (టిజిసిహెచ్‌ఇ) ప్రత్యేక కమిటీ హైదరాబాద్‌లోని టిజిసిహెచ్‌ఇ కార్యాలయంలో సోమవారం సమావేశమైంది. ఈ సమావేశంలో ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి, వైస్ చైర్మన్, కమిటీ చైర్మన్ ప్రొఫెసర్ ఇటిక్యాల పురుషోత్తం, వైస్ చైర్మన్ ప్రొఫెసర్ ఎస్.కె.మహమ్మద్, కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేష్, కోర్ కమిటీ సభ్యులు హాజరయ్యారు. కమిటీ సభ్యులు, ఆయా సబ్జెక్ట్‌ల నిపుణులు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా బిఎ ఆర్ట్స్, సోషల్ సైన్స్ సహా బిఎ ఆనర్స్ (తెలుగు) కోర్సుల సిలబస్‌లో మార్పులపైన చర్చించారు. సిలబస్ మార్పు విషయంలో విశ్వవిద్యాలయ స్థాయిలో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాములను నిర్వహించాలని, అకాడమిక్ స్టాఫ్ కాలేజ్ ద్వారా ఓరియంటేషన్ కార్యక్రమాలను చేపట్టనున్నారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ కిష్టారెడ్డి మాట్లాడుతూ ప్రపంచంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ఉపాధి, ఉద్యోగ అవకాశాలను దృష్టిలో పెట్టుకుని సిలబస్ మార్పులో అంతర్జాతీయ ఉత్తమ పద్ధతులను అనుసరించాలని సూచించారు.


**పోటీ పరీక్షలకు అనుగుణంగా సిలబస్ : ప్రొఫెసర్ పురుషోత్తం**
ప్రొఫెసర్ పురుషోత్తం మాట్లాడుతూ ఉన్నత విద్యా విషయక ప్రణాళికను సమీక్షించాలన్నారు. ఉద్యోగ పోటీ పరీక్షలలో కొన్ని ఆబ్జెక్టివ్‌లకు అభ్యర్థులు సమాధానం చెప్పలేకపోతున్నారని, దీని కోసం ప్రత్యేకంగా కోర్సులకు వెళ్లాల్సిన పరిస్థితులు ఉన్నాయని వివరించారు. ఇలాంటి అంశాలను దృష్టిలో పెట్టుకుని, డిగ్రీ సిలబస్‌లోనే మార్పులు చేస్తామని, తద్వారా విద్యార్థులు పోటీ పరీక్షలకు ఇబ్బంది లేకుండా ఉంటుందని పురుషోత్తం తెలిపారు.

# ఎమ్మెల్సీ ఓటర్ల తుదిజాబితా విడుదల

## గ్రాడ్యుయేట్లు 3,55,159, టీచర్లు 27,088

**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ ఎమ్మెల్సీ గ్రాడ్యుయేట్, టీచర్ల ఓటర్ల తుదిజాబితాను ఎన్నికల సంఘం సోమవారం విడుదల చేసింది. ఓటర్ల నమోదు కోసం పలు దఫాలుగా అవకాశం ఇచ్చిన ఎన్నికల సంఘం ఓటరు జాబితాను ఫైనల్ చేసింది. ఈ మేరకు నాలుగు ఉమ్మడి జిల్లాల్లోని 15 జిల్లాలో గ్రాడ్యుయేట్ ఓటర్లు మొత్తంగా 355159 మంది ఉన్నారు. అందులో పురుషులు 226765, మహిళలు 128392 మంది ఓటర్లున్నట్లు పేర్కొన్నారు. అత్యధికంగా కరీంనగర్ జిల్లాలో 71545 మంది, అత్యల్పంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 2483 మంది ఉన్నారు. కొమురం భీం జిల్లాలో 6137, మంచిర్యాలలో 30921, ఆదిలాబాద్‌లో 14935, నిర్మల్‌లో 17141, నిజామాబాద్‌లో 31574, కామారెడ్డిలో 16410, జగిత్యాలలో 35281, పెద్దపల్లిలో 31037, రాజన్న సిరిసిల్ల జిల్లాలో 22397, సంగారెడ్డిలో 25652, మెదక్‌లో 12472, సిద్దిపేటలో 32589, హన్మకొండలో 4585 మంది గ్రాడ్యుయేట్ ఓటర్లున్నారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కరీంనగర్ ఉమ్మడి జిల్లాకు చెందిన నాలుగు జిల్లాల్లో అత్యధికంగా ఓటర్లుండడం విశేషం. టీచర్స్ ఓటర్లలో...టీచర్స్ ఎమ్మెల్సీ ఓటర్లలో మొత్తంగా 27088 మంది ఓటర్లున్నారు. అందులో పురుషులు 16932, మహిళలు 10156 ఓటర్లున్నారు. అత్యధికంగా కరీంనగర్ జిల్లాలో 4305 మంది ఓటర్లున్నారు. కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో 470, మంచిర్యాలలో 1664, ఆదిలాబాద్‌లో 1593, నిర్మల్‌లో 1966, నిజామాబాద్‌లో 3751, కామారెడ్డిలో 2011, జగిత్యాలలో 1769, పెద్దపల్లిలో 1111, రాజన్న సిరిసిల్లలో 950, సంగారెడ్డిలో 2690, మెదక్‌లో 1347, సిద్దిపేటలో 3212, హన్మకొండలో 166, జయశంకర్ భూపాలపల్లిలో 83 మంది టీచర్స్ ఓటర్లున్నారు.

### ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిది
# చరిత్రాత్మక నిర్ణయం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సమగ్ర కుల సర్వే నిర్వహించి, ఓబిసిల సాధికారత కోసం డేటాను ఉపయోగించాలనే చరిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని కేంద్ర మాజీ మంత్రి అరుణ్ సుభాష్ చంద్ర యాదవ్ అన్నారు. జూబ్లీహిల్స్‌లోని సిఎం నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని సోమవారం అరుణ్ సుభాస్ యాదవ్ కలిశారు. సమగ్ర కుల సర్వే నిర్వహించిన తీరుపై సిఎంతో ఈ సందర్భంగా చర్చించారు. సమగ్ర కుల సర్వే సమర్థవంతంగా నిర్వహించి, దేశం మొత్తానికే రేవంత్ రెడ్డి రోల్‌మోడల్‌గా నిలిచారని ఆయన సిఎం రేవంత్ రెడ్డిని అభినందించారు. దేశంలోని అనేకమంది ఓబిసి సామాజిక వేత్తలు, నాయకులు సమగ్ర కుల సర్వేను స్వాగతిస్తున్నారని చెప్పారు.


**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**

NIT No. 68/SE(KZ)/GHMC/TA/2024-2025 'ఇ' ప్రొక్యూర్‌మెంట్ టెండర్ నోటీస్ తేది: 17.02.2025

**పనుల సంఖ్య:** పూడిక తొలగింపు పనులు - 2. **మొత్తం విలువ:** రూ.179.50 లక్షలు. **2 పనులకు మొత్తం విలువ:** రూ.179.50 లక్షలు, **బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది:** బిడ్ దాఖలుకు ప్రారంభ తేది: 19.02.2025న మ.03.00గం.లకు, బిడ్ దాఖలుకు ఆఖరి తేది: 27.03.2025న మ.03.00గం.ల వరకు, **అధికారి పేరు & చిరునామా:** ఎస్ఇ (కెజెడ్), జిహెచ్ఎంసి. ఫోన్ నం: 8790522144. కమిషనర్, మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా www.eprocurement.gov.inలో చూడవచ్చు.

సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్ (కెజెడ్)
గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్.

DIPR R.O. No. : 10360-PP/CL/ADVT/1/2024-25, Date: 17-02-2025

ప్రజాపక్షం
మంగళవారం, ఫిబ్రవరి 18

## బంగ్లాదేశ్‌లో కొత్త రాజకీయ పార్టీ

భారతదేశానికి ఎంతో ఆసక్తి ఉన్న పొరుగుదేశం బంగ్లాదేశ్‌లో పరిణామాలు ఆందోళన కలిగిస్తున్నాయి. పాకిస్థాన్ అణచివేతకు వ్యతిరేకంగా బంగ్లా ప్రజల తిరుగుబాటును బలపరిచి, స్వతంత్ర బంగ్లాదేశ్ ఆవిర్భావానికి సైనికంగా తోడ్పాటు అందించిన భారత్‌కు బంగ్లాదేశ్‌లో ఈనాడు వ్యతిరేక పవనాలు వీస్తుండటం విచారకరం. వివక్ష వ్యతిరేక విద్యార్థి సంస్థ ప్రజా తిరుగుబాటుకు చోదకశక్తిగా పనిచేసింది. గత ఆగస్టు 5న అవామీలీగ్ ప్రభుత్వం కూలిపోవటం, బంగ్లా జాతిపిత ముజబుర్ రెహ్మాన్ కుమార్తె, ప్రధానమంత్రి షేక్ హసీనా జావెద్ దేశంనుంచి పరారై భారత్‌లో తలదాచుకోవటం ఆమె వ్యతిరేక ఉద్యమకారులకు పుండుమీద కారం చల్లినట్లు అయింది. అందుకే వారిప్పుడు హసీనాను తమ ప్రభుత్వానికి అప్పగించాలని భారత్‌ను డిమాండ్ చేస్తున్నారు. సందట్లో సడేమియా అన్నట్లు పాకిస్థాన్‌తో సంబంధాల మెరుగుదలకు పాక్ అనుకూల శక్తులు తాత్కాలిక ప్రభుత్వంపై ఒత్తిడి చేస్తున్నాయి. ఆగస్టు 8న ప్రభుత్వ ముఖ్య సలహాదారుపేరుతో అధికార పగ్గాలు చేబట్టిన నోబెల్ లారెట్ డాక్టర్ మహమ్మద్ యూనస్‌పై ప్రత్యర్థి గ్రూపులు ఒత్తిడి చేస్తున్నాయి. ఈ సంవత్సరాంతంలో జాతీయ అసెంబ్లీ ఎన్నికలనుకుంటున్న నేపథ్యంలో రాజకీయ వైరుధ్యాలు బలంగా ముందుకు వస్తున్నాయి.

> బంగ్లాదేశ్ నిజంగా ప్రజాస్వామ్య మార్గంలో, ఇరుగుపొరుగు దేశాలతో సత్సంబంధాలతో పురోగమించాలనుకుంటే భారత్ స్నేహహస్తం ఎల్లవేళలా సిద్ధంగా ఉంటుంది.

విద్యార్థుల తిరుగుబాటుకు నాయకత్వం వహించిన ఒక గ్రూపు కొత్త రాజకీయ పార్టీ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నది. బహుశా ఫిబ్రవరి 24న పార్టీ ఏర్పాటు కావచ్చు. ఆ గ్రూపు నాయకుడు నహిద్ ఇస్లాం. ప్రస్తుతం తాత్కాలిక ప్రభుత్వానికి సలహాదారులుగా ఉన్న ఇద్దరు విద్యార్థి నాయకుల్లో నహిద్ ఒకరు. సమాచారం, పబ్లిసిటీ ఇన్‌చార్జి సలహాదారు అతడు. హసీనా వ్యతిరేక ఉద్యమంలో పాల్గొన్న మరో వేదిక జాతీయ నాగరిక్ కమిటీ (జెఎన్‌సి) ఈ కొత్త పార్టీలో చేరవచ్చు. బంగ్లా నేషనలిస్ట్ పార్టీ (ఖలీదా జియా), దాని విద్యార్థి విభాగం, అవామీలీగ్‌కు చెందిన విద్యార్థి విభా గం ఛాత్రలీగ్ ఇటీవల కాలంలో తమ కార్యకలాపాలను పెంపుచేయటంవల్ల ఈ ప్రత్యర్థి విభాగాలు చురుకుదనం పెంచుకుంటున్నాయి. హసీనాను భారత్ నుంచి రప్పించటమే వివక్ష వ్యతిరేక విద్యార్థి ఉద్యమ ప్రధాన డిమాండ్. ఈ విషయంలో ఏ విధమైన రాజీకూడదని డాక్టర్ యూనస్‌ను హెచ్చరించింది కూడా. ఎన్నికల్లో పాల్గొనకుండా అవామీలీగ్‌ను నిషేధించాలని ఎన్నికల కమిషనర్‌ను కోరింది. అయితే బిఎన్‌పి, జమాత్ దీన్ని వ్యతిరేకిస్తున్నాయి. నేరారోపణలు లేని అవామీలీగ్ నాయకులను ఎన్నికల్లో పోటీకి అనుమతించాలని బిఎన్‌పి కోరుతున్నది.

ఇదిలావుండగా, భారత్‌తో ఎలా వ్యవహరించాలో అర్థంకాక డాక్టర్ యూనస్ సతమతమవుతున్నారు. బంగ్లాదేశ్ విషయంలో మోదీ ప్రయత్నాలకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఈనెల 13న సమావేశంలో తోడ్పాటిచ్చారన్న వార్తలు యూనస్‌ను మరింత కలవరపరుస్తున్నాయి. బంగ్లా విదేశీ వ్యవహారాల ఇన్‌ఛార్జి తౌహిద్ హుస్సైన్ హిందూ మహాసముద్ర దేశాల సమావేశం సందర్భంగా ఆదివారం మస్కట్‌లో భారత విదేశీ వ్యవహారాల మంత్రి ఎస్.జైశంకర్‌ను కలుసుకున్నారు. ద్వైపాక్షిక సంబంధాల మెరుగుదల సమస్యలపై వారు చర్చించారు. గత సెప్టెంబర్‌లో ఐరాస జనరల్ అసెంబ్లీ సందర్భంగా ప్రధాని మోదీని కలుసుకునేందుకు యూనస్ ప్రయత్నించారు. ఏప్రిల్ 3,4 తేదీల్లో థాయిలాండ్‌లో జరిగే బిమ్‌స్టిక్ దేశాధినేతల సమావేశం మోదీ–యూనస్ ముఖాముఖీకి మరో అవకాశం. వారిరువురి మధ్య పూర్తిస్థాయి చర్చలు ఇరుదేశాల సంబంధాల్లో ఏదైనా మెరుగుదలకు అవకాశాలు ఆవిష్కరించవచ్చు.

అయితే పాకిస్థాన్‌తో సహకారం పునరుద్ధరించుకుని భారత్‌కు పక్కలో బల్లెంగా తయారయ్యే బంగ్లాదేశ్ ప్రయత్నాలను భారత్ అనుమతించదు. హసీనాను బంగ్లాదేశ్‌కు అప్పగించే అవకాశం బహుతక్కువ. బంగ్లాదేశ్ నిజంగా ప్రజాస్వామ్య మార్గంలో, ఇరుగుపొరుగు దేశాలతో సత్సంబంధాలతో పురోగమించాలనుకుంటే భారత్ స్నేహహస్తం ఎల్లవేళలా సిద్ధంగా ఉంటుంది.

# మోదీ అప్పుల రికార్డుతో దేశం కుదేలు!


ఎం. కోటేశ్వరరావు

ఉచిత పథకాలు, నగదు బదిలీల వంటి రాజకీయ పార్టీల వాగ్దానాల కారణంగా జనాలు సోమరులుగా మారుతున్నారని, పరాన్నజీవులవుతున్నారంటూ సుప్రీం కోర్టు న్యాయమూర్తులు బుధవారం (ఫిబ్రవరి 12,2024) వ్యాఖ్యానించినట్లు వార్తలు వచ్చాయి. చిత్రం ఏమిటంటే ఇలాంటి వాటి గురించి కేసులు వేసేవారు ఉంటారు తప్ప ప్రోత్సాహకాల పేరుతో వేళ్లమీద లెక్కించదగిన కార్పొరేట్ సంస్థలకు లక్షల కోట్ల రాయితీలు, బ్యాంకు అప్పుల మాఫీలు, రికార్డు స్థాయిలో ప్రభుత్వాలు చేస్తున్న అప్పుల గురించి ఎవరైనా సుప్రీం కోర్టులో కేసు దాఖలు చేశారా? పోనీ న్యాయమూర్తులు మీడియాలో వస్తున్న వార్తలపై స్పందించారా అంటే అదీ కనపడదు. అప్పులు తెచ్చేది ఎందుకు అంటే అభివృద్ధి కోసం అని అధికార పార్టీ నుంచి తడుముకోకుండా చెప్పే సమాధానం. ఆ మేరకు దాని ఆనవాళ్లు లేవేమి అంటే ఫలితాలు వెంటనే ఎలా కనిపిస్తాయి, రానున్న రోజుల్లో చూడండి అంటారు. స్వాతంత్ర్యం తరువాత దేశాన్ని పాలించిన ప్రధానులందరూ కలసి 2004 నాటికి కేంద్ర ప్రభుత్వానికి మిగిల్చిన అప్పు రు.17,79,763 కోట్లు. పదేండ్ల మన్మోహన్ సింగ్ పాలనలో 2014 మార్చి నెల నాటి కి బడ్జెట్ పత్రాల సమాచారం ప్రకారం కేంద్ర ప్రభుత్వానికి మిగిల్చిపోయిన అంతర్గత, విదేశీ అప్పుల మొత్తం రు.55,87,149 కోట్లు, అది 2025 మార్చి నాటికి రు.185.11లక్షల కోట్లని, 2026 మార్చి నెలాఖరుకు రు.200.16లక్షల కోట్లకు చేరుతుందని అంచనా వేశారు. పదేండ్ల క్రితం ఇప్పుడు కూడా చర్చ అభివృద్ధి మీదే. పదేండ్ల లో యుపిఎ పాలనలో అదనంగా 38లక్షల కోట్ల అప్పు చేస్తే దేశాన్ని అప్పుల పాలు చేశారు, అభివృద్ధి చేయలేదు అంటూ నరేంద్రమోదీ నాడు ధ్వజమెత్తారు. తన ఏలుబడిలో 2025మార్చినెలతో ముగిసే ఆర్థిక సంవత్సరం నాటికి అదనంగా చేసిన అప్పు 129లక్షల కోట్లు. ఇది చాలక ఈ ఏడాది మరో 15.68లక్షల కోట్లు కొత్తగా అప్పులు తీసుకొనేందుకు నిర్ణయించారు. తీరా ఇంతచేసినా 80కోట్ల జనాభా నెలనెలా ఐదు కిలోల ఆహారధాన్యాలు ఉచితంగా తీసుకుం టే తప్ప గడవని స్థితిలోనే దేశం ఉంది. మరో 22 సంవత్సరాల్లో (2047 నాటికి) దేశాన్ని ఎక్కడికో తీసుకుపోతామని కబుర్లు చెబుతున్నారు. నమ్మదగిన మాట లేనా ?

అంతకు ముందు కాంగ్రెస్ పాలనకు, పదకొండు సంవత్సరాల నరేంద్రమోదీ పాలనకు పెద్ద తేడా ఏమిటి? మన్మోహన్ సింగ్ మాకు పెద్ద మొత్తంలో అప్పులు మిగిల్చిపోయారు, వాటిని తీర్చటానికే సరిపోతోందని వాదించవచ్చు. అప్పుల్లో మోదీ సరికొత్త రికార్డు సృష్టించారు గనుక అది తర్కానికి నిలిచేది కాదు. 2014–15లో మోదీ సర్కార్ అసలు, వడ్డీ మొత్తాలను తీర్చేందుకు ఖర్చు చేసిన మొత్తం రు.3,13,169 కోట్లు కాగా 2026 మార్చి నాటికి తీర్చాల్సిన మొత్తం రు.12,76,338కోట్లుగా నిర్మలమ్మ తాజా బడ్జెట్‌లో ప్రతిపాదించారు. ఈ ఏడాది బడ్జెట్ మొత్తం రు.50.65లక్షల కోట్లకుగాను రు.15.68 లక్షల కోట్లు అప్పుల ద్వారా సేకరిస్తామని చెప్పారు. మూడు సంవత్సరాల తీరుతెన్నులను చూస్తే వడ్డీ, అసలు చెల్లింపుల మొత్తం ఏడాదికి లక్ష కోట్ల వంతున పెరుగుతోంది. ఈ లెక్కన మోదీ మూడోవిడత పాలన ముగిసే నాటికి ఎంత అప్పు తెస్తే అంతమొత్తం పాత అప్పులకే సరిపోతుందని వేరే చెప్పనవసరం లేదు. ఒకవైపు అప్పుల కుప్ప పెరుగుతోంది, జనం మీద జిఎస్‌టి, చమురు మీద సెస్‌ల భారం కొనసాగుతూనే ఉంది. అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరలు తగ్గినా ఒక్క పైసా కూడా వినియోగదారులకు తగ్గించకుండా 2022 ఏప్రిల్ మొదటి వారం నుంచి ఒకే ధర కొనసాగిస్తూ జేబులను కొల్లగొడుతూనే ఉన్నారు. తెచ్చిన అప్పుల మేరకైనా సంపదలను పెంచే మూలధన పెట్టుబడులుగా పెడుతున్నారా అంటే అదీ లేదు. 2023–24లో రు.16.54లక్షల కోట్ల మేర అప్పులు తెస్తే, మూలధన పెట్టుబడులకు రు.7.88లక్షల కోట్లు మాత్రమే కేటాయించారు, మరుసటి ఏడాది రు.15.69లక్షల కోట్ల అప్పులో రు.8.47లక్షల కోట్లు సవరించిన బడ్జెట్ కాగా 2025–26లో మూలధన పెట్టుబడిగా రు.8.95లక్షల కోట్లుగా ప్రతిపాదించారు. అంతకు ముందు 9.18లక్షల కోట్లు కేటాయించి దాన్ని కుదించినట్లే వచ్చే ఏడాది కూడా అంత మొత్తం ఖర్చు చేస్తారన్న గ్యారంటీ లేదు. వడ్డీ చెల్లింపుల మాదిరి శాశ్వత ఆస్తుల కల్పన లేదు. అందుకే నరేంద్రమోదీ ఏలుబడి గొప్పతనం ఏమిటి అని ప్రశ్నించాల్సి వస్తోంది.

తమ పాలనలో విదేశీ అప్పులు పెద్దగా తీసుకోలేదని బిజెపి నేతలు గొప్పలు చెప్పుకుంటారు. అంకెలేమి చెబుతున్నాయి. 2014 మార్చి నాటికి విదేశీ అప్పుల మొత్తం మన కరెన్సీలో రు.1.82లక్షల కోట్లు.



ఈ మొత్తం 2026 మార్చి నాటికి 6.63లక్షల కోట్లకు పెరుగుతుందని నిర్మలమ్మ బడ్జెట్‌లో చెప్పారు. గత పది సంవత్సరాలలో ఇంత మొత్తం అప్పులు తెచ్చిందెవరు? మోదీ ఏలుబడిలో రూపాయి విలువ 62 నుంచి 86కు పతనమైంది. దీని వలన జరిగిందేమిటి? పదేండ్ల క్రితం మోదీ ఒక డాలరు విదేశీ అప్పు తీసుకుంటే దాన్ని మరుసటి ఏడాది చెల్లించాలంటే నాడున్న మారకపు విలువ ప్రకారం రు.62, దానికి నామమాత్రంగా వడ్డీ చెల్లిస్తే సరిపోయేది. అదే డాలరును ఎలాంటి వడ్డీ లేకుండా పదేండ్ల తరువాత ఇచ్చే ఒప్పందం మీద ఎవరైనా ఉదారంగా అప్పు ఇస్తే ఇప్పుడు 86 రూపాయలు చెల్లించాల్సి ఉంటుంది. మోదీ దిగిపోయే 2029 నాటికి వందకు పతనమైనా ఆశ్చర్యం లేదు. అధికారానికి వచ్చిన వెంటనే అప్పుతీర్చి ఉంటే ఇంత ఆముదం జనానికి అంటేది కాదు కదా ! ఇదీ మోదీ ఘనత.


ఇప్పుడు కార్పొరేట్లు తమకు మరిన్ని రాయితీలతో పాటు తాము తయారు చేసే వస్తువులు, అందించే సేవలను కొనుగోలు చేసేందుకు మధ్యతరగతికి ఆదాయపన్ను రాయితీలు ఇవ్వాలని, కొందరైతే కార్మికులకు వేతనాలు పెంచాలని కూడా సూచించారు. పన్నెండు లక్షల వరకు ఆదాయానికి పన్ను మినహాయింపు ఇచ్చారు. దీని వలన ఏటా లక్ష రూపాయలవరకు ఆలోపు రాబడి ఉన్నవారికి మిగులుతుందని అంచనా. ఈ మొత్తంతోనే దేశంలో పడిపోయిన వినియోగం పెరుగుతుందా? ఈ స్వల్ప మిగులుతో గతంలో చేసిన అప్పులు కూడా తీర్చుకోవచ్చు, వస్తువులే కొనాలని లేదు. లేదా పెరిగిన ఖర్చులకు సరిపెట్టుకోవచ్చు. విదేశీ పెట్టుబడులను ఆకర్షించటం, స్వదేశీ పెట్టుబడిదారులకు మరింత ఊతం ఇచ్చే పేరుతో కార్పొరేట్ పన్ను 30 నుంచి 22 శాతానికి తగ్గించారు. కొత్తగా పెట్టే సంస్థలకు 15 శాతమే అన్నారు. ఈ రాయితీలతో పరిశ్రమలు, వాణిజ్య సంస్థల లాభాలు విపరీతంగా పెరిగాయి, వాటాదార్లకు డివిడెండ్లు వచ్చాయి తప్ప ఆ మొత్తం పెట్టుబడుల రూపంలో తిరిగి రాలేదు, ఆ మేరకు ఉపాధి కూడా పెరగలేదు. అదే జరిగి ఉంటే వస్తువినియోగం పెరిగి ఉండేది, రూపాయి రూపాయి లెక్కించుకోవాల్సి వచ్చేది కాదు. సంపదలు కొద్ది మంది దగ్గర పోగుపడుతున్న తీరు స్పష్టంగా కనిపిస్తోంది. 2013–14లో ఏడాదికి 50లక్షల రూపాయల రాబడిని చూపి పన్ను చెల్లించిన వారు 1.85లక్షలుంటే 2023–24లో వారి సంఖ్య 9.34లక్షలకు పెరిగింది. అయితే ఇంకా పన్ను ఎగవేసేవారు, రాబడిని చూపని వారు పెద్ద సంఖ్యలోనే ఉన్నారు.

దేశంలో 2011జనాభా లెక్కల ప్రకారం రైతులుగా నమోదైన వారు 11.88 కోట్లు, వ్యవసాయ కార్మికులు 14.43 కోట్లు. కార్పొరేట్ పన్ను చెల్లించే సంస్థలు 2021లో 9,67,054. నిర్మలా సీతారామన్ స్వయంగా వెల్లడించినదాని ప్రకారం పైన పేర్కొన్న కార్పొరేట్ పన్ను తగ్గింపు కారణంగా ప్రభుత్వం ఏటా రు.1.45 లక్షల కోట్ల రాబడి కోల్పోతున్నది. పిఎం కిసాన్ సమ్మాన్ నిధి పేరుతో పెట్టుబడి ఖర్చులకు గాను ఏటా 10.32 కోట్ల మంది రైతులకు 63వేల కోట్ల రూపాయలను మాత్రమే కేంద్రం ఇస్తున్నది. అయిన వారికి ఆకుల్లో, కాని వారికి కంచాల్లో అంటే ఇదే. రైతులు ఎక్కువ మందికి ఉపాధి కల్పిస్తున్నారా, కార్పొరేట్ సంస్థలు ఎక్కువ మందికి పని చూపుతున్నా యా? ఎందుకీ వివక్ష? రైతులకు ఇచ్చే ఆ మొత్తంతో కార్పొరేట్లు విక్రయించే విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, వ్యవసాయ పరికరాల వంటి వాటిని కొనుగోలు చేసేందుకు ఖర్చు చేస్తారు. దానిలో కూడా కార్పొరేట్లకు లాభాలు, ప్రభుత్వాలకు పన్నుల రూపంలో రాబడి వస్తుంది. కానీ కార్పొరేట్లకు ఇస్తున్న రాయితీలతో వారేమైనా వస్తువులు, సేవల ధరలు తగ్గించిన దాఖలా ఉందా? ఆదాయపన్ను రాయితీలు ఒకటైతే, ఎగమతి ప్రోత్సాహకాలు, వెనుకబడిన ప్రాంతా ల్లో పరిశ్రమలు పెట్టినందుకు ప్రోత్సాహకాల రూపంలో ఇచ్చే రాయితీలను కూడా పరిగణనలోకి తీసుకుంటే వారికి కట్టబెడుతున్న మొత్తాలు ఇంకా ఎక్కువే ఉంటాయి.

ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తానన్న వాగ్దానాన్ని పాక్షికంగా నెరవేర్చినా జిడిపి వృద్ధి రేటు, కొనుగోలు శక్తి దిగజారి ఉండేది కాదు. పని చేసేందుకు ఏ దేశంలోనూ లేనంత మంది యువత ఉన్నదని గొప్పలు చెప్పుకోవటం తప్ప వారికి ఉపాధి సంగతి అలా ఉంచి, గత పదేండ్లలో పనిచేసేందుకు ముందుకు వచ్చిన వారికి కనీసం నైపుణ్యం అయినా కల్పించారా అంటే అదీ లేదు.

నైపుణ్యశిక్షణ పేరు తో తగలేసిన వేల కోట్ల రూపాయలు ఒక పెద్ద కుంభకోణంగా చెప్పవచ్చు. దరిద్రం ఏమిటంటే అసలు ఎంతమంది నిపుణులున్నారో కూడా తెలియదు. అందుకే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆ లెక్కలు సేకరిస్తానని ఇప్పుడు చెబుతోంది. నైపుణ్య భారత్ కార్యక్రమం కింద కోటీ 40లక్షల మందికి నైపుణ్య శిక్షణ ఇచ్చామని, మరో 54లక్షల మంది కి నైపుణ్యాలను పెంచటం లేదా తిరిగి శిక్షణ ఇచ్చామని 2024 కేంద్ర ప్రభుత్వం చెప్పుకుంది. జాతీయ నైపుణ్య అభివృద్ధి కార్పొరేషన్ (ఎన్ఎస్‌డిసి) 2024లో వెల్లడించిన అధ్యయన వివరాల ప్రకారం దేశంలో 10.3కోట్ల మంది నైపుణ్య కార్మికులు అవసరం కాగా 7.4 కోట్ల మందే ఉన్నారు. మారుతున్న అవసరాలకనుగుణ్యంగా నిన్న నేర్చుకున్న నైపుణ్యం రేపటికి పనికిరావటం లేదు. అందువలన వీరిలో ఎందరు పనికి వస్తారన్నది కూడా ప్రశ్న.

# మసక బారుతున్న అమెరికా ప్రతిష్ఠ


సుంకవల్లి సత్తిరాజు
9704903463

అమెరికా అధ్యక్ష పీఠం హుందాతనం కోల్పోయింది. ట్రంప్ చేష్టల తో అమెరికా ప్రతిష్ఠ మసక బారిపోతున్నది. అబ్రహాం లింకన్, జార్జి వాషింగ్టన్, ఫ్రాంక్లిన్ డి రూజ్‌వెల్ట్, జాన్ ఎఫ్. కెనడీ, ఒబామా వంటి నేతలు పాలించిన అమెరికా నేడు ఒక అహంకారి, తెంపరి చేతిలో పడి పూర్వ వైభవాన్ని కోల్పోతున్నది. పలుదేశాలు ట్రంప్ చేష్టలకు విలవిల్లాడుతున్నాయి. వాణిజ్య సంబంధమైన విషయా ల్లో కూడా ట్రంప్ కొర్రీలు పెడుతున్నాడు.

యు.ఎస్ ఎగుమతులకు కెనడా, మెక్సికోలు పెద్దపీట వేస్తున్నాయి. అమెరికాతో సుమారు 300 బిలియన్ల డాలర్ల వాణిజ్య భాగస్వామ్యం కలిగి ఉన్న ఈ రెండు దేశాల విషయంలో ట్రంప్ గిల్లి కజ్జాలు పెట్టుకుంటున్నారన్న అపప్రథ మూటగట్టుకున్నారు. అమెరికాతో భూ సరిహద్దులను పంచుకుంటున్న కెనడా మరియు మెక్సికోలతో ట్రంప్ వైఖరి సముచితంగా లేదు. ' మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్' లో భాగంగా కెనడా, గ్రీన్‌లాండ్ పనామా, మెక్సికోలను అమెరికాలో విలీనం చేసుకోవాలన్న ఆశ ట్రంప్‌లో మెదిలిం ది. యు.ఎస్ కు తలనొప్పిగా తయారైన మెక్సికో వలస వాదుల ను నిరోధించడానికి మెక్సికో గోడకు ట్రంప్ గతంలోనే శ్రీకారం చుట్టడం జరిగింది. ఇక కెనడా ఆర్థికంగా దివాళా తీయడం, కెనడాపై నూరుశాతం టారిఫ్ విధిస్తానని ప్రకటించడం, కెనడా తమ దేశంలో విలీనమైతే ఆర్థికపరమైన ఇబ్బందులు తొలగి పోతాయని ట్రంప్ చేసిన ప్రకటన కేవలం కెనడాకే కాదు ఇతర దేశాల సార్వభౌమత్వానికి కూడా సవాల్ విసిరినట్టుగానే భావించాలి. అమెరికాలో ఉంటున్న విదేశీయులను తరిమేయాలన్న ట్రంప్ ఆలోచన సరైనది కాదు. అమెరికాలో జన్మించిన విదేశీ వలసదారుల పిల్లల కు కూడా పౌరసత్వం నిరాకరిస్తూ, ట్రంప్ జారీచేసిన ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ నిలిచిపోయింది. అమెరికా రాజ్యాంగం, న్యాయస్థానాలు ట్రంప్ ఆలోచనలను ఏనాటికీ అంగీకరించబోవు. అక్రమ వలస దారులను తిప్పి పంపడంలో తప్పు లేకపోవచ్చు. కాని ఈ విషయంలో అమెరికా పాటిస్తున్న పద్ధతి అనాగరికంగా ఉన్నమాట వాస్తవం. అమెరికాలో సుమారు 50 లక్షల మంది భారతీయులున్నారు. వారంతా విభిన్న రంగాల్లో కష్టించి పనిచేస్తూ, అమెరికా ఆర్థిక వ్యవస్థను ప్రపంచంలోనే అగ్రగామిగా నిలబెట్టడంలో కీలక భూమిక పోషిస్తున్నారు. కేవలం భారత్‌కు చెందిన 18వేల మందిని అక్రమ వలసదారులుగా గుర్తించి, వారిలో వందల సంఖ్యలో ఇప్పటి వరకు అమెరికా భారత్‌కు తిప్పి పంపింది. ఈ ప్రక్రియ అత్యంత అవమానకరమైన రీతిలో సాగడం ఆక్షేపణీయం.

వలస ప్రజలపట్ల కఠిన వైఖరి అవలంభిస్తానని ఎన్నికల్లో ప్రచారం చేసిన డోనాల్డ్ ట్రంప్ అధికారంలోకి వచ్చిన వెంటనే అదేపని చేస్తున్నారు. చివరికి భారత్ విషయంలో కూడా అదే వైఖరి ప్రదర్శిస్తూ, అక్రమ వలసదారుల పేరుతో అమెరికాలో ఉంటున్న భారతీయులకు సంకెళ్ళు వేస్తూ, అవమానకరమైన పద్ధతిలో తరిమికొట్టడం అత్యంత దారుణం, అమానుషత్వం. సరైన ధృవీకరణ పత్రాలు లేకుండా సుమారు 18వేల మంది భారతీయులు తమ దేశంలో అక్రమంగా నివసిస్తున్నారని అమెరికా గుర్తించింది. అలాంటి వారిని భారత్‌కు పంపించే ప్రక్రియ ఇప్పటికే మొదలు పెట్టింది. మొదటి విడతలో 104 మందిని, రెండవ విడతలో 116 మందిని, మూడవ విడతలో 119 మందిని అమెరికా సైనిక విమానంలో భారత్ కు పంపించడం జరిగింది. ఇప్పటివరకు అమెరికా యుద్ధ విమానంలో భారత్‌కు పంపించిన వారిలో పంజాబ్, గుజరాత్, హర్యానా, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, హిమాచల ప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన వారున్నారు. అక్రమ వలస దారులతో కూడిన అమెరికా యుద్ధ విమానం అమృత్‌సర్‌లో దిగడం పంజాబ్ రాజకీయాల్లో దుమారం రేపింది. కాళ్ళు, చేతులు బంధించి ఇలా సైనిక విమానంలో పంపించడం అమెరికా అహంకారానికి, ఆధిపత్యానికి నిదర్శనం. ఈ విషయంలో ఐక్యరాజ్య సమితి, అంతర్జాతీయ మానవ హక్కుల సంఘాలు మౌనాన్ని పాటించడం క్షంతవ్యం కాదు. బలవంతుడితో కయ్యం పెట్టుకోలేక, నెయ్యానికే ప్రాధాన్యతనిస్తూ భారతదేశం అగ్రరాజ్యాధీశుడితో వాణిజ్య, రక్షణ సంబంధాలను కొనసాగిస్తున్నది. బ్రిక్స్ దేశాల్లో భాగమైన భారత్‌తో స్నేహం కొనసాగిస్తునే భారతీయ ఉత్పత్తులపై టారిఫ్ పెంచుతానని ట్రంప్ నిర్లక్ష్యంగా ప్రకటించారు. డాలర్‌కు ప్రత్యామ్నాయం గా మరో కరెన్సీని తెస్తే, ఆయా దేశాలపై అమెరికా నూరు శాతం సుంకాలు విధిస్తుందని చెప్పడం ప్రపంచాన్ని అమెరికా డాలర్ మాత్రమే శాసించాలనే ట్రంప్ నియంతృత్వాన్ని ప్రస్ఫుటం చేస్తున్నది. గతంలో బ్రిక్స్ దేశాలు ఉమ్మడి కరెన్సీ రూపొందించుకోవాలని పుతిన్ పిలుపిచ్చారు. అయితే ఇప్పుడా ప్రతిపాదన ఆవిరైపోయినట్లుగానే భావించాలి. మోదీ అమెరికా పర్యటన కేవలం

> ట్రంప్ అమెరికాకు 47వ అధ్యక్షుడిగా పదవీ స్వీకార ప్రమాణం చేసిన కొద్ది రోజులకే మోదీ అమెరికాలో పర్యటించడాన్ని అమెరికాలో స్థిరపడ్డ భారతీయులు ఎంతో ఆనందించారు. మోదీ పర్యటన వలన వీసాల విషయంలోను, వలసదారుల విషయంలోను ట్రంప్ వైఖరి మారుతుందని ఆశించిన వారికి నిరాశ మాత్రమే మిగిలింది. మోదీ అమెరికా పర్యటన పట్ల భారతదేశంలోని పాలక, ప్రతిపక్షాలు విభిన్నమైన స్పందన వ్యక్తం చేసాయి. అమెరికా–భారత్‌ల మధ్య ద్వైపాక్షిక సంబంధాల్లో ఈ పర్యటన ఒక మైలురాయిగా బిజెపి ప్రశంసించగా, అక్రమ వలసదారుల పేరుతో భారతీయులను బంధించి, యుద్ధ ఖైదీల మాదిరిగా సంకెళ్ళు వేసి,సైనిక విమానంలో పంపడాన్ని కాంగ్రెస్ విమర్శించింది.

కొన్ని ఒప్పందాలవరకు మాత్రమే పరిమితం కావడం జరిగింది .

ట్రంప్ అమెరికాకు 47వ అధ్యక్షుడిగా పదవీ స్వీకార ప్రమాణం చేసిన కొద్ది రోజులకే మోదీ అమెరికాలో పర్యటించడాన్ని అమెరికాలో స్థిరపడ్డ భారతీయులు ఎంతో ఆనందించారు. మోదీ పర్యటన వలన వీసాల విషయంలోను, వలసదారుల విషయంలోను ట్రంప్ వైఖరి మారుతుందని ఆశించిన వారికి నిరాశ మాత్రమే మిగిలింది. మోదీ అమెరికా పర్యటన పట్ల భారతదేశంలోని పాలక, ప్రతిపక్షాలు విభిన్నమైన స్పందన వ్యక్తం చేసాయి. అమెరికా–భారత్ ల మధ్య ద్వైపాక్షిక సంబంధాల్లో ఈ పర్యటన ఒక మైలురాయిగా బిజెపి ప్రశంసించగా, అక్రమ వలసదారుల పేరుతో భారతీయులను బంధించి, యుద్ధ ఖైదీల మాదిరిగా సంకెళ్ళు వేసి,సైనిక విమానంలో పంపడాన్ని కాంగ్రెస్ విమర్శించింది. బ్రిక్స్ దేశాలపై 100శాతం టారిఫ్ విధిస్తాననే ట్రంప్ హెచ్చరికను బ్రిక్స్ కూటమి ఎలా పరిగణిస్తుందో చూడాలి.

ఇండో అమెరికన్ 'ట్రేడ్ డీల్'లో చోటుచేసుకుంటున్న పరిణామాల వలన భవిష్యత్తులో ఎవరికి లాభం? ఎవరికి ఎక్కువ నష్టం? అనే విషయంపై విశ్లేషకులు తలలు బాదుకునే అవసరం లేదు. ఇప్పటికే కేంద్ర బడ్జెట్‌లో అమెరికాకు అనుకూలంగా పన్నులు తగ్గించినా ట్రంప్‌కు రుచించలేదు. బైడెన్ హయాంలో అమెరికాతో భారత్‌కు కుదిరిన సాంకేతిక, రక్షణ విషయాల్లో మార్పులేమీ లేవు. భారత్ అమెరికాకు క్రియాశీలక వాణిజ్య భాగస్వామి. పైగా ఇతర దేశాల కంటే తమ దేశం నుంచే అధికంగా ఆయుధాలను, ఆయిల్, గ్యాస్ కొనుగోలు చేయాలని భారత్‌ను కట్టడి చేయడం వలన ఇప్పటికే తక్కువ ధరకు ఇంధనం సరఫరా చేస్తున్న భారత్‌కు అత్యంత విశ్వసనీయ దేశమైన రష్యా పరిస్థితి ఏమిటి? లిక్విఫైడ్ నేచురల్ గ్యాస్ సరఫరాలో ఖతార్ భారత్‌కు పెద్ద వాణిజ్య భాగస్వామి. క్రూడ్ ఆయిల్‌లో రష్యా భారత్ కు పెద్ద భాగస్వామి. భారత్‌కు అమెరికా పంపుతున్న వస్తువుల్లో దిగుమతి సుంకాలు విధించే వస్తువులు కేవలం స్వల్పశాతం మాత్రమే ఉన్నాయని, కాబట్టి అమెరికా బెదిరింపులకు భయపడవలసిన అవసరం లేదనే వాదనలున్నాయి. అమెరికా రెసిప్రోకల్ టారిఫ్‌పై మున్ముందు ఎలాంటి సమస్యలు వస్తాయో వేచి చూడాలి.

ట్రంప్ చర్యలు ప్రపంచాన్ని పెనంమీద నుంచి పొయ్యిలో పడేసే విధంగా ఉంటున్నాయి. పారిస్ ఒప్పందం నుండి అమెరి కా గతంలో ట్రంప్ అధ్యక్షుడిగా ఉన్నప్పుడే వైదలగడం జరిగిం ది. వాతావరణ మార్పులు, పెరుగుతున్న గ్లోబల్ వార్మింగ్ దృష్ట్యా పారిస్ ఒప్పందాన్ని బైడెన్ ఆమోదించినా, తిరిగి అమెరికా అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన ట్రంప్ పాత పల్లవినే అందుకుని పారిస్ ఒప్పందాన్ని తుంగలో తొక్కారు. ప్రపంచం ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు మూలం శిలాజ ఇంధనాల వాడకం. సౌరశక్తి వాడకంపై దృష్టి సారించకుండా శిలాజ ఇంధనాల వినియోగం అధికం చేయాలనే ట్రంప్ వితండవాదం పర్యావరణానికి పెద్ద దెబ్బ. ఇప్పుడిప్పుడే క్లీన్ ఎనర్జీ పై దృష్టి సారిస్తున్న ప్రపంచానికి ట్రంప్ నిర్ణయం ఆందోళన కలిగిస్తున్నది. ట్రంప్ బాధ్యతారాహిత్యానికి ప్రపంచం మూల్యం చెల్లించుకోక తప్పదు. ప్రపంచంలోని పలు దేశాలు తమ అవసరాల దృష్ట్యా అగ్రదేశమైన అమెరికా అడుగులకు మడుగులొత్తక తప్ప దు. అమెరికా అనుసరించే విధానాలకు భజన చేయక తప్పదు. తమ దేశమే గొప్పదనే నిరంకుశ వాదంతో హిట్లర్‌ను తలదన్నే జాత్యహంకారంతో చెలరేగిపోతున్న ట్రంప్ 'ల్యాండ్ ఆఫ్ ఇమ్మిగ్రెంట్స్' గా పేరొందిన అమెరికా నుండి ఇల్లీగల్ ఇమ్మిగ్రెంట్స్ పేరుతో విదేశీయులకు బేడీలు వేసి, అత్యంత అవమానకరమైన రీతిలో ఆయా దేశాలకు పంపడం అమానుషత్వం. ప్రపంచంలోని అన్ని దేశాలు తమ అవసరాల కోసం ఇతర దేశాలపై ఆధారపడుతున్నాయి. కొన్ని దేశాలు సంపన్న దేశాలుగా, మరికొన్ని నిరుపేద దేశాలుగా మనుగడ సాగిస్తున్నాయి. కొన్ని దేశాలు సహజసంపదతో, అనుకూలమైన భౌగోళిక స్వరూపంతో, ఉపాధి అవకాశాలతో, వాణిజ్య సంబంధమైన ఎగుమతులతో సంపన్న దేశాలుగా చెలామణీ అవుతుంటే, కొన్ని దేశాలు తమ మేథాశక్తితో, సాంకేతికంగాను, ఆయుధ పరంగాను ఉచ్ఛస్థితిలో ఉన్నాయి. అమెరికా, చైనా లాంటి దేశాలు ఆయుధ సామర్థ్యంతో, సాంకేతిక పరిజ్ఞానంతో, వాణిజ్యంతో బలమైన ఆర్థిక వ్యవస్థలుగా ఉన్నాయి. కొన్ని దేశాలు తమ అవసరాలకు అనుగుణంగా స్వయం స్వావలంబన సాధిస్తున్నాయి. సహజ వనరులు లేని దేశాలు, అభివృద్ధి కి అనువుగా లేని దేశాలు నిరక్షరాస్యతతో, మౌలిక సదుపాయాల లేమితో ఆకలి, దరిద్రం వంటి సమస్యలతో బాధపడుతున్నాయి. అభివృద్ధి చెందాలని భావించే దేశాలు పరాయి దేశాల ఈర్ష్యాద్వేషాలతో తమ రక్షణ కోసం, ఆయుధాల కోసం ఇతర దేశాలను ఆశ్రయిస్తున్నాయి. ఈ పరిస్థితులు మారాలి. తమ దేశంలోని సహజ వనరులను, యువ శక్తిని వినియోగించుకుని అభివృద్ధికి బాటలు వేసుకోవాలి. అందివచ్చిన ప్రతీ అవకాశాన్ని వినియోగించుకుని, అన్ని రంగాల్లోను స్వయం స్వావలంబన సాధించాలి. అగ్ర రాజ్యాల అధికారం క్రింద నలిగి పోకుండా, వారి ఆంక్షలకు బలికాకుండా తమను తామే అన్ని విధాలా తీర్చుదిద్దుకోవాలి.

న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్ సంపాదకీయం (17–02–25)

## ప్రైవేటు వర్సిటీలపై ఆహ్వానించదగిన కేరళ చర్య

కేరళలో ప్రైవేటు యూనివర్సిటీలను అనుమతి స్తూ తీసుకున్న నిర్ణయం రాష్ట్ర ప్రభుత్వానికి కీలకమైన విధానమార్పు, సిపిఐ(ఎం)కు సంబంధించి ఇది పూర్తి తిరోముఖ మలుపు(యు–టర్న్). అయి తే, ఈ ఆకస్మిక మార్పు రాష్ట్రానికి ప్రయోజనం చేకూర్చడమే కాకుండా, మారుతున్న కాలం, విధానాలకు సంకేతం. ఉన్నత విద్యారంగంలో ప్రైవేటీకరణను సిపిఐ(ఎం) గతంలో తీవ్రంగా వ్యతిరేకించటమే కాకుండా, విద్యా రంగం ప్రైవేటీకరణ చర్యలను అడ్డుకునేందుకు తరచు హింసకు దిగేది. 1994లో కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రభుత్వం అవలంభిస్తున్న విద్యా విధానాలకు వ్యతిరేకంగా కన్నూరు లోని కూత్తుపరంబలో నిరసన వ్యక్తం చేస్తున్న సిపిఐ(ఎం) యువ జన విభాగం డివైఎఫ్ఐకు చెందిన ఐదుగురు కార్యకర్తలు పోలీసు కాల్పుల్లో చనిపోయారు. గాయపడిన ఒకరు 2024లో మరణించేంత వరకు 30 ఏళ్ళ పాటు మంచంమీదనే జీవితాన్ని కొనసాగిస్తూ సజీవ అమరుడిగా ప్రసిద్ధుడై, విద్య ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పార్టీ వైఖరికి చిహ్నంగా నిలిచాడు. 2016లో కోవెలంలో జరిగిన 'గ్లోబల్ ఎడ్యుకేషన్ మీట్'లో 'ఉన్నత విద్య వ్యాపారీకరణ' ప్రయత్నాలను నిరసిస్తున్న పేరుతో, కేరళ ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ టి.పి.శ్రీనివాసన్‌పై సిపిఐ(ఎం) విద్యార్థి విభాగం ఎస్ఎఫ్ఐ చేయి చేసుకుంది.




ఈ నేపథ్యంలో సిపిఐ(ఎం)లో, అధికార సంఘటనలో అంతర్గతంగా తీవ్రమైన వ్యతిరేకత ను అధిగమించి పినరాయి విజయన్ ప్రభుత్వం సాహసోపేతంగా ప్రైవేటు యూనివర్సిటీలకు ఎర్ర తివాచీ పరిచించి. గత వారం క్యాబినెట్ ఆమోదించిన ముసాయిదా బిల్లును ప్రభుత్వం త్వరలోనే శాసనసభ ముందుకు తీసుకురావచ్చు. వాస్తవాని కి అనేక రంగాలలో ప్రశంసనీయ అడుగులు వేసి న కేరళ ఉన్నత విద్యలో పలు రాష్ట్రాలకంటే చాలా వెనుకబడింది. ఈ రంగంలో మార్పుల పట్ల ఆ పార్టీలో ఉన్న నిగూఢమైన సాంప్రదాయక వ్యతిరేకతే ఇందుకు కారణం. రాష్ట్రం నుంచి ఆందోళన కలిగించే స్థాయిలో విద్యార్థులు బైటికి వెళ్తుండటానికి ప్రాథమికంగా ఉన్నత విద్య నాణ్యత లేకపోవటమే కారణం. ఈ వాస్తవమే ఉన్నత విద్యా రంగం ద్వారాలు తెరవాల్సిన తార్కికతను ప్రభుత్వం గుర్తించేటట్లు చేసింది. రెండు దశాబ్దాలు ఆలస్యంగా ఈ నిర్ణయం జరిగిం ది.

ముఖ్యమంత్రి ఈ నిర్ణయాన్ని సమర్థిస్తూ, ఇది కేరళ అభివృద్ధి నమూనాకు అనుగుణంగా ఉంటుందని పేర్కొంటూ సామాజిక న్యాయానికి కట్టుబడి ఉంటామని వాగ్దానం చేశారు. ఎట్టకేలకు సిపిఐ(ఎం)కు వివేకం ఉదయించినట్లు కనపడుతుంది. కాలానికి అనుగుణంగా మారడం ఆవశ్యకం తప్ప ప్రత్యామ్నాయం కాదు. ఈ ప్రభుత్వం ప్రారంభించిన ఇతర సంస్కరణలకు ఉన్నత విద్యారంగాన్ని ప్రైవేటురంగానికి తెరవడం తోడైనప్పుడు అది కేరళలో పెద్ద మార్పు తెస్తుంది. అయితే, అసమంజస నియంత్రణలకు గురి చేయడకుండా, తమ పూర్తి సామర్థ్యంతో పని చేసేందుకు వీలుగా కొత్త యూనివర్సిటీలకు సరిపడ స్వాతంత్ర్యం లభించాలి. సైద్ధాంతిక ఒత్తిళ్ళకు తలొగ్గకుండా ప్రభుత్వం తన ప్రణాళికలను అమలు చేసేందుకు సంపూర్ణ నిబద్ధతతో ఉండాలి. అర్ధ–చర్యలు సహాయకారి కాబోవు.

లేఖ

## పదవ తరగతిలో మార్కులు వద్దు... గ్రేడింగ్ ముద్దు

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, సంబంధిత విద్యా శాఖ పదవ తరగతి విద్యార్థులకు ఈ విద్యా సంవత్స రం నుండి గ్రేడింగ్ కు బదులు మార్కులు కేటాయించాలని నిర్ణయించింది. దీనివల్ల పదవ తరగతి విద్యార్థులపై మానసిక భారం పడనున్నది. ఇప్పటికే ప్రతి సబ్జెక్టులో అధిక పాఠ్యాంశాలు, అధిక సిలబస్ ఉన్నదని, పైగా మార్కులు కేటాయించడం వల్ల విద్యార్థులపై అధిక ఒత్తిడి పడుతుందని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. విద్యాశాఖ విద్యార్థులతో వారి తల్లిదండ్రులతో ఎలాంటి సమావేశాలు నిర్వహించకుండా వారి అభిప్రాయాలు తెలుసుకోకుండా గ్రేడింగ్ పద్ధతికి స్వస్తి చెప్పింది. ఇలా ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవడాన్ని విద్యావేత్తలు, తల్లిదండ్రులు విమర్శిస్తున్నారు. ఇంగ్లీష్ మీడియం మోజులో ఉన్న తల్లిదండ్రులు అత్యధిక మార్కులు తెచ్చుకోవాలని తమపై ఒత్తిడి చేస్తారని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. విద్యార్థుల మానసిక పరిస్థితిని అర్థం చేసుకోవాలని వారి సృజనాత్మక, ప్రతిభను వెలికితీసే మార్గాలను చూడాలని, మానసిక ఒత్తిడికి గురి చేయకూడదని మానసిక శాస్త్రవేత్తలు, నిపుణులు అభిప్రాయపడుతున్నారు. మానసిక ఒత్తిడికి గురైనవారు ఆత్మహత్యల కు పాల్పడే ప్రమాదం ఉందని అంటున్నారు. మార్కులకు బదులుగా గ్రేడింగ్ పద్ధతినే కొనసాగించాలని విద్యార్థులు, ఉపాధ్యాయుల అభిప్రాయం ఉన్నప్పటికీ ప్రభుత్వం, సంబంధిత అధికారులు ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకోలేదనే విమర్శ ఉన్నది. ఎఫ్ఎ మార్కులు తొలగించినప్పటికీ ప్రతి సబ్జెక్టుకు వంద మార్కులకు గాను 91 మార్కులకు పాత పద్ధతిలో గ్రేడింగ్ ఇవ్వాలని కోరుతున్నారు. ఇక మార్కుల పద్ధతి కొనసాగిస్తే రాష్ట్రంలోని ప్రైవేట్ పాఠశాలలు, కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు ర్యాంకుల కోసం, అత్యధిక మార్కుల కోసం చదవమని ఒత్తిడికి గురిచేసే అవకాశం లేకపోలేదు. అందువల్ల తెలంగా ణ రాష్ట్ర ప్రభుత్వం, విద్యాశాఖ స్పందించి గ్రేడింగ్ పద్ధతిని కొనసాగించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

కె.కృష్ణమూర్తి

# భారత్, బంగ్లా సరిహద్దుపై చర్చలు

నేడు బిజిబితో సమావేశం కానున్న బిఎస్ఎఫ్ అధికారులు



**న్యూఢిల్లీ :** భారత్‌-బంగ్లా సరిహద్దు వివాదాలపై చర్చించేందుకు ఉన్నతాధికారులతో కూడిన బంగ్లాదేశ్ సరిహద్దు రక్షణ దళం బోర్డర్ గార్డ్ బంగ్లాదేశ్(బిజిబి) బృందం సోమవారం రాజధాని ఢిల్లీకి చేరుకుంది. ఇరు దేశాల మధ్య కంచె ఏర్పాటు, బిఎస్ఎఫ్ సిబ్బంది, సామాన్య ప్రజలపై బంగ్లాదేశ్ అల్లరి మూకల దాడులపై ద్వైపాక్షిక చర్చలు మంగళవారం జరుగనున్నాయని అధికారులు తెలిపారు. డైరెక్టర్ జనరల్ స్థాయిలో జరుగనున్న ఈ 55వ ద్వైపాక్షిక చర్చలు లోధీ మార్గంలోని బోర్డర్ సెక్యూరిటి ఫోర్స్(బిఎస్ఎఫ్) ప్రధాన కార్యాలయంలో మంగళవారం జరుగనున్నాయి. ప్రత్యేక విమానంలో భారత్‌కు చేరుకున్న బంగ్లాదేశ్ ప్రతినిధుల బృందం 20వ తేదీవరకు ఇక్కడే ఉంటారు. ద్వైపాక్షిక చర్చలతో పాటు బంగ్లాదేశ్ బృందం కొందరు హోంశాఖ ఉన్నతాధికారులతో కూడా భేటీ కానున్నది. గత యేడాది హసీనా ప్రభుత్వం పడిపోయిన తరువాత ఇరు దేశాల ఉన్నతాధికారుల మధ్య జరుగుతున్న తొలి ద్వైపాక్షిక సమావేశం ఇది. కాగా భారత బృందానికి బిఎస్ఎఫ్ డైరెక్టర్ జనరల్ దల్జీత్ సింగ్ నేతృత్వం వహిస్తుండగా, బంగ్లాదేశ్ బృందానికి బిజిబి డిజి మేజర్ జనరల్ మొహమ్మద్ అష్రఫుజ్జమాన్ సిద్దిఖి నాయకత్వం వహిస్తున్నారు.
సరిహద్దు సమస్యల పరిష్కారం, ఇరు దేశాల సరిహద్దు సిబ్బంది మధ్య సుహృద్భావన పెంపొందించుకునేందుకు సమావేశం నిర్వహించనున్నట్లు గత వారం బిఎస్ఎఫ్ వెల్లడించింది. బిఎస్ఎఫ్ సిబ్బంది, సామాన్య ప్రజలపై బంగ్లాదేశ్ అల్లరి మూకల దాడుల నిరోధం, సరిహద్దు వెంబడి కంచె నిర్మాణం, బంగ్లాదేశ్‌లోకి చొరబాట్ల నిషేధం, సరిహద్దుల వెంబడి నిర్మాణాలు, సరిహద్దు నిర్వహణ ప్రణాళికను సమర్ధంగా అమలు చేయడం, ఇరువర్గాల మధ్య విశ్వాసం పెంపొందించడం తదితర అంశాలపై సమావేశంలో చర్చించనున్నట్లు తెలిపారు. ఇరు దేశాల మధ్య చివరిసారిగా గత యేడాది మార్చిలో బంగ్లాదేశ్ రాజధాని ఢాకాలో సమావేశం జరిగింది. భారత్, బంగ్లాదేశ్‌ల మధ్య 4,096 కిలోమీటర్ల సరిహద్దు పశ్చిమ బెంగాల్, త్రిపుర, మేఘాలయ, అస్సాం, మిజోరాం రాష్ట్రలను స్పృశిస్తూ సాగుతుంది. ఈ ప్రాంతంలో శాంతి భద్రతల బాధ్యతను బిఎస్ఎఫ్ వహిస్తోంది. గత యేడాది డిసెంబర్‌లో సరిహద్దుల వెంబడి నిర్మాణాలపై ఇరు దేశాల హైకమిషనర్లకు ఫిర్యాదులు చేయడంతో ఇరు దేశాల మధ్య కొంత ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయి. దీనిపై పార్లమెంట్‌లో బడ్జెట్‌పై చర్చ సందర్భంగా ప్రభుత్వం సరిహద్దు సమస్యలపై సానుకూల వాతావరణం నెలకొనేందుకు పొరుగు దేశంతో చర్చలు జరుపుతున్నట్టు తెలిపింది. సరిహద్దు చొరబాట్లు, నేరాల నిరోధానికి కంచె ఏర్పాటుపై సమావేశం నిర్వహించనున్నట్టు దేశ వ్యవహారాల శాఖ సహాయమంత్రి నిత్యానంద రాయ్ లిఖితపూర్వకంగా తెలిపారు. ఈ నేపథ్యంలో తాజా సమావేశం నిర్వహిస్తున్నారు. 20వ తేదీన చర్చల సారాంశంపై ఒక అవగాహన కుదుర్చుకోనున్నారు.

# వక్ఫ్ బిల్లులో లోపాలు సరిదిద్దండి

స్పీకర్‌కు సిపిఐ ఎంపి సందోశ్‌కుమార్ లేఖ



**న్యూఢిల్లీ:** వక్ఫ్ సవరణ బిల్లులో చోటుచేసుకున్న లోపాలు సరిదిద్ది... తిరిగి ప్రచురించాలని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు సిపిఐ ఎంపి సందోశ్‌కుమార్ సోమవారం ఓ లేఖలో విజ్ఞప్తి చేశారు. వక్ఫ్ సవరణ బిల్లు 2024 నివేదికను సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జెపీసీ) పార్లమెంటు ఉభయ సభలకు సమర్పించడంలో చోటుచేసుకున్న అనౌచిత్యాలను, లోపాలను సరిదిద్ది తిరిగి ప్రచురించాలని సందోశ్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. '2025 జనవరి 30వ తేదీన బిల్లు నివేదికను స్పీకర్‌కు సమర్పించారు. లోక్‌సభ నియమ నిబంధనలను అనుసరించి 280 రూల్ కింద అదే రోజు నివేదికను ముద్రింపజేసి పంపిణీ చేయాలని స్పీకర్ ఉత్తర్వు చేశారు. స్పీకర్ ఉత్తర్వు ప్రకారం నివేదికను అదే రోజు డిజిటల్ సంసద్ వెబ్‌సైట్‌లో పెట్టారు. జేపీసీలో సభ్యులుగా ఉన్న ఉభయసభల ఎంపీలు కొందరు నివేదిక నాల్గవ అనుబంధంలో తమ నిరసనలను వ్యక్తం చేసిన సమాచారం ఉంది. అయితే ఇందులో నుంచి కొన్ని పేజీలు అంటే కొంత సమాచారాన్ని తీసివేసి ప్రచురించారు. జెపిసిలో సభ్యులుగా ఉన్న కొంతమంది రాజ్యసభ సభ్యులు నివేదికను పార్లమెంటుకు సమర్పించిన రోజు సభలో నిరసన తెలిపారు. దీనిపై కొంతమంది మంత్రులు భిన్న ప్రకటనలు చేశారు. నియమ నిబంధనలు, విధివిధానాలు అవగాహన లేకపోవటం వల్ల మంత్రులు భిన్నంగా స్పందించారు. రాజ్యసభకు సమర్పించిన నివేదిక అనుబంధం నాలుగులో తప్పులు చోటుచేసుకున్నాయి. అయితే లోక్‌సభలో సమర్పించిన నివేదికలో అలాంటి తప్పులు లేవు. ఆ నివేదిక అసలైన నివేదిక. అది స్పీకర్‌కు జనవరి 30న సమర్పించారు. సవరించిన నివేదికను ఫిబ్రవరి 13న డిజిటల్ సంసద్ వెబ్‌సైట్‌లో అప్లోడ్ చేశారు. ఆలోచించిన తరువాత నిరసన అంశాలను సవరించినట్లుగా స్పష్టంగా వెల్లడవుతుంది. ఈ నివేదికను ప్రచురించటం వాస్తవాలను వక్రీకరించటంతో సమానం. పార్లమెంటును, ప్రజలను తప్పుదోవ పట్టించటం అవుతుంది. హోంశాఖ మంత్రి అమిత్‌షా లోక్‌సభలో నివేదికలో లోపాలను సరిదిద్ది నిరసన అంశాలను కూడా సరిచేసేందుకు ప్రభుత్వానికి అభ్యంతరం లేదని చెప్పారు. మంత్రులు నివేదికపై జోక్యం చేసుకోవడం పార్లమెంటును దిగజార్చినట్లే అవుతుంది. జేపీసీ నివేదిక అంశాలలో కేంద్ర మంత్రి వర్గంలోని మంత్రులకు జోక్యం చేసుకునే హక్కు లేదు. వక్ఫ్ బిల్లు అధ్యయనం చేసి నివేదికను పార్లమెంటుకు సమర్పించేందుకే జేపీసీని ఏర్పాటు చేశారు. కమిటీపై ప్రిసైడింగ్ ఆఫీసర్‌లకు మాత్రమే అధికారాలు ఉంటాయి. రద్దు చేసిన భాగాలను తిరిగి సరిచేసి జేపీసీ నివేదికను తుది నివేదికగా నిర్ణయించేందుకు స్పీకర్‌కు మాత్రమే అధికారం ఉంటుందని నాకు తెలుసు. లోక్‌సభలో స్పీకర్ ఈ అంశాలను అంగీకరించారు. నివేదికలో చోటుచేసుకున్న అనౌచిత్యాలను మీ కార్యాలయం చక్కదిద్ది లోపాలను సరిచేసి వివరాలతో ప్రచురించగలరని ఆశిస్తున్నాను' అని సందోశ్‌కుమార్ లేఖలో కోరారు.

## కేంద్రం చర్యలకు వ్యతిరేకంగా నేడు డిఎంకె నిరసనలు

**చెన్నై :** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నేతృత్వంలోని కేంద్రం తమిళనాడుకు నిధులను నిరాకరించడం ద్వారా ద్రోహం చేస్తుందని డిఎంకె మండిపడింది. నిధుల నిరాకరణ, ఎన్ఇపిని అమలు చేస్తామని కేంద్ర పట్టుబట్టడాన్ని నిరసిస్తూ మంగళవారం డిఎంకె, మిత్రపక్షాలనేతలు భారీ నిరసన తెలియజేయనున్నట్లు అధికార ద్రవిడన్ పార్టీ ప్రకటించింది. బిజెపి మినహా తమిళనాడు అధికార డిఎంకె, ప్రధాన ప్రతిపక్షం ఎఐఎడిఎంకె, ఇతర పార్టీలు ఎన్ఇపి, మూడు భాషా నిబంధనలను అమలు చేస్తామన్న కేంద్రం నిర్ణయాన్ని వ్యతిరేస్తున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్రం రాష్ట్ర హక్కులపై జోక్యం చేసుకోవడానికి అన్ని ప్రయత్నాలు చేస్తోందని ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ నేతృత్వంలోని పార్టీ ఆరోపించింది. మంగళవారం నిర్వహించే నిరసన కార్యక్రమం కేవలం ప్రారంభ అడుగు మాత్రమే అని అన్నారు. కేంద్ర విద్యా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఎన్ఇపిని ఆమోదించబడే వరకు కేంద్రం తమిళనాడు విద్యా శాఖకు నిధులు విడుదల చేయదని చెబుతూ బెదిరిస్తున్నారన్నారు. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారాం తమిళనాడుకు నిధులు కేటాయించడంలో సముఖతంగా లేరని, ఆమె రాష్ట్ర ప్రాజెక్టులను నిరంతరం విస్మరిస్తున్నారని డిఎంకె ప్రధాన కార్యాలయంలో ఒక ప్రకటనలో పేర్కొంది. గవర్నర్ కార్యాలయాన్ని ఉపయోగించి అతిక్రమణలు, యుజిసి ద్వారా రాష్ట్ర విద్యా మౌలిక సదుపాయాలను దెబ్బతీయడానికి ప్రయత్నించడంపై కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శించింది. త్రిభాషా విధానం ముసుగులో హిందీని రుద్దడానికి కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు.

## ఎస్‌యువి బోల్తాపడి నలుగురు మృతి

**సిధి :** మధ్యప్రదేశ్‌లోని సిధి జిల్లా ప్రయాగ్‌రాజ్‌లో సోమవారం తెల్లవారుజామున మహాకుంభ్‌కు వెళ్తున్న ఎస్‌యువి బోల్తా పడటంతో నలుగురు మృతి చెందగా, అనేక మంది గాయపడ్డారని పోలీసులు తెలిపారు. సింగ్రౌలి జిల్లాలోని వైధాన్ నుండి ప్రయాగ్‌రాజ్ వైపు ఎస్‌యువి వెళుతుండగా తెల్లవారుజామున 2 గంటల ప్రాంతంలో అమాహియా పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ప్రమాదం జరిగిందని పోలీసు సూపరింటెండెంట్ (ఎస్‌పి) రవీంద్ర వర్మ పిటిఐకి తెలిపారు. యాత్రికులను తీసుకెళ్తున్న వాహనం ముధ పహాడ్ దాటుతుండగా బోల్తా పడి నలుగురు మృతి చెందారని ఆయన తెలిపారు. మరో నలుగురు ప్రయాణికులు తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని అధికారి తెలిపారు.

## 'పార్టీపేరు చెడగొట్టొద్దు'

**బెంగళూరు :** కర్ణాటకలోని అధికార పార్టీలో నాయకుల మధ్య రోజురోజుకు విభేదాలు ముదురుతున్నాయి. సోమవారం సహకార శాఖ మంత్రి కె.ఎన్.రాజన్న డిప్యూటి సిఎం డి.కె.శివకుమార్ పార్టీ పేరును, అధిష్టానం పేరును దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించడంతో విభేదాలు మరింతగా రాజుకున్నాయి. రాజన్నతో సహా పార్టీలోని కొందరు నాయకులు సిఎం సిద్దరామయ్య పేరును ఉపయోగించుకుంటున్నారని, ఎవరూ సిఎం పేరు చెప్పి లబ్ధి పొందాల్సిన అవసరం లేదన్న శివకుమార్ వ్యాఖ్యలకు సోమవారం రాజన్న స్పందించారు. కొందరు పార్టీ నాయకులు రానున్న ఎన్నికలలో సిద్దరామయ్య నిలబడాలని, ప్రస్తుత పరిస్థితులలో పార్టీ మనుగడకు సిద్దరామయ్యవంటి నాయకత్వం అవసరమని పేర్కొనడంపై శివకుమార్ ఆదివారం వ్యాఖ్యలు చేశారు. ఈ యేడాది కర్ణాటక అసెంబ్లీకి ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో సిఎం కావాలన్న కోరికను శివకుమార్ ఇటీవల బహిరంగంగానే స్పష్టం చేశారు. ఈ అంశంపై ఇప్పుడు చర్చించదలచుకోలేదని తన కేరళ, రాజస్థాన్ పర్యటనల అనంతరం పరిశీలిస్తానని శివకుమార్ తెలిపారు. కాగా సోమవారం రాజన్న విలేకరులతో మాట్లాడుతూ 'ముఖ్యమంత్రి పేరును దుర్వినియోగం చేయరాదని మాకూ తెలుసు. అదే విషయం శివకుమార్‌కు కూడా తెలిపాము. శివకుమార్ పదేపదే ఏఐసిసి, కాంగ్రెస్ అధిష్టానం పేర్లను ఉపయోగించడాన్ని మానుకోవాలి. ఏ విషయంపై మాట్లాడినా శివకుమార్ ఏఐసిసి పేరు ప్రస్తావిస్తున్నారు. ఏ సమస్యపైనైనా ఏఐసిసి మాట్లాడుతుంది. వారి దృష్టికి సమస్యను తీసుకెళితే వారే పరిష్కారం చూపుతారు' అని శివకుమార్ అంటున్నారని పేర్కొన్నారు. మేమందరం అధిష్టానం ఆదేశాలకు కట్టుబడి ఉండాల్సిందేనని, రాజకీయాల్లో కొందరు పరిస్థితులను తమకు అనుగుణంగా మలచుకోవాలని చూస్తారని రాజన్న అన్నారు. 50 ఏళ్లుగా పార్టీలో కొనసాగుతున్న తనకు ఇతరులనుంచి పార్టీ క్రమశిక్షణ గురించి తెలుసుకోవాల్సిన అవసరం లేదన్నారు. శివకుమార్ తన వ్యాఖ్యలలో సిఎం పేరును సూచించడం తనను, పార్టీలోని కొందరు నాయకులను హెచ్చరించినట్టుగా ఉందన్నారు. సిఎం సిద్దరామయ్య పూర్తికాలం అధికారంలో కొనసాగాలన్నది పార్టీలోని నాయకులు కోరికి అని, అందుకు సిఎం కూడా అంగీకారం తెలిపారన్నారు. తమ అభిప్రాయం ఏదైనప్పటికీ తుది నిర్ణయం అధిష్టానం తీసుకుంటుందని, లెజస్లేచర్ పార్టీలోనూ సిఎం ఇదే విషయాన్ని నిర్ధారించారన్నారు. సిఎం చెప్పిన విషయానికే తామూ కట్టుబడి ఉంటామన్నారు. ఎమ్మెల్యేల అభిప్రాయాలను తెలుసుకున్న తరువాత అధిష్టానమే నిర్ణయం తీసుకుంటుందన్నారు. కాగా 2023 మేలో జరిగిన ఎన్నికల అనంతరం సిఎం అభ్యర్థిత్వానికి సిద్దరామయ్య, శివకుమార్‌ల మధ్య గట్టి పోటీ ఏర్పడిన విషయం తెలిసిందే. దీనితో పార్టీ అధిష్టానం శివకుమార్‌ను ఒప్పించి డిప్యూటి సిఎంగా నియమించింది. అప్పట్లో రొటేషన్ పద్ధతిలో సిఎం పదవిలో కొనసాగేందుకు లోపాయకారి ఒప్పందం కుదిరినట్టు సమాచారం. అయితే పార్టీ అధికారికంగా దీనిని ధృవీకరించలేదు. మరో ప్రశ్నకు సమాధానంగా 'ఒక వ్యక్తి, ఒక పదవి' పార్టీ విధానం మేరకు డిప్యూటీ సిఎం, కర్ణాటక కాంగ్రెస్ అధ్యక్షుడిగా కొనసాగే హక్కు శివకుమార్‌కు లేదన్నారు. దీనిపై అధిష్టానం నిర్ణయం తీసుకుంటుందన్నారు.

## ప్రార్థనా స్థలాల (ప్రత్యేక నిబంధనలు) చట్టానికి సంబంధించి..

# అధిక పిటిషన్ల దాఖలుపై 'సుప్రీం' అసహనం

ఏప్రిల్‌లో త్రిసభ్యధర్మాసనం విచారిస్తుందని స్పష్టీకరణ



**న్యూఢిల్లీ :** ప్రార్థనాస్థలాల (ప్రత్యేక నిబంధనలు) చట్టంపై అనేక అభ్యర్థనలు దాఖలు చేయడంపై సుప్రీంకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. 1994, ఆగస్టు 15 నాటికి మతప్రదేశాలకున్న ప్రతిపత్తిని పరిరక్షిస్తున్న 1991 చట్టానికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న పోస్ట్ నోటీస్ పిటిషన్లను ముగ్గురు న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనం ఏప్రిల్‌లో విచారిస్తుందని సోమవారం అత్యున్నత న్యాయస్థానం తెలిపింది. అయితే ఇటీవల ఎవరైతే పిటిషన్లు దాఖలుచేసి వాటిపై నోటీసులు దాఖలు చేయబడని పిటిషనర్లు అయిన సమాజ్‌వాదీ పార్టీ నాయకుడు, కైరానా ఎంపి ఇక్రాచౌదరి లాంటి తదితరులకు కొత్త న్యాయపరమైన గ్రౌండ్స్‌తో ఒకప్పటి పెండింగ్ పిటిషన్లపై జోక్యం కోసం దాఖలు చేసిన దరఖాస్తులకు సుప్రీంకోర్టు స్వేచ్ఛను ఇచ్చింది. ఇంకా నోటీసులు అందని తాజా పిటిషన్లను సుప్రీంకోర్టు ప్రధానన్యాయమూర్తి సంజీవ్‌ఖన్నా, జస్టిస్ సంజయ్‌కుమార్‌లతో కూడిన ధర్మాసనం కొట్టిపారేసింది. రిట్ పిటిషనర్లు కొత్త గ్రౌండ్స్‌పై అప్లికేషన్లను (జోక్యం) దాఖలు చేసుకోవచ్చని సూచించింది.' తాజాగా అందిన అనేక రిట్ పిటిషన్ల సంఖ్యను పరిగణనలోనికి తీసుకున్న తర్వాత మేం ఈ ఆర్డర్‌ను ఆమోదించవలసి వచ్చింది. నోటీసులు లేని పెండింగ్‌లో ఉన్న రిట్ పిటిషన్లను ఏదైనా ఉంటే అదనపు కారణాలను పెంచుతూ దరఖాస్తును దాఖలు చేసే స్వేచ్ఛతో కొట్టివేయబడతాయి. పెండింగ్ పిటిషన్లలో ఏదైనా లేవనెత్తని కొత్త అంశాన్ని అక్కడ లేవనెత్తని చట్టపరమైన సమస్య ఉన్నప్పుడు మాత్రమే మేం కొత్త 'ఐఎ'కు అనుమతిస్తాం అని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ఇది ఏప్రిల్ 1వ తేదీనుంచి ప్రారంభమయ్యే వారంలో ముగ్గురు న్యాయమూర్తుల ముందు 1991చట్టానికి సంబంధించిన పిటిషన్లు, క్రాస్‌పిటిషన్ల బ్యాచ్‌ను మాత్రమే బెంచ్ లిస్టింగ్ చేసింది. దీనికి ముందు ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా మాట్లాడుతూ 'ప్రజలు కొత్త కారణాలతో తాజా పిటిషన్లను దాఖలు చేస్తూనే ఉన్నారని ఆరోపించారు. ప్రస్తుత పిటిషన్లతో పాటు ఇప్పటికే దాఖలు చేసిన పిటిషన్లను పరిష్కరించడం మాకు అసాధ్యం అవుతోంది' అని సిజెఐ అన్నారు. సీనియర్ అడ్వకేట్ దుష్యంత్ దవే ధర్మాసనం అభిప్రాయంతో ఏకీభవించారు. ఈ అంశంపై కొత్త అభ్యర్థనలను స్వీకరించవద్దని ధర్మాసనానికి విన్నవించారు.ఒక పాత పిటిషనర్ తరపున మరో న్యాయవాది వికాస్‌సింగ్ తన వాదనలను వినిపించారు. అంతకు ముందు రోజు కూడా అనేక తాజా పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి అసంతృప్తిని వ్యక్తం చేశారు. 'న్యాయవాది ఇందిరా జైసింగ్ ఒక వ్యాజ్యం తరపున హాజరై ఒక రోజులో తాజా పిటిషన్‌పై విచారణ జరపాలని ప్రస్తావించగా మేం దానిని స్వీకరించలేకపోవచ్చు' అని సిజెఐ అన్నారు. వారణాసిలోని జ్ఞాన్‌వాపీ,మధురలోని షాహీ ఈద్‌గా మసీ, సంభాల్‌లో జరిగిన ఘర్షణలో నలుగురు వ్యక్తులు మరణించిన 10మసీదులతో సహా 10 మసీదుల అసలు మతపరమైన స్వభావాన్ని నిర్ధారించడానికి సర్వే కోరుతూ వివిధ హిందూ పార్టీలు దాఖలు చేసిన సుమారు 18వ్యాజ్యాలపై సుప్రీంకోర్ట్ 2024 డిసెంబరు 12నాటి ఉత్తర్వు ద్వారా అత్యున్నత న్యాయస్థానం విచారణను నిలిపివేసింది.ఫిబ్రవరి 17న ప్రభావవంతమైన విచారణ కోసం అన్ని పిటిషన్లను లిస్టింగ్ చేసింది. డిసెంబరు 12 తర్వాత 1991చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని కోరుతూ ఆల్ ఇండియా మజ్లిస్ ఇత్తెహాద్ ఉల్‌ముస్లిమీన్ (ఎఐఎంఐఎం) అధినేత అసదుద్దీన్ ఒవైసీ, సమాజ్‌వాదీ పార్టీ నాయకుడు కైరానా ఎంపి ఇక్రా చౌదరి, కాంగ్రెస్ పార్టీ అనేక పిటిషన్లు దాఖలు చేశాయి.

# 20న ఢిల్లీ సిఎం ప్రమాణం!

19న లెజిస్లేచర్ పార్టీ సమావేశంలో నిర్ణయం



**న్యూఢిల్లీ :** ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలలో తిరుగులేని ఆధిక్యం సాధించిన బిజెపి తమ నాయకుడిని ఈ వారంలో ఎన్నుకోనున్నది. పార్టీ వర్గాలలో చర్చకు తెరదించుతూ ఈ వారంలో పంత్ మార్గ్‌లోని పార్టీ ఢిల్లీ విభాగం కార్యాలయంలో సమావేశం నిర్వహించనున్నట్టు బిజెపి సీనియర్ నాయకుడు ఒకరు తెలిపారు. వాస్తవంగా సోమవారం ఈ సమావేశం నిర్వహించాలని అనుకున్నా తరువాత వాయిదా వేశారు. సమావేశానికి ముందుగా పార్టీలోని సినీయర్ నాయకులను పరిశీలకులుగా నియమించనున్నారు. వారు పార్టీ ఎమ్మెల్యేల అభిప్రాయాలను సేకరించి కేంద్ర నాయకత్వానికి తెలియజేయనున్నారు. ఆపై సిఎం అభ్యర్థి ఎవరన్నది నిర్ణయిస్తారు. సిఎం అభ్యర్థి 20వ తేదీన రామ్‌లీలా మైదానంలో ప్రమాణ స్వీకారం చేస్తారని పార్టీ వర్గాలు వెల్లడించాయి. 'సోమవారం జరగాల్సిన బిజెపి లెజిస్లేచర్ పార్టీ సమావేశాన్ని 19వ తేదీకి వాయిదా వేశారు. 18న జరగాల్సిన సిఎం ప్రమాణ స్వీకారం ఇపుడు 20వ తేదీన జరుగుతుంది' అని బిజెపి వర్గాలు తెలిపాయి. ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ, పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఎన్డీఏ నాయకులు, కేంద్ర మంత్రులు, పారిశ్రామిక వేత్తలు, సినీ నటులు, క్రికెటర్లు, సాధువులు, బుషులు పాల్గొననున్నారు.
రెండున్నర దశాబ్దాల తరువాత బిజెపి ఢిల్లీలో అధికారాన్ని చేపట్టనున్నది. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికలలో 70 సీట్లకు 48 సీట్లు గెలుచుకుని తిరుగులేని ఆధిక్యం సాధించింది. పదేళ్ల ఆప్‌పాలనకు చరమగీతం పాడింది. కాగా సిఎం అభ్యర్థిగా పలువురి పేర్లు వినిపిస్తున్నా ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌పై అసెంబ్లీ ఎన్నికలలో విజయం సాధించిన పర్వేశ్ వర్మ పేరు ప్రముఖంగా వినిపిస్తున్నది. ఢిల్లీ బిజెపి అధ్యక్షుడిగా పనిచేసి ప్రస్తుతం ఢిల్లీ యూత్ విభాగం అధ్యక్షుడిగా ఉన్న సతీష్ ఉపాధ్యాయకూడా సిఎం రేస్‌లో ఉన్నారు. ఆశిష్ సూద్, జితేంద్ర మహాజన్, విజేందర్ గుప్త పేర్లు కూడా పరిశీలనలో ఉన్నాయి. ఒకవేళ పార్టీ మహిళా సిఎంను ఎంపిక చేయదలచుకుంటే ఢిల్లీ మాజీ మేయర్, తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచిన రేఖ గుప్త పేరు ముందు వరసలో ఉంది.

## 'భోపాల్' వ్యర్థాల తరలింపుపై 'సుప్రీం' పరిశీలన

**న్యూఢిల్లీ :** భోపాల్ గ్యాస్ దుర్ఘటనతో ఏర్పడిన వ్యర్థాలను తరలించడంపై దాఖలైన ఫిర్యాదును సుప్రీంకోర్టు పరిశీలనకు తీసుకుంది. దీనిపై తమ స్పందన తెలియజేయాల్సిందిగా కేంద్రం, మధ్యప్రదేశ్ ప్రభుత్వాలను, పొల్యూషన్ కంట్రోల్ బోర్డును కోరింది. యూనియన్ కార్బైడ్ గ్యాస్ లీక్ దుర్ఘటనలో 5,479మంది అసువులు బాసిన సంగతి తెలిసిందే. కాగా యూనియన్ కార్బైడ్ సంస్థకు చెందిన ప్రమాదకరమైన 377 టన్నుల వ్యర్థాలను ఇటీవల ధార్ జిల్లాలోని పితంపూర్‌కు తరలించారు. ఇది భోపాల్‌కు 250, ఇండోర్‌కు 30 కిలోమీటర్ల దూరంలో ఉంది. సమీప ప్రజల ఆరోగ్యంపై దీని ప్రభావం పడుతుందన్న ఒక అభ్యర్థనను సుప్రీంకోర్టు పరిశీలనకు స్వీకరించింది. 1984 డిసెంబర్ 2న అర్ధరాత్రి యూనియన్ కార్బైడ్ ఫ్యాక్టరీ నుంచి మిథైల్ ఐసోనేట్ అనే విషవాయువు లీకవడంతో 5,479మంది ప్రాణాలు కోల్పోగా, అయిదు లక్షలమందికిపైగా అంగవైకల్యం చెందారు. ప్రపంచ పారిశ్రామిక దుర్ఘటనలలో ఇదీ ఒకటిగా చరిత్రలో మిగిలిపోయింది. గత డిసెంబర్ 3, ఈ యేడాది జనవరి 6న మధ్యప్రదేశ్ హైకోర్టు ఆదేశాలను పరిశీలించాలని దాఖలైన పిటిషన్‌ను జస్టిస్ బి.ఆర్. గవాయ్, జస్టిస్ అగస్టిన్ జార్జి మాషిహ్‌లతో కూడిన ధర్మాసనం విచారణకు స్వీకరించింది. గత యేడాది మధ్యప్రదేశ్ హైకోర్టు తమ ఆదేశాలలో యూనియన్ కార్బైడ్ పారిశ్రామిక వ్యర్థాలను తొలగించేందుకు మధ్యప్రదేశ్ ప్రభుత్వానికి నాలుగు వారాల గడువునిస్తూ ఆదేశాలు జారీ చేసింది. అయినా ప్రభుత్వం నిష్క్రియాపరంగా ఉండడంతో కోర్టు ధిక్కరణ హెచ్చరికలు జారీచేసింది. దీనితో జనవరి 1న ప్రభుత్వం నాలుగు సీల్‌చేసిన కంటైనర్లలో వ్యర్థాలను పితంపూర్‌కు తరలించింది. ముందుగా కొంత వ్యర్థాన్ని కాల్చి బూడిదలో ఎటువంటి విషపదార్థాలు లేవని నిర్ధారించినట్టు భోపాల్ గ్రాస్ దుర్ఘటన ఉపశమన, పునరావాస విభాగం డైరెక్టర్ స్వతంత్ర కుమార్ సింగ్ వెల్లడించారు. వ్యర్థాలను కాల్చినపుడు వచ్చిన పొగను నాలుగు పొరల ఫిల్టర్ల ద్వారా గాలిలోకి విడుదల చేశామని, అది ప్రమాదకరం కాదని తెలిపారు. అయితే చిన్మయ్ మిశ్రా అనే వ్యక్తి వ్యర్థాల తరలింపుపై పిటిషన్ దాఖలు చేశారు.
పరిశీలనకు స్వీకరించిన సుప్రీంకోర్టు దీనిపై స్పందించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డుకు నోటీసులు జారీచేసింది. పితంపూర్‌కు కిలోమీటర్ దూరంలోనే అయిదు గ్రామాలు ఉన్నట్టు పిటిషనర్ తెలిపారు. యశ్వంత్ సాగర్ డ్యామ్‌కు మంచినీటిని అందించే గంభీర్ నది కూడా పితంపూర్‌కు సమీపంలో ప్రవహిస్తుందని, ఆ నీరు కలుషితమయ్యే ప్రమాదం ఉందని పిటిషనర్ పేర్కొన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం స్వచ్ఛమైన నీరు, గాలిని పొందే హక్కును ఇది హరిస్తోందని పిటిషనర్ పేర్కొన్నారు. వ్యర్థాలవల్ల కలిగే నష్టాలపై అధికారులు సమీప ప్రజలను అప్రమత్తం చేయలేదని పిటిషన్‌లో పేర్కొన్నారు.

# చైనాను శత్రువులా చూడొద్దు

కాంగ్రెస్ నేత శామ్ పిట్రోడా



**న్యూఢిల్లీ :** కాంగ్రెస్ నేత శామ్ పిట్రోడా మరోసారి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. పార్టీ వైఖరికి భిన్నమైన వాదనలు వినిపించారు. భారతదేశం చైనాను శత్రువులా చూడొద్దని శామ్ పిట్రోడా అన్నారు. చైనా నుంచి వచ్చే ముప్పు ఊహించని విధంగా ఉంటుందని పేర్కొన్నారు. ఆ దేశాన్ని గుర్తించి, గౌరవించాల్సిన సమయం ఆసన్నమైందని.. ఇకనైనా భారత్ తన వైఖరి మార్చుకుని చైనాను శత్రువులా చూడటం మానుకోవాలని సూచించారు. తొలినుంచి చైనాతో భారత్ అనుసరిస్తున్న ఘర్షణాత్మక వైఖరి ఇరుదేశాల మధ్య శత్రుత్వాన్ని పెంచుతోందని శామ్ పిట్రోడా ఓ ఇంటర్వ్యూలో వ్యాఖ్యానించారు. చైనా పట్ల మన దేశ వైఖరి మొదటిరోజు నుంచి ఘర్షణాత్మకంగానే ఉంది. మనం అవలంబిస్తున్న ఆ విధానం దేశానికి కొత్త శత్రువులను సృష్టిస్తోంది. భారత్‌కు సరైన మద్దతు దక్కట్లేదు. ఇప్పటికైనా భారత్ తన వైఖరిని మార్చుకోవాలి. ఇది కేవలం చైనా విషయంలోనే కాదు. ఇతర దేశాలకు కూడా వర్తిస్తుంది. అయినా చైనా నుంచి ఏమి ముప్పుందో నాకు అర్థం కావట్లేదు. అమెరికా చైనాను తరచూ శత్రువుగా పేర్కొంటూ.. భారత్‌కు కూడా అదే అలవాటు చేస్తోంది. అభివృద్ధిలో వెనకబడి ఉన్న దేశాలు వేగంగా అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉంది. పేద దేశాలు మరింత వేగంగా అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉంది. మరోవైపు అభివృద్ధి చెందిన దేశాల్లో వృద్ధి రేటు నెమ్మదిస్తోంది. ఇలాంటి దేశాల్లో వృద్ధాప్య జనాభా ఎక్కువగా ఉంటోంది. ఇక, అభివృద్ధి చెందుతున్న దేశాల్లో యువతరం ఎక్కువగా ఉంటున్నారు. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకొని మనం ప్రవర్తించాలి అని పిట్రోడా అన్నారు. ఇందులో భాగంగా ప్రపంచ దేశాలు కమ్యూనికేషన్‌ను పెంచుకుంటూ.. అవసరమైన సమయంలో సహకరించుకోవాలని అన్నారు. ప్రధాని మోదీ ఇటీవల అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో సమావేశమైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో భారత్ చైనా మధ్య వాస్తవాధీన రేఖ వద్ద జరుగుతున్న ఘర్షణల నివారణకు సాయం చేస్తానంటూ ట్రంప్ ఆఫర్ ఇచ్చారు. కాగా దీనిపై భారత విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిశ్రి స్పందిస్తూ.. సున్నితంగా తిరస్కరించారు. పొరుగు దేశాలతో ఉన్న సమస్యలపై భారత్ ఎప్పుడూ ద్వైపాక్షిక చర్చలనే మార్గంగా ఎంచుకొంటుందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో శామ్ పిట్రోడా వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

**మండిపడ్డ బిజెపి**

శామ్ పిట్రోడా వ్యాఖ్యలపై బిజెపి మండిపడింది. చైనా పట్ల కాంగ్రెస్ అతిమోహానికి 2008లో చైనా కమ్యూనిస్టు పార్టీతో కుదుర్చుకున్న అవగాహనే కారణమని విమర్శించింది. 40,000 చదరపు కిలోమీటర్ల భారత భూభాగాన్ని చైనాకు ధారాదత్తం చేసిన కాంగ్రెస్ పార్టీ ఇప్పటికీ డ్రాగెన్ నుంచి ముప్పును గుర్తించడం లేదని బిజెపి జాతీయ ప్రతినిధి తుహిన్ సిన్హా అన్నారు. మరో నేత అజయ్ అలోక్ సైతం ఇదే తరహా అభిప్రాయం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ సలహాదారు శామ్ పిట్రోడా అని, చైనా పీపుల్స్ లిబరేషన్ పార్టీతో రాహుల్ గాంధీ రహస్య ఒప్పందం చేసుకున్నారని ఆయన ఆరోపించారు. అక్సాయ్ చిన్ ప్రాంతాన్ని, యూఎన్‌ఎస్‌సీలో భారత్ సభ్యత్వాన్ని చైనాకు జవహర్‌లాల్ నెహ్రూ కట్టబెట్టారని, కాంగ్రెస్‌కు, చైనాకు మధ్య మైత్రీబంధం చాలా పాతదని చురకలు వేశారు.

**అది పార్టీ అభిప్రాయం కాదు : కాంగ్రెస్ వివరణ**

శామ్ పిట్రోడా చేసిన వ్యాఖ్యలపై తాజాగా కాంగ్రెస్ స్పందించింది. చైనా విషయంలో పిట్రోడా వ్యక్తం చేసింది పార్టీ అభిప్రాయం కాదు. ఆయన మాటలు కాంగ్రెస్ వైఖరిని ప్రతిబింబించడం లేదు. విదేశాంగ విధానం, భద్రత, ఆర్థికపరంగా చైనా ఇప్పటికీ సవాలుగా ఉంది అని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ వివరణ ఇచ్చుకున్నారు.

## మీపై ఎందుకు ధిక్కారచర్యలు తీసుకోకూడదు?

ఉత్తర్‌ప్రదేశ్ ఖుషీనగర్ మసీదులో నిర్మాణాలను కూల్చివేసిన అధికారులపై 'సుప్రీం' సీరియస్

**న్యూఢిల్లీ :** అత్యున్నత న్యాయస్థానం ఆదేశాలను ఉల్లంఘించి ఖుషీనగర్ మసీదులోని కొంత భాగాన్ని ధ్వంసం చేసినందుకు మీపై ఎందుకు ధిక్కార చర్యలు చేపట్టరాదో సమాధానం చెప్పాలని సుప్రీంకోర్టు సోమవారం ఉత్తరప్రదేశ్ అధికారులను ఆదేశించింది. తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకూ నిర్మాణాన్ని కూల్చివేయడాన్ని కూల్చివేయరాదని సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బిఆర్.గవాయి, జస్టిస్ ఆగస్టిన్ జార్జి మాసిహ్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం మార్గనిర్దేశం చేశారు. గత ఏడాది (2024)నవంబరు 13న అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాలపై ఉద్దేశపూర్వకంగా అవిధేయత చూపించారని ఆరోపిస్తూ ఖుషీనగర్‌లోని సంబంధిత అధికారులకు వ్యతిరేకంగా దాఖలైన ధిక్కార పిటిషన్ విచారణ సందర్భంగా ధర్మాసనం ఈ ఆదేశాలు జారీ చేసింది. 2024 నవంబరు 13నాటి తీర్పులో అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు భారతదేశంలోని ఆస్తుల కూల్చివేతలపై నిషేధం విధించి మార్గదర్శకాలను నిర్దేశించింది. బాధిత పార్టీకి షోకాజ్ నోటీస్‌పై స్పందించేందుకు 15రోజుల గడువు ఇచ్చింది. న్యాయవాది అబ్దుల్ సి.సహాయం దాఖలు చేసిన తాజా పిటిషలో..అధికారులు ఫిబ్రవరి 9న ఖుషీనగర్‌లో మద్నీ మసీదు ప్రాంతం ముందు భాగం, బయటి భాగాన్ని కూల్చివేసినట్లు ధర్మాసనానికి తెలిపారు.పిటిషన్‌దారుల తరపున హాజరైన సీనియర్ న్యాయవాది హుజెఫా అహ్మదీ తన వాదన వినిపిస్తూ సందేహాత్మక నిర్మాణం పిటిషనర్ల ప్రైవేట్ భూమిలో నిర్మించబడిందని ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. 1999నాటి మంజూరు ఆర్డర్‌కు అనుగుణంగా మున్సిపల్ అధికారుల అనుమతితో నిర్మాణం జరిగిందని ఆయన చెప్పారు. హుజెఫా అహ్మదీ వాదిస్తూ గత ఏడాది నవంబరులో అత్యున్నత న్యాయస్థానం జారీ చేసిన ఆదేశాలను ఉద్దేశపూర్వకంగానే విపరీతమైన ధిక్కారానికి పాల్పడటం జరిగిందని ధర్మాసనానికి విన్నవించారు. స్పందించిన ధర్మాసనం ప్రతివాదులపై ఎందుకు ధిక్కార చర్యలు జారీ చేయకూడదో తెలియజేయాలంటూ నోటీస్ జారీ చేసింది. తదుపరి విచారణను రెండువారాల తర్వాతకు వాయిదా వేసింది. తదుపరి ఆదేశాలు వచ్చేంతవరకూ ఎలాంటి కూల్చివేతలు చేయకూడదని సుప్రీంకోర్టు అధికారులను ఆదేశించింది.

## ఒకే ఇంట్లో నలుగురు ఆత్మహత్య

**బెంగళూరు:** ఒకే కుటుంబంలో నలుగురు ఆత్మహత్య చేసుకున్న సంఘటన కర్నాటకలోని మైసూరులో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చేతన్ (45)రూపాలి(43) అనే దంపతులు మైసూరులోని విశ్వేశ్వరయ్యనగర్‌లో నివసిస్తున్నారు. చేతన తన కుమారుడు, తల్లి ప్రియంవద, రూపాలితో కలిసి ఉంటున్నాడు. చేతన్ వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. చేతన్ తన తల్లి, భార్య, కుమారుడికి విషం ఇచ్చిన అనంతరం అతడు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్య చేసుకునే ముందు అమెరికాలో ఉన్న బంధువులకు ఫోన్ చేసి అప్పుల బాధలు భరించలేకపోతున్నామని, కుటుంబ సభ్యులందరూ ఆత్మహత్య చేసుకుంటున్నామని చెప్పాడు. అనంతరం అతడు ఆత్మహత్య చేసుకున్నాడు. అమెరికా నుంచి బంధువుల ఫోన్ చేసిన లిఫ్ట్ చేయకపోవడంతో స్థానికంగా బంధువులకు సమాచారం ఇచ్చాడు. వాళ్లు చేతన్ ఇంటికి వెళ్లేసరికి అతడు ఉరేసుకొని కనిపించగా మిగిలిన విగతజీవులుగా కనిపించారు. బంధువుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.





## పారిశుద్ధ్యంతో పాటు తాగునీరు, విద్యుత్ సమస్య ఉండొద్దు : కలెక్టర్

**ప్రజాపక్షం/చివ్వెంల:** శ్రీ లింగమంతులస్వామి(పెద్దగట్టు) జాతరకు వచ్చే భక్తులకు అన్ని సదుపాయాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. సోమవారం కలెక్టర్ కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ పోలేబోయిన నర్సయ్య యాదవ్, యాదవ పూజారులు మర్యాదపూర్వకంగా స్వాకతం పలికి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు నిబద్దతతో మొక్కులు చెల్లించే భక్తులకు, జాతరకు వచ్చే ప్రజలకు ఏలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. గుట్ట పైన, క్రింది పరిసర ప్రాంతాల్లో ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, భక్తులకు తాగునీరు, విద్యుత్ సమస్య లేకుండా చూసుకోవాలని సూచించారు. జాతరలో అధికారులు అందరు సమన్వయంతో తమకు కేటాయించిన సెక్టార్‌లలో పర్యవేక్షణ చేపట్టాలన్నారు. ఆయన వెంట ఆర్‌డిఓ వేణుమాధవరావు, తహసీల్దార్‌లు శ్యాంసుందర్ రెడ్డి, కృష్ణయ్య, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, ప్రత్యేక అధికారులు, దేవాలయ సిబ్బంది ఉన్నారు.

**జాతరలో నిరంతరం నిఘా ఉంచాలి**



శ్రీ లింగమంతులస్వామి(పెద్దగట్టు) జాతర ప్రశాంత వాతావరణంలో సాగేలా పోలీస్ శాఖ నిరంతరం నిఘా ఉంచాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. సోమవారం జాతర రెండవరోజు నేపద్యంలో పోలీస్ కంట్రోల్ రూంలో సిసి కెమెరా విజువల్స్‌ను పరిశీలించారు. ఈ సం దర్భంగా ఆయన మాట్లాడుతూ జాతరలో ఏలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీస్‌లు గస్తీ నిర్వహించాలని సూచించారు. విద్యుత్, మున్సిపల్, మిషన్ భగీరథ అధికారులకు పలు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో డిఎస్‌పి రవి, ఆర్‌డిఓ వేణుమాధవరావు, ఆలయ ఈఓ కుశలయ్య, తహసీల్దార్‌లు పాల్గొన్నారు.

## కాంగ్రెస్, బిఆర్‌ఎస్‌కు ఓట్లు అడిగే అర్హత లేదు

ఎంపి ఈటల రాజేందర్



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు ఓట్లు అడిగే కనీస అర్హత లేదని, ప్రజా సమస్యల పరిష్కారంలో ఈ రెండు పార్టీలు పూర్తిగా విఫలమయ్యాయయని, ప్రస్తుతం ప్రధాని మోడితోనే సుపరిపాలన సాధ్యమవుతుందని ప్రజలు బలంగా విశ్వసిస్తున్నారని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. సోమవారం వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా మిర్యాలగూడలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నిరుద్యోగ సమస్యలను పరిష్కరించకుండా యువతను దేశాభివృద్ధిలో భాగం చేయకుండా ముందుకు పోలేమని మోడి భావించి ప్రభుత్వ పాఠశాలలతోపాటు ప్రైవేట్ పాఠశాలల్లో కూడా ల్యాబ్స్ ఏర్పాటుకు నిధులు అందించడంతోపాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు క్పించే కంపెనీలకు కేంద్రం రాయితీలు అందిస్తుందన్నారు. 317 జీవో వల్ల ఉపాధ్యాయులు ఆత్మహత్యలు చేసుకున్నా కేసీఆర్ పట్టించుకోలేదన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి, ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జి పాపారావు, సునీతరెడ్డి, సాధినేని శ్రీనివాస్‌రావు, రేపాల పురుషోత్తంరెడ్డి, బంటు సైదులు, ఎడ్ల రమేష్, బంటు గిరి, హనుమంతరెడ్డి, అశోక్‌రెడ్డి, సీతారాంరెడ్డి, చిలుకూరి శ్యామ్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన మండలాలు ఏర్పాటు చేయాలి

**ప్రజాపక్షం/జోగులాంబ గద్వాల ప్రతినిధి :** జిల్లాలో జనాభానుగుణంగా నూతన మండలాలు ఏర్పాటు చేయాలని జిల్లా అఖిలపక్షం నాయకులు డిమాండ్ చేశారు.సోమవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ముందు ఈ మేరకు నిరసన చేపట్టి,జిల్లా కలెక్టర్ సంతోష్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి బి.ఆంజనేయులు మాట్లాడుతూ గద్వాల నియోజకవర్గంలోని ప్రతి మండలంలో యాబై వేలకు పైగా జనాభా ఉన్నందున పరిపాలన సౌలభ్యత కోసం నూతనంగా ఐదు మండలాలు ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు.ముఖ్యంగా పూడూరు, ఉప్పేరు,మాచర్ల,ఎల్కూరు,బల్గెర,నందిన్నె గ్రామాలను మండలాల ఏర్పాటు వల్ల చుట్టు ప్రక్కల గ్రామాల ప్రజలకు రవాణా,పరిపాలనకు సౌలభ్యంగా ఉంటుందన్నారు.నిరసనలో నాగర్‌దొడ్డి వెంకట్రాములు,లచ్చన్న గౌడ్, రాములు, రఘు,ఆటో మగ్బూల్ ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాలి

**ప్రజాపక్షం/ జోగులాంబ గద్వాల ప్రతినిధి :** జిల్లాలో విద్యార్థులకు సంబంధించిన పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్,ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే ప్రభుత్వం చెల్లించాలని బీసి సంఘం జిల్లా అధ్యక్షుడు సూర్యప్రకాష్ అన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేల్ సముదాయం ముందు ధర్నా చేపట్టి,కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.విద్యార్థులకు సంబందించిన దాదాపు ఆరు వేల కోట్లను విడుదల చేయాలన్నారు.స్వంత హాస్టల్ భవనాలను ఏర్పాటు చేయాలని,సమస్యలు పరిష్కారం కాకుంటే ఎమ్మెల్యే కార్యాలయాలను ముట్టడిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రాష్ట్ర కార్యదర్శి అరవందస్వామి, బీసీ సంఘం వనపర్తి జిల్లా అధ్యక్షుడు కురుమూర్తి, చిట్యాల రాము, ధర్మతేజ, వీరేష్, హరిప్రసాద్, వీరశేఖర్, సాయిదీప్, గణేష్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## సర్వే నెంబర్ మిస్సింగ్ ...

50మందికి 'రైతుభరోసా' కట్




**ప్రజాపక్షం/గట్టుప్పల /చండూరు:** రెవిన్యూ అధికారుల నిర్లక్ష్యం సర్వే నెంబర్ మిస్సింగ్‌తో ఏకంగా 50మంది రైతులకు రైతు భరోసా రాకుండా పోయిన సంఘటన గట్టుప్పల మండలంలో జరిగింది. గట్టుప్పల మండలం అంతంపేట రెవిన్యూ గ్రామంలోని సోమరాజు తండ లోని సర్వే నెంబర్ 280లో రెవిన్యూ అధికారులు చేసిన పొరపాటుతో ఏకంగా ఆ సర్వే నెంబర్‌లోని 50 మంది రైతులు రైతు భరోసాను కోల్పోయారు. సోమవారం సోమరాజు తండా రైతులు గట్టుప్పల తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ సురేష్ కుమార్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. గత 50 సంవత్సరాలు గా భూములును సాగు చేసుకుంటున్న మాకు సర్వే నెంబర్ మిస్సింగ్ వలన 50మంది రైతులము రైతు భరోసా కోల్పోవలసి వచ్చిందని ఆవేధన వ్యక్తం చేశారు. ఇట్టి సర్వే నెంబర్‌పై పూర్తి స్థాయిలో సమగ్ర విచారణ జరిపి 50మంది రైతులకు న్యాయం చేయాలని వినతి పత్రంలో తెలిపారు. ఈకార్యక్రమంలో రైతు సంఘం నాయకులు రాచమల్ల వెంకట్‌రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం మండల ప్రధాన కార్యదర్శి కర్నాటి సుధాకర్ , తల్సూరు సైదులు , శ్రీను నాయక్, జాను నాయక్, లక్ష్మన్ నాయక్, రాజేష్ నాయక్ శుక్రు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మిక వారసత్వానికి పెద్దగట్టు జాతర పెట్టింది పేరు

జాతరలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత

మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి





**ప్రజాపక్షం/సూర్యాపేట ప్రతినిధి:** ఆధ్యాత్మిక వారసత్వానికి పెద్దగట్టు జాతర పెట్టింది పేరని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. సోమవారం శ్రీ లింగమంతులస్వామి(పెద్దగట్టు)ని దర్శించుకోని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో రాష్ట్ర పర్యాటక కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, ఆలట కమిటీ చైర్మన్ పోలేబోయిన నర్సయ్య యాదవ్, ఎఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తంరెడ్డి, రాష్ట్ర నాయకులు కొప్పుల వేణారెడ్డిలు ఘన స్వాగతం పలికారు. అనంతరం భక్తులతో కలిసి భేరీ మోహించి కొద్దిసేపు ఉత్సహంగా గడిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో సమ్మక్క సారక్క జాతర తరువాత దురాజ్‌పల్లి జాతర అంతటి ప్రాశస్త్యం కలిగి ఉందన్నారు. చారిత్రాత్మక సంప్రదాయాల పరిరక్షణకు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. 16వ సతాబ్దంలో మొదలైన జాతర పురాతన సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబింప చేస్తుందన్నారు. అటువంటి ఆధ్యాత్మీకత ఉట్టిపడేలా జరిగే రెండేళ్ళకు ఒక మారు జరుగుతున్న జాతరకు వచ్చే భక్తులకు మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. జాతర కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రూ. 5కోట్లు కేటాయించారని గుర్తు చేశారు. తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్ణాటక, ఒరిస్సా, చత్తీస్‌ఘడ్ మహా రాష్ట్ర నుండి వచ్చే లక్షలాది భక్తుల రద్దీకి తగ్గట్టుగా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని హైద్రాబాద్‌విజయవాడ రోడ్డుపై వాహనాలను దారి మళ్లించినట్లు తెలిపారు. జాతరలో ఆరోగ్యపరంగా అత్యవసర చికిత్స నిమిత్తం ప్రత్యేక వైద్య బృందాలు, శిబిరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తాగునీరు, విద్యుత్ సౌకర్యాలతో పాటు పారిశుధ్యం, తాత్కాలిక మరుగుదొడ్ల శుబ్రత కోసం ప్రత్యేక కార్మికులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జాతరకు వచ్చే భక్తులు, ప్రజలు స్వామివారిని దర్శించుకోని సంతోషంగా తిరిగి తమ ఇండ్లకు చేరుకోవాలన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు, దేవాదాయ శాఖ అధికారులు ఉన్నారు.

### లింగన్న దర్శనానికి బారులు తీరిన ప్రముఖులు

**ప్రజాపక్షం/సూర్యాపేట:** శ్రీ లింగమంతుల స్వామి (పెద్దగట్టు) జాతర సందర్భంగా సోమవారం లింగన్న దర్శనానికి ప్రముఖులు భారీగా బారులు తీరారు. గట్టుపై ఉన్న శ్రీ లింగమంతులస్వామి, చౌడమ్మ తల్లిని దర్శించుకొని మొక్కులు చెల్లించారు. వీరిలో రాష్ట్ర నీటి పారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి, నల్లగొండ పార్లమెంట్ సభ్యులు కుందూరు రఘువీర్ రెడ్డి, మిర్యాలగూడ శాసన సభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి, మల్కాజ్‌గిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్, ఎంఎల్‌సి తీన్మార్ మల్లన్న, రాష్ట్ర పర్యాటక శాఖ కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, మాజీ శాసన సభ్యులు వేదాసు వెంకయ్య, భారత చైతన్య యువజన పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు రామచంద్ర యాదవ్, పెద్దగట్టు దేవస్థాన ట్రస్టుబోర్డు మాజీ చైర్మన్లు మద్ది శ్రీనివాస్ యాదవ్, కోడి సైదులు యాదవ్, జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, ఎస్‌పి సన్ ప్రీత్ సింగ్, అదనపు కలెక్టర్ పి రాంబాబు, అదనపు ఎస్‌పిలు నాగేశ్వర్ రావు, జనార్ధన్ రెడ్డిలు ఉన్నారు.

ఘనంగా సత్కరించిన ఆలయ అధికారులు, పాలకవర్గం స్వామివారిని దర్శించుకునేందుకు వచ్చిన ప్రముఖులకు ఆలయ ఈఓ కుశలయ్య, ట్రస్టు బోర్డు చైర్మన్ పోలేబోయిన నర్సయ్య యాదవ్‌లు స్వామివారి చిత్రపటాలను అందజేసి శాలువాలు కప్పి పూలమాలలు వేసి సత్కరించారు. జాతరకు వచ్చిన ఈ ప్రముఖులు భక్తజనాన్ని ఉత్సహపరిచేందుకు బేరీలు చేతపూని వీరడోలు మోహించారు.





## వైభవంగా మహా కుంభాభిషేక సంప్రోక్షణ మహోత్సవం

ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ శ్రీధర్ అధికారులకు ఆదేశం



**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట:** ఈ నెల 19 నుండి 23 వరకు యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి బంగారు విమాన గోపుర మహా కుంభాభిషేక సంప్రోక్షణ మహోత్సవములను అత్యంత వైభవంగా నిర్వహించాలని, పటిష్టమైన ఏర్పాట్లు చేపడుతూ పర్యవేక్షణ చేపట్టాలని దేవాదాయ శాఖ కమిషనర్ శ్రీధర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం యాదగిరిగుట్ట దేవస్థాన కార్యాలయంలో దేవాదాయ శాఖ కమిషనర్ శ్రీధర్, జిల్లా కలెక్టర్ హనుమంత రావు, అడిషనల్ కలెక్టర్ వీరారెడ్డి, ఆలయ ఈఓ భాస్కరరావు ఆధ్వర్యంలో సంబంధిత అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాదాయ శాఖ కమీషనర్ మాట్లాడుతూ ఫిబ్రవరి 19 నుంచి 23 వరకు నిర్వహించే స్వామివారి బంగారు విమాన గోపుర మహా కుంభాభిషేక సంప్రోక్షణ మహోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించేందుకు సంబంధిత అధికారులు కేటాయించిన పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. విఐపిలను దృష్టిలో పెట్టుకొని ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రతి రోజు వివిధ ప్రాంతాల నుండి దేవాలయానికి ఎక్కువ మంది భక్తులు వస్తారని దృష్టిలో పెట్టుకొని ఏర్పాట్లను చేయాలని అధికారులకు ఆదేశించారు. భద్రత ఏర్పాట్లు, భక్తులకు అవసరమైన సౌకర్యాలను పర్యవేక్షిస్తూ, ప్రోటోకాల్ ప్రకారంగా అన్ని ఏర్పాట్లు ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా చూసుకోవాలని, ఆలయం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి, క్యూలైన్లను సక్రమంగా నిర్వహించాలని అన్నారు. ఆలయ పరిసరాల పరిశుభ్రత, శానిటేషన్, తాగునీటి సదుపాయాలు, మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలన్నారు.పోలీస్ బందోబస్తు ఏర్పాటుచేసి నిరంతరం పర్యవేక్షణ జరపాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా తగిన బందోబస్తు ఏర్పాటు, ట్రాఫిక్ నిర్వహణ, భద్రతా, పార్కింగ్ ఏర్పాట్లు చేయాలని పోలీసు శాఖకు సూచించారు. ఎమర్జెన్సీ సేవలను అందుబాటులో ఉంచాలని, మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేసి అత్యవసర మందులు అందుబాటులో ఉంచాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు ఆదేశించారు. సూదుర ప్రాంతా ల నుండి వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆర్టీసీ వారు అదనపు బస్సులు నడపడంతో పాటు,రోడ్లపై పార్కింగ్ చేయకుండా చూడాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పిసిఈ ఓ శోభారాణి, భువనగిరి, చౌటుప్పల్ ఆర్డీఓలు కృష్ణారెడ్డి, శేఖర్ రెడ్డి, ఏసిపి రమేష్, మండల తహసీల్దార్‌లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి

నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



**ప్రజాపక్షం/నల్లగొండ :** ప్రజావాణి ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి జిల్లా అధికారులతో కోరారు.ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ప్రజల వద్ద నుండి ఫిర్యాదులను స్వీకరించారు.ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రవర్తన నియమావళి సందర్భంగా గత రెండు వారాలుగా నిలిపివేసిన ప్రజావాణి కార్యక్రమం ఈ సోమవారం ప్రారంభం కాగా 25 మంది ఫిర్యాదుదారులు వారి ఫిర్యాదులను జిల్లా కలెక్టర్ కు సమర్పించారు.కాగా జిల్లా కలెక్టర్ అనంతరం జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్ష సందర్భంగా వివిధ పథకాల కింద చేపట్టిన పనుల పురోగతిపై సమీక్షించారు. ముఖ్యంగా అమ్మ ఆదర్శ పాఠశాల కింద పనుల మంజూరి, పనుల గ్రౌండింగ్, పురోగతి, తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. అవసరం లేని చోట పనులు మంజూరైనస్తీతే వెంటనే వాటిని రద్దు చేయాలని, పనులు మొదలు పెట్టన చోట మొదలు పెట్టాలని, పనులలో పురోగతి రావాలని ఆమె సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో స్వీకరించిన దరఖాస్తులన్నింటిని ప్రత్యేకంగా పరిష్కరించాలని, జాప్యం చేయవద్దని అన్నారు. అలాగే ప్రజావాణి ఫిర్యాదులకు ప్రాధాన్యతను ఇవ్వాలని అన్నారు.ఎప్పటిలాగే ఈ సోమవారం వ్యక్తిగత సమస్యలు, భూములకు సంబంధించిన విషయాలపై ఎక్కువ ఫిర్యాదులు వచ్చాయి. అదనపు కలెక్టర్ జే. శ్రీనివాస్, డిఆర్డిఓ శేఖర్ రెడ్డి, తదితరులున్నారు.

## జన జాతరలో ఏరులై పారిన మద్యం

విచ్చలవిడిగా అమ్మకాలు

తాగి ఊగిన భక్తజనం

గత నిబంధనలు పాటించని అధికారులు




**ప్రజాపక్షం/సూర్యాపేట:** శ్రీ లింగమంతులస్వామి(పెద్దగట్టు) జన జాతరలో మద్యం ఏరులై పారింది. విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు సాగడంతో భక్తజనం తాగి ఊగారు. 1971లో జరిగిన జాతరలో కల్తీ మద్యానికి 100 మంది భక్తులు బలయ్యారు. ఈ సంఘటనను దృష్టిలో ఉంచుకోని ప్రతి జాతరకు ప్రభుత్వం జాతర సమీపంలోని మద్యం దుకాణాలను మూసివేయడంతో పాటు జాతరలో మద్యం అమ్మకాలను నిషేదం విదించడం ఆనవాయితీగా వస్తుంది. కానీ ఈ సారి జాతరలో గత నిబంధనలను ఏమి పట్టించుకోలేదు.

లక్షలాది మంది వివిధ ప్రాంతాల నుండి పెద్దగట్టుకు తరలి వచ్చి గట్టుపై ఉన్న లింగన్న, చౌడమ్మతల్లిని దర్శించుకొని క్షేమంగా తిరిగి తమ గమ్యస్థానాలకు చేరేందుకు చర్యలు చేపట్టాల్సిన అధికారులు ఈ జాతరలో అవేమి పట్టించుకున్న దాఖలాలు మచ్చుకు కూడా కనబడడం లేదు. పిల్లపాపలతో ఇంటిల్లిపాది... తమ బంధువులతో జాతరకు తరలి వచ్చిన వారు వారందరిని వదిలేసి మద్యానికి ఎగబడ్డారు. జాతర సమీపంలోని దురాజ్‌పల్లి గ్రామంలో జాతీయ రహదారి పక్కన ఉన్న వైన్స్ షాపుల వద్దకు క్యూ కట్టారు. తాగిన వారిలో కొంతమంది ఘర్షణలకు తిగగా మరి కొందరు పిల్లపాపలను వదిలిపెట్టి తాగిన మైకంలో తూలుకుంటూ జాతరలో తప్పిపోయారు. ఇంకొంత మంది సోయిలేకుండా జాతర పరిసర ప్రాంతాల్లో కిందపడి నిద్రలోకి జారుకున్నారు. మద్యం మత్తులో తప్పిపోయిన వారి కోసం కుటుంబ సభ్యులు, బంధువులు గట్టువద్ద ఉన్న పోలీసు హెల్ప్ లైన్ సెంటర్‌ను ఆశ్రయించడంతో పాటు గట్టు పరిసర ప్రాంతాలు మొత్తం జల్లెడపట్టారు. గతంలో ఎన్నడు లేని విధంగా మద్యం జాతరలో ఏరులై పారింది.

1971లో జరిగిన జాతరలో కల్తీ మద్యానికి 100 మంది భక్తులు బలయ్యారు. దీంతో ఆ నాటి నుండి జన జాతరలో ప్రభుత్వం మద్యాన్ని నిషేధించారు. ఈ ఆనవాయితీ ప్రతి జాతరలో కొనసాగుతుంది. సమీపంలోని మద్యం షాపులను కూడా జాతరకు మూడు రోజుల నుం డే బంద్ చేయడం పాటు అక్రమ మద్యం నిల్వలను గు ర్తించి ఎక్సైజ్ అధికారులు సీజ్ చేయడం ఆనవాయితీ. కానీ ఈ జాతరలో మద్యం దుకాణాలు మొత్తం రాత్రింబవుళ్లు తెరచే ఉన్నాయి. ఈ విషయమై వివరణ కోరగా తమకు ప్రభుత్వం నుండి ఏలాంటి ఆదేశాలు రాలేదని చెప్పారు.

### కొండెక్కిన కొబ్బరికాయ ధర

అధికార పార్టీ నాయకుల అండతో

రూ. 75లకు విక్రయిస్తున్న గుత్తేదారు

**ప్రజాపక్షం/చివ్వెంల:** శ్రీ లింగమంతులస్వామి(పెద్దగట్టు) జాతరలో కొబ్బరికాయల ధర అమాంతంగా పెరిగాయి. అధికార పార్టీ నాయకుల అండతోనే ధరలు పెంచి భక్తులను దోచుకుంటున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.కొబ్బరికాయ ధర బహిరంగ మార్కెట్‌లో రూ. 20 నుండి 30లు పలుకుతుంది. గుత్తేదారుడు అమ్మే కొబ్బరికాయ ధర రూ. 20 నుండి 25లకు మించి ఉండదు. కానీ జాతరలో మార్కెట్ ధరకు మూడింతలు రెట్టింపు చేసి అమ్ముతున్న పరిస్థితి. కొబ్బరికాయ ధర రూ. 75లు అమ్మి భక్తులను దోచుకుంటున్నారు. అధికారుల కళ్లేదుటే భక్తులను దోచుకుంటున్న చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. వీరి దోపకంపై ఆయా పత్రికల్లో గత వారం రోజుల నుండి వార్తకథనాలు ప్రచురితమవుతున్నాయి. దిష్టిపూజ నుండి ఆదివారం వరకు రూ. 60లకు అమ్మిన కొబ్బరికాయ జాతర ప్రధానమైన రెండో రోజు(సోమవారం) అమాంతం పెంచి రూ. 75లకు అమ్ముతున్నారు.



**సెంటిమెంట్‌ను ముందు పెట్టి రెండు కొబ్బరికాయలు కొట్టాలంటూ...**

భక్తుల అమాయకత్వాన్ని ఆసరగా చేసుకున్న గుత్తేదారి సెంటిమెంట్‌ను ముందు పెట్టి పెద్దగట్టు ఉన్న శ్రీ లింగమంతుల స్వామితో పాటు చౌడమ్మ తల్లికి విధిగా కొబ్బరికాయలు కొట్టాలని రెండు కొబ్బరికాయలను అంటగడుతున్నారు. రెండు కొబ్బరికాయలకు రూ. 150లు వసూళ్లు చేసి భక్తుల జేబులకు చిల్లు పెడుతున్నారు.

**విక్రయ కేంద్రంలో కాంగ్రెస్ నేత తిష్ట**

అధిక ధరలకు కొబ్బరికాయలు అమ్ముతుండడంతో భక్తులు కొంత మంది ఇదేమి దోపిడని గుత్తేదారిని ప్రశ్నించి వాగ్వివాదానికి దిగుతున్న పరిస్థితి. ఇదీ మీడియా కంటపడడంతో దీన్ని కప్పిపుచ్చేందుకు కాంగ్రెస్ పార్టీ పట్టణ ప్రముఖ నేత అక్కడే కూర్చోబెట్టారు. ఇదేమని అతగాడిని ప్రశ్నిస్తే లక్షల రూపాయలు పెట్టి వేలం పాట పాడామని పెట్టిన డబ్బుకు లాభాలు ఉండోద్దా అంటూ ఎదురు దాడికి దిగిన పరిస్థితి. అధికార పార్టీ నాయకుడు అక్కడే ఉండడంతో గట్టువద్దనే ఉన్న ఉన్నతాధికారులు సైతం అటుపక్కకు కన్నెత్తి చూడడం లేదు. ఈ దోపకంపై పత్రికలతో పాటు భక్తులు వారి దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకున్న దాఖలాలు లేవు.



## యువత స్వశక్తితో ఎదగాలి



**ప్రజాపక్షం/నేలకొండపల్లి:** యువత స్వశక్తితో ఎదగాలి అనిసిపిఐ నేలకొండపల్లి మండలం కార్యదర్శి కర్నాటి భాను ప్రసాద్ అన్నారు. మండల కేంద్రంలో పాన్ షాప్ ను వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు తో కలిసి అయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. యువత ఉద్యోగుల కోసం ఎదురు చూడకుండా స్వశక్తితో ఎదిగి పది మంది ఆదర్శంగా నిలవాలి అని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల నాయకులు కుక్కల హనుమంతరావు, భూక్యా బాలాజీ, నరేష్, భూక్యా రవి, రంజిత్, కడియల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు దరఖాస్తు చేసుకోండి

**ప్రజాపక్షం/భద్రాచలం :**అర్హులైన ప్రతీ విద్యార్థినీ విద్యార్థులు ప్రధాన మంత్రి ఇంటర్న్‌షిప్ పథకం కు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి ప ఆటిల్ తెలిపారు. ఈ పథకానికి ఎంపికైతే నెలవారీ భత్యం రూ.5వేలు, ఒకసారి రూ.6వేలు మంజూరు అవుతాయని చెప్పారు. 12 నెలల ఇంటర్న్‌షిప్ కాలవ్యవధిలో కనీసం ఆరు మాసాల ఉద్యోగ శిక్షణ, వాస్తవ ప్రపంచ అనుభవాన్ని, తి పరమైన వాణిజ్య నెట్‌వర్కింగ్ రూపొందించి ఉపాధి అవకాశాలు అకాశాలు మెరుగుపరచడం జరుగుతుందన్నారు. ఈ పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు 21 నుండి 24 సం. మధ్య వయస్సు ఉండాలని, కుటుంబలో ఎవ్వరూ ప్రభుత్వ ఉద్యోగం చేసి ఉండరాదని చెప్పారు. పది, ఇంటర్, ఐటిఐ, పాలిటెక్నిక్ డిప్లమా, డిగ్రీ అర్హత ఉండాలని సూచించారు.

## 10వ తరగతి విద్యార్థులకు అవగాహన కార్యక్రమం



**ప్రజాపక్షం/కల్లూరు:**కల్లూరు లోని ప్రభుత్వ ఉన్నత జిల్లా పరిషత్ మరియు రెసిడెన్షియల్ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులకు విద్యాశాఖ అధికారి సోమశేఖర శర్మ ఆదేశాల మేరకు సి.వి.రామన్ కాలేజ్ వారి సౌజన్యంతో సోమవారం నివేదిత ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. పరీక్షలు రాసే విధానంపై అవగాహన, మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించేందుకు, విద్యార్థులను ఉత్తేజపరిచి దిశా నిర్దేశం కార్యక్రమాలపై సురేందర్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## గిరిజన దర్బారు దరఖాస్తుల పరిష్కారానికి అధికారుల కృషి




**ప్రజాపక్షం/భద్రాచలం:**గిరిజన దర్బార్‌లో వచ్చిన దరఖాస్తులను పరిష్కరించేందుకు అధికారులంతా కృషి చేయాలని ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి బి రాహుల్ అన్నారు. సోమవారం ఐటిడిఎ సమావేశ మందిరంలో నిర్వహించిన గిరిజన దర్బారుకు హాజరైన ఆయన వివిధ ప్రాంతాల నుండి వచ్చిన గిరిజనుల నుండి ఆయన దరఖాస్తులు స్వీకరించి, పరిశీలించి సంబంధిత అధికారులకు బట్వాడా చేశారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ మారుమూల ప్రాంతాల్లో నివశించే గిరిజనులు అనేక సమస్యలతో సతమతం అవుతుంటారని, అధికారులపై నమ్మకంతో న్యాయం జరుగుతుందని ఇక్కడిదాకా వస్తుంటారని చెప్పారు. అలాంటి వారి దరఖాస్తులను పరిశీలించి పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని చెప్పారు. పరిష్కారానికి నోచుకోని వాటిపై తగిన రీతిలో వివరణ ఇవ్వాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఎ యూనిట్ అధికారులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ వైద్యసేవలపై ఆన్‌లైన్ తనిఖీ

**ప్రజాపక్షం/చింతకాని:**నేరడ ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లలో అందుతున్న వైద్యసేవలపై జాతీయ ఆరోగ్యమిషన్ వారు సోమవారం నేషనల్ క్వాలిటీ కంట్రోల్ ఎస్‌స్మెంట్ కార్యక్రమం వర్చువల్ పద్ధతిలో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ కుమార్ భార్గవ్ , పుష్పలత 7 విభాగాలలో తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్లు దుర్గా , బిందు, డాక్టర్ ఆల్తాఫ్, సాయికుమార్, చింతకాని వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ సమ్మక్క సారక్క గ్యాస్ ఏజెన్సీ ప్రారంభం

ఇల్లందు శాసన సభ్యులు కోరం కనకయ్య



**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:**ఆళ్లపల్లి మండల ప్రజలకు గ్యాస్ సేవలు అందుబాటులోకి వచ్చాయని ఇల్లందు శాసన సభ్యులు కోరం కనకయ్య అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని శ్రీ సమ్మక్క సారక్క గ్యాస్ ఏజెన్సీని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆళ్లపల్లి మండల ప్రజలకు గతంలో గ్యాస్ సేవలు అందుబాటులో లేక సుదూర ప్రాంతమైన ఇల్లందు నుండి గ్యాస్ బండ్లు రావడంతో ప్రజలపై రవాణా ఖర్చు పడి గ్యాస్ ధర పెరగడంతో ఇబ్బంది పడేవారని అన్నారు. ఇక మండల కేంద్రంలో గ్యాస్ సేవలు అందుబాటులోకి రావడంతో కొంత ఉపశమనం కలుగుతుందని తెలిపారు. ఈకార్యక్రమంలో గ్యాస్ ఏజెన్సీ ప్రొప్రైటర్ పూనెం నరసయ్య, ధనలక్ష్మి, భరత్, భార్గవ్, స్థానిక ఎస్ఐ రతీష్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు పాయం రామనరసయ్య, వ్యాపారస్తులు బూరుగడ్డ రాములు, సంక ప్రభాకర్, నరెడ్ల వెంకన్న, గ్రామస్తులు పాల్గొన్నారు.

# 'సొమ్ము' ఆంధ్రాకు.. 'కాలుష్యం'తెలంగాణకు!

*రైతు గోస పట్టించుకోని పాలకులు
*అనారోగ్యం బారినపడుతున్న
స్పందన కరువు



**ప్రజాపక్షం/ఖమ్మం :** కర్మాగార స్థాపన ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వ్యక్తులతో జరిగింది. ముడి సరుకు దిగుమతి ఇతర ప్రాంతాల నుంచి జరుగుతుంది. లాభాలు ఆంధ్రా వ్యక్తులకే చెందుతున్నాయి. కానీ కాలుష్యం బారిన తెలంగాణ ప్రజలు పడుతున్నారు. కాలుష్యం బాధ భరించలేక ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగినా స్పందించే నాథుడు కనిపించడం లేదు. వినతి పత్రాలు తీసుకోవడం, ఇది అన్యాయమంటూ చెప్పడం తప్ప ఇప్పటి వరకు చర్యలు తీసుకున్న సందర్భం లేదు. గ్రామ ప్రజలను ఇబ్బందులు పెడుతున్న భద్రాద్రి స్పాంజ్ ఐరన్ ఫ్యాక్టరీ నుంచి వెలువడుతున్న కాలుష్యం నేలకొండపల్లి మండలం అప్పల నర్సింహాపురం గ్రామ రైతాంగాన్ని అనారోగ్యాల పాలు చేస్తుంది. పశువులు తాగే నీరు కలుషితం ఫ్యాక్టరీ నుంచి వెలువడుతున్న పొగకు పంటలు మసిబారి దిగుబడి రాక ధరను కోల్పోతున్నారు. ఇది చాలదన్నట్లు ఈ పొలాల్లో పనిచేసిన వారికి చర్మ సంబంధ వ్యాధులు రావడంతో పాటు శ్వాసకోశ వ్యాధులు కూడా వస్తున్నాయి. అప్పలనర్సింహాపురం గ్రామ సమీపంలో ఆంధ్రా సరిహద్దును భద్రాద్రి స్పాంజ్ ఐరన్ ఫ్యాక్టరీతో పాటు మరో కెమికల్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేశారు. కెమికల్ ఫ్యాక్టరీ నుంచి దుర్గంధం వెలువడుతుండగా స్పాంజ్ ఐరన్ నుంచి విపరీతమైన పొగ వస్తుంది. ఈ గ్రామంలో ఈ ఫ్యాక్టరీల నుంచి వచ్చే పొగ కారణంగా నీరు కలుషితమవుతుంది. ఈ నీటిని తాగిన పశువులు, జీవాలు వ్యాధుల బారీనపడుతున్నాయి. వీటన్నింటిపై గ్రామ రైతులు ఎంఆర్‌వో మొదలు హైదరాబాద్‌లోని పొల్యూషన్ బోర్డు దాకా అధికారులకు వినతి పత్రాలు సమర్పించారు. తమ స్థాయిలో నిరసనను తెలియజేశారు. అయిన అధికారులు స్పందించడం లేదు. కొత్తగూడెంలోని కాలుష్య నివారణ శాఖాధికారులు ఈ ప్రాంతాన్ని పరిశీలించి కాలుష్యానికి సంబంధించి ఈ ఫ్యాక్టరీలను మూసివేయాలని ప్రభుత్వానికి నివేదికలు ఇచ్చినా ఫలితం లేకపోయింది. ఇప్పటికైనా అధికారులు రైతాంగాన్ని దృష్టిలో ఉంచుకుని భద్రాద్రి స్పాంజ్ ఐరన్, కెమికల్ ఫ్యాక్టరీలపై తగు చర్యలు తీసుకుని కాలుష్యాన్ని నివారించాలని కోరుతున్నారు.

## దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు

కలెక్టర్ జితేష్ వి పాటిల్



**ప్రజాపక్షం/భద్రాచలం:** ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన ప్రతీ దరఖాస్తు పరిష్కారానికి అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి జితేష్ వి పాటిల్ అన్నారు. సోమవారం ఐడిఓసిలో నిర్వహించిన ప్రజావాణికి వివిధ జిల్లాలోని పలు ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి ఆయన దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వ్యయ ప్రయాసలకు ఓర్చి వివిధ ప్రాంతాల నుండి ప్రజలు వారి సమస్యల పరిష్కారం కోసం దరఖాస్తులు చేసుకుంటున్నారని, వాటిని అధికారులు చిత్తశుద్ధితో పరిష్కరించిన నాడే వారికి పరిపాలనపై నమ్మకం కుదురుతుందన్నారు. పరిష్కారం జాప్యం తగదని, పరిష్కరించలేని వాటిపై తమకు నివేదించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందనతో పాటు అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు.

## అధిక దిగుబడిపై జినెక్స్ సీడ్స్ ఇండియా పంట అవగాహన




**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:**మండల పరిధిలోని మర్కోడు గ్రామానికి చెందిన గొగ్గెల సతీష్ అనే రైతు రాఘవాపురం గ్రామ చివరిలో వేసిన సింహారకం(1134) మక్కల పంటను సోమవారం ఉదయం పరిశీలించారు. మొక్కజొన్న పంట వద్ద జీనెక్స్ సీడ్స్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ వారి పంట దిగుబడిపై 300 మంది రైతులతో అవగాహన సదస్సు నిర్వహించారు. జీనెక్స్ వారి నవతరం హైబ్రిడ్ మొక్కజొన్న విత్తనాల కంకి పొడవుగా బలమైన గింజలతో ఉన్నాయని, దీని వల్ల అధిక దిగుబడి వచ్చిందని ఎంతో సంతృప్తి వ్యక్తం చేశారు. కష్టపడి సాగు చేసిన మొక్కజొన్నల పంటకు అధిక దిగుబడి రాబడి వచ్చినప్పుడే రైతులకు అసలైన ఆనందం లభిస్తుందని అన్నారు. ఈసందర్భంగా కంపెనీ యాజమాన్యం శ్రీపాల్ రెడ్డి మాట్లాడుతూ విత్తనంలో పంట పండించిన రైతుకు అధిక దిగుబడి రావడం ఏజెన్సీ గ్రామీణ రైతులతో పాటుగా డీలర్లకు కంపెనీకి గొప్ప పేరు ప్రఖ్యాతలు లభించిందని వారు ఆశా భావం వ్యక్తం చేశారు. తదనంతరం సింహారకం పంట అధిక దిగుబడి రావడంతో రైతును ప్రముఖ వ్యాపారస్తుడు బూర్ల రాంబాబు శాలువాతో సత్కరించారు. ఈకార్యక్రమంలో జగన్, రైతులు పాల్గొన్నారు.

## మిర్చి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి



**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం:** రైతులు పండించిన మిర్చి పంటకు క్వింటాకు రూ.25వేలు గిట్టుబాటు ధరను ప్రభుత్వమే ప్రకటించి కొనుగోలు చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా నాయకులు దివ్వెల వీరయ్య, మండల రైతు సంఘం అధ్యక్షులు గొల్లపూడి కోటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో ఆరబెట్టిన మిర్చి కల్లాలను, మిర్చి తోటలను, పనిచేస్తున్న రైతులను కలుసుకుని మిర్చి సమస్యలపై విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో అత్యధిక విస్తీర్ణం గల ఖమ్మం పరిసర ప్రాంతాల్లో పెద్ద ఎత్తున మిర్చి పంటను సాగు చేస్తున్నారని, ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఖమ్మంలో మిర్చి బోర్డును ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. మిర్చి బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్‌తో మంగళవారం ఖమ్మంలో వ్యవసాయ మార్కెట్ వద్ద మిర్చి రైతులు చేయనున్న మహాధర్నాను జయప్రదం చేయాలని తెలిపారు. అధిక పెట్టుబడులతో మిర్చిని సాగు చేస్తే సరైన గిట్టుబాటు ధరలేక రైతులు ఆందోళన చెందుతున్నారని, ఇప్పటికైనా ప్రభుత్వాలు స్పందించి మిర్చి క్వింటాకు రూ.25వేలు మద్దతు ధర ప్రకటించి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డివైఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు మద్దాల ప్రభాకర్, రైతు నాయకులు కన్నెబోయిన శ్రీనివాసరావు, గొల్లపూడి నారాయణ, మోక్షానందం, కొమ్మినేని రామారావు, సేలం రంగారావు, శీలం వెంకటేశ్వరరావు, బాపయ్య, గోపి, రైతులు పాల్గొన్నారు.

## జాతీయ రహదారిపనులను అడ్డుకున్న రైతులు

**ప్రజాపక్షం/ మధిర:** మధిర మండల పరిధిలోని ఖాజీపురం సమీపంలో జరుగుతున్న నాగపూర్ అమరావతి హైవే పనులను స్థానిక రైతుల అడ్డుకున్నారు. మాటూరు రెవెన్యూ పరిధిలోను సుమారు 70 మంది రైతులకు చెందిన పొలాలు నేషనల్ హైవే నిర్మాణంలో పోవడంతో రైతులకు ఎటువంటి నష్టపరిహారాన్ని కూడా చెల్లించకుండా నాగపూర్ అమరావతి హైవే నిర్మాణాన్ని చేపడుతున్నారని ఆరోపించారు. తమకు నష్టపరిహారం చెల్లించిన తర్వాతే నిర్మాణం పనులు చేపట్టాలని, సంబంధిత అధికారులు సకాలంలో స్పందించి నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని బాధిత రైతులు కోరారు.



## తాగునీటి కష్టాలు తీర్చిన మంత్రి పొంగులేటి



**ప్రజాపక్షం/కూసుమంచి:** తాగునీటి కోసం అనేక ఇబ్బందులు పడుతున్న కూసుమంచి మండలంలోని తురకగూడెం గ్రామ ప్రజల నీటి కష్టాలు మంత్రి పొంగులేటి చొరవతో తీరాయి. మండలా కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న తురకగూడెం గ్రామంలో గత కొద్ది రోజులుగా తాగునీటి సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని స్థానిక నాయకులు కన్నెబోయిన నరేష్ నేతృత్వంలో గ్రామస్తులు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా తక్షణమే స్పందించిన మంత్రి వెంటనే సమస్య పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. తాగునీటి సరఫరాకు మోటార్లు అవసరమని గమనించిన అధికారులు స్థానిక నాయకులు సహకారంతో మోటార్లు అప్పటికే ఉన్న బోరు పాయింట్లలో మోటార్లు అమర్చి తాగునీరు అందించారు. సకాలంలో స్పందించి గ్రామస్తుల తాగునీటి సమస్య పరిష్కారాన్ని చూపిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కి స్థానిక నాయకులు, అభిమానులు, ప్రజలు కృతజ్ఞతలు తెలియజేశారు.

## అన్నా మా బాధను ఆలకించండి

ఫ్యాక్టరీల వలన వ్యవసాయం
చేయలేకపోతున్నాం
మంత్రి శ్రీనివాస్‌రెడ్డిని కలిసిన
అప్పల నరసింహాపురం బాధిత రైతులు



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :**ఖమ్మం జిల్లా, నేలకొండపల్లి మండలం లోని అప్పలనరసింహాపురం లోని ఐరన్, కెమికల్ ఫ్యాక్టరీల వలన వ్యవసాయం చేయలేక పోతున్నామని గ్రామానికి చెందిన బాధిత రైతులు రాష్ట్ర రెవిన్యూ, గృహ నిర్మాణ సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ని కలిసి వినతి పత్రం అందించారు. సోమవారం ఖమ్మం లోని మంత్రి క్యాంపు కార్యాలయంలో కలిసి ఫ్యాక్టరీ పై ఫిర్యాదు చేశారు. ఫ్యాక్టరీ వలన రైతులు పడుతున్న ఇబ్బందులను వివరించారు. పంటలకు దుమ్ము తో పాటు పొగ వలన పంట మసిబారి కాత పూత ఉండటం లేదు. కాస్తో కూస్తో వచ్చిన పంట వలన మూసి బారింది అన్ని దళారులు అందినా కాడికి దోచుకుంటున్నారు అని వాపోయారు. మూగజీవాలు, రైతులు అనారోగ్యం పాలవుతున్నామని తెలిపారు. మంత్రి సానుకూలంగా స్పందించినట్లు బాధిత రైతులు తెలిపారు. మంత్రి ని కలిసిన వారిలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ కోర్లకుంట్ల నాగేశ్వరరావు, బాధిత రైతులు లక్కినారాయణ, వెంకటనారాయణ, శ్రీనివాసరావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## వసతి గృహాలు, పాఠశాలల్లో త్వరగా మరమ్మతులు

*పాల్వంచ ఆశ్రమ వసతి గృహంలో
చేపడుతున్న పలు రకాల పనుల పరిశీలన

**ప్రజాపక్షం/పాల్వంచ :** వసతి గృహాలు, పాఠశాలల్లో చేపడుతున్న మరమ్మత్తు, మరుగుదొడ్ల పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. సోమవారం ఆయన పాల్వంచ ఆశ్రమ వసతి గృహంలో చేపడుతున్న పలు రకాల పనులను పరిశీలించారు. మరుగుదొడ్ల పనులు మంగళవారం నాటికి పూర్తి చేయాలన్నారు. విద్యార్థులు దస్తులు ఆరబెట్టుకునేందుకు ఏర్పాటు చేసిన ఫైన్ ఫిట్టింగ్ తాడు పనులను చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లాలో మగిత వసతి గృహాల్లో కూడా ఇదే రీతిలో ఏర్పాటు చేయాలని అన్నారు. అనంతరం విద్యార్థులకు ఏర్పాటు చేసిన బెడ్లను పరిశీలించిన ఆయన విద్యార్థులందరికీ సరిపడా బెడ్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట డిడి మణెమ్మ, భద్రు తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా సేవాలాల్ జయంతి



**ప్రజాపక్షం/లక్ష్మీ దేవిపల్లి:**సంత్ సేవాలాల్ 286వ జయంతి వేడుకలను సోమవారం లక్ష్మీదేవిపల్లి మండలం ఎదురుగడ్డ గ్రామపంచాయతీలో గిరిజన సంఘాల జేఏసి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు, వైరా శాసనసభ్యులు రాందాస్‌నాయక్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ముఖ్య అతిధులుగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1739 ఫిబ్రవరి15న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనంతపురం జిల్లా గుత్తి ప్రాంతంలో సేవాలాల్ మహారాజ్ జన్మించాడని అన్నారు. జగదాంబ దేవి ఆశీస్సులతో అనేక తండాల్లో పర్యటిస్తూ బంజారా జాతిని జాగృతం చేశారని కొనియాడారు. బాల బ్రహ్మచారిగా, జగదాంబ దేవి భక్తుడిగా, బంజార జాతిని సన్మార్గంలో నడిపిన ఆదర్శ ధర్మ గురువు అని గుర్తు చేశారు. వారు చూపిన బాటలో నేటి బంజారా సమాజం నడవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి షేక్ సాబీర్‌పాషా, చంద్రగిరి శ్రీనివాసరావు, కాంగ్రేస్ నాయకులు నాగసీతారాములు, కోనేరు చిన్ని, జేబి శౌరి, ఏనుగుల అర్జున్‌రావు, మాలోతు బలరాం, బానోతు ఈశ్వర్‌సింగ్, బంజారా సంఘం నాయకులు లావుడియా ప్రసాద్, అమర్‌సింగ్, దేవిలాల్, బాలు, రమేష్, బాలాజి, లాల్‌సింగ్, అరుణ్, శ్రీనుపాల్గొన్నారు.

## సారా ముడి పదార్థాలు సరఫరా చేస్తున్న వ్యక్తిపై కేసు నమోదు



**ప్రజాపక్షం/నెక్కొండ :** కచ్చితమైన సమాచారం మేరకు వరంగల్ జిల్లా నెక్కొండ మండలం చంద్రుగొండ రైల్వే ట్రాక్ వెంబడి తెల్లవారుజామున చెన్నారావుపేట మండలం అడ్డబాట తండకు చెందిన భూక్యా కిమ్యా అనే వ్యక్తి మహారాష్ట్రలోని నాందేడ్ తదితర ప్రాంతాల నుండి అక్రమంగా పలు రైళ్లలో బెల్లం, పట్టికను, తీసుకొచ్చి రాత్రి పూట రైలు చైన్ లాగి గేటుపల్లి తండా సమీపంలో పట్టాల దగ్గర పడవేసి వాటిని తన ద్విచక్ర వాహనంపై గ్రామానికి తరలిస్తున్న క్రమంలో నర్సం పేట ఎక్సైజ్ అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. ఈ దాడిలో 20కేజీల పట్టిక, 70కేజీల బెల్లం, ద్విచక్ర వాహనం, మొ బైల్ పోన్, అతనిపై కేసు నమోదు చేయడం జరిగిందని నర్సంపేట ఎక్సైజ్ సిఐ నరేష్ రెడ్డి తెలిపారు. ఈ దాడిలో సిబ్బంది నాగరాజు, రంజిత్ పాల్గొన్నారు.

## ప్రజావాణి వినతుల పరిష్కారానికి చర్యలు

### హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావిణ్య



**ప్రజాపక్షం/హనుమకొండటౌన్ :** సోమవారం నిర్వహించి ప్రజావాణిలో ప్రజల నుండి వచ్చిన వినతుల పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులు చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావిణ్య అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్‌హాల్ లో వివిధ శాఖల జిల్లా అధికారులతో కలిసి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల నుండి జిల్లా కలెక్టర్ ప్రావిణ్య, అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, డీఆర్వో వై.వి.గణేష్ వినతులను స్వీకరించారు. ప్రజా వాణి కార్యక్రమంలో వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ 70 వినతులను ప్రజలు సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు అందించిన వినతులను వెంటనే పరిష్కరించాలని పేర్కొన్నారు.ఈ కార్యక్ర మంలో జెడ్‌పి సిఇఒ విద్యాలత, డిఆర్‌డిఒ శ్రీను, సంబంధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్ వద్ద మహిళా సంఘాల ఆందోళన



**ప్రజాపక్షం/హనుమకొండటౌన్ :** హనుమకొండ కలెక్టరేట్ వద్ద సోమవారం మహిళ సంఘాలు ఆందోళన చేపట్టారు. హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం సిరి గ్రామైఖ్య సంఘం సభ్యులు శ్రీనిధి సంస్థ నుంచి 25 సంఘాల రుణాలు పొందారు. ఆ రుణాలకు నెలవారి చెల్లింపులను సిరి గ్రామైఖ్య సంఘంలో విఒఎగా పని చేస్తున్న పద్మకు చెల్లిస్తున్నారు. సభ్యులు చెల్లించిన పైసలను బ్యాంకులో కట్టకుండా సొంత అవసరాలకు పద్మ వాడుకుంటుందని మహిళ సంఘం సభ్య లు ఆరోపించారు. సుమారు 17 లక్షల వరకు డబ్బులను వాడుకుందని సభ్యులు తెలిపారు. తమకు న్యాయం చేయాలని కోరుతూ హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్యకు వారు వినతి పత్రం అందజేశారు. సొంత అవసరాలకు డబ్బులు వాడుకున్న పద్మపై చర్యలు తీసుకోవాలని సంఘం సభ్యులు కోరారు.

## విద్యార్థులకు కంటి పరీక్షలు



**ప్రజాపక్షం/జనగామటౌన్:** విద్యార్థుల స్కూల్ హెల్త్ కార్యక్రమంలో భాగంగా రెండవ దశలో 118 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహిం నిర్వహించినట్లు డిఎంహెచ్‌ఒమల్లిఖార్జున్‌రావు తెలిపారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమానికి హాజరై విద్యార్థులకు జరుగుతున్న కంటి పరీక్షలు పరిశీలించి ఆప్తాల్మిక్ ఆఫీసర్స్‌కు తగిన సలహాలు, సూచనలు తెలియ జేశారు. విద్యార్థులను అందరినీ పరిశీలించి ఫలితాలు రోజు వారీగా రికార్డు చేసి తదుపరి పరీక్షల కోసం సిద్ధం చేయాలని ఆయన ఆదేశించారు.

## ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి



**ప్రజాపక్షం/పాలకుర్తి:** రాష్ట్రంలోని ఆలయాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం, సిఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నట్లు జనగామ మార్కెట్ కమిటీ చైర్మన్ శివరాజ్ యాదవ్ అన్నారు. సోమవారం మండలంలోని వావిలాల గ్రామంలో యాదవులపెద్దగట్టు లింగమంతుల స్వామిని దర్శించుకుని ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం దేవాలయాల అభివృద్ధికి కృషి చేస్తుందని, లింగమంతుల దేవాలయ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం మండల అధ్యక్షుడు సలేంద్ర శ్రీనివాస్, చిలువేరు కృష్ణమూర్తి, పాండు, కృష్ణ, చిలువేరు వీరన్న, శీల లింగన్న, వీరన్న, మల్లయ్య, లింగయ్య పాల్గొన్నారు.

## ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు : జిల్లా ఎస్‌పి

**ప్రజాపక్షం/మహాదేవపూర్:** అక్రమాలకు పాల్పడేవారెవరైనా ఉపేక్షించేది లేదని ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్‌పి కిరణ్ ఖరె హెచ్చరించారు. సోమవారం మండలంలోని బొమ్మాపూర్ ఇసుక క్వారీతో పాటు కాటారం మండలంలోని మద్దులపల్లి చెక్ పోస్టును ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా క్వారీలో ఇసుక నిల్వలపై ఆరా తీసి క్వారీ కార్యాలయంలోని రికార్డులను పరిశీలించారు. క్వారీలో ఎటువంటి అక్రమాలకు పాల్పడినా,.జీరో బిల్లులు,డబుల్ ట్రిప్, అదనపు లోడు, నఖిలీ బిల్లులు, తప్పుడు వాహనంలో ఇసుక రవాణా, తప్పుడు గమ్య స్థానాలకు పంపించడం లాంటి ఉల్లంఘనలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వ నిబందనల మేరకు నిర్దేశించిన ప్రాంతంలోనే రాయల్టీ రుసుము చెల్లించి ఇసుక తవ్వకాలు చేపట్టాలని అన్నారు. ఎస్సై పవన్‌కుమార్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# కారడవిలో కలెక్టర్ పర్యటన

### విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ





**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** జిల్లా సరిహద్దు అటవీ ప్రాంతమైన పలిమల మండలం ముకునూరు శివారు గ్రామం తిమ్మేటి గూడెంలలో జిల్లా కలెక్టర్ రాహుల్‌శర్మ ఆశ్రమ పాఠశాల, ఎంపిపిఎస్, అంగన్‌వాడీ కేంద్రం, గ్రంథాలయం తదితర వాటిని పరిశీలించారు. గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థులతో జిల్లా కలెక్టర్ మాట్లాడారు. ఉపాధ్యాయుల విధులు, మధ్యాహ్న భోజనం, మౌలిక వసతుల తదితర వాటి గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నోటు పుస్తకాలు పెన్నులు, పెన్సిల్స్, పరీక్షా ప్యాడ్స్ పంపిణీ చేశారు. పాఠాలు చదివించి బాగా చదవాలని సూచించారు. అనంతరం నూతనంగా నిర్మించిన గ్రంథాలయాన్ని పరిశీలించి గ్రంథాలయానికి అవసరమైన ర్యాక్స్, కుర్చీలు, పోటీ పరీక్షాలకు అవసరమైన పుస్తకాలు ఏర్పాటు చేస్తానని అన్నారు. అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించి పిల్లలు చెప్పే పద్యాలను విని అభినందించారు. అంగన్వాడీ కేంద్రానికి విద్యుత్ సౌకర్యం కల్పించాలని కోరగా, సంక్షేమ అధికారి ద్వారా ప్రతిపాదనలు పంపాలని ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రాథమిక పాఠశాలలను సందర్శించి పాఠశాల విద్యార్థులతో మాట్లా డారు. డిజిటల్ క్లాస్ ను పరిశీలించి విద్యార్థులకు నాణ్యమైన భోజనం, మెరుగైన విద్య అందించాలని ఉపాధ్యాయులను అదేశించారు. పాఠశాలకు కావలసిన మౌలిక వసతులు కల్పిస్తామని తెలిపారు. విద్యార్థుల వివరాలు ఆపార్ లో నమోదులు చేయాలని ఆదేశించారు. పాఠశాలకు ఎక్కువ మంది విద్యార్థులు గైర్హాజరు అయ్యారని, విద్యార్థులు క్రమం తప్పక పాఠశాలకు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఆశ్రమ పాఠశాలలో మరుగుదొడ్లు, కిటికిలకు తలుపులు, గ్రీన్ బోర్డ్స్, మరమ్మతులు తదితర సౌకర్యాలు కల్పనకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.తరువాత నిర్మాణంలో ఉ న్న అంగన్వాడీ భవనాన్ని పరిశీలించి త్వరిత గతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.అంతకు ముందు నీలంపల్లి వద్ద బ్రిటిషర్లు నిర్మించిన ఇచ్చంపల్లి ప్రాజెక్టును పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, తహసీల్దార్ ప్రవీణ్, ఎంపిడిఓ శ్రీనివాసరావు, ఎపిఓ ప్రకాష్ రెడ్డి, సీడీపీఓ రాధిక, ఏపీఎం సునీత పంచాయతి కార్యదర్శి వినయ్ కృష పాల్గొన్నారు.

## పకడ్బందీగా ఇంటర్మీడియట్ పరీక్షలు

### మార్చి 5 నుండి 25 వరకు వార్షిక పరీక్షలు

### జిల్లా కలెక్టర్ సత్యశారద



**ప్రజాపక్షం/వరంగల్ ప్రతినిధి:** జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలు నిర్వహించడానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. మార్చి 5వ తేదీ నుండి జరిగే ఇంటర్ పరీక్షల నిర్వహణపై సోమ వారం సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణితో కలెక్టర్ కలసి ఆయా శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జనరల్, ఒకే షన ల్ ఇంటర్ పరీక్షలు మార్చి 5 నుంచి 25 వరకు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగు తాయన్నారు. జిల్లా వ్యాప్తంగా 26 పరీక్షా కేంద్రాల్లో ప్రథమ సంవత్సరం జనరల్ 4967, ఒకేషనల్ 848 మొత్తం 5815 విద్యార్థులు, ద్వితీయ సంవత్సరం జనరల్ 5739, ఒకేషనల్ 767 మంది మొత్తం 6506 విద్యార్థులు పరీక్షలు రాయ నున్నారని తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పరీక్షలు రాసేలా ఏర్పాట్లు చేయాలని ఆదే శించా రు. విద్యార్థులకు ఏమైనా సందేహాలుంటే టోల్ ఫ్రీ నెం. 9240205555 నెంబరును సద్వినియోగం చేసుకోవాలని సూచి ంచారు. ఈ సమావేశంలో డిఆర్ఒ విజయలక్ష్మి, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి శ్రీధర్, సుమన్, డిఆర్‌డిఒ కౌసల్యాదేవి, జెడ్పి సిఇఒ రామిరెడ్డి, డిఎంహెచ్ఒ డాక్టర్ సాంబశివరావు, విద్యుత్తు, ఆర్‌టిసి, పోలీసు, పోస్టల్, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బాధితులకు అండగా భరోసా కేంద్రం

### జిల్లా ఎస్‌పి కిరణ్ ఖరే



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి:** బాధిత మహిళలు, బాలికలకు భరోసా సెంటర్ అండగా నిలుస్తుందని, జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్‌పి కిరణ్ ఖరే అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని భరోసా కేంద్రం వార్షికోత్సవం సందర్భంగా సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా ఎస్పి మాట్లాడారు. భరోసా కేంద్రం, హింస, లైంగిక బాధిత మహిళలకు, బాలికలకు వైద్యం, కౌన్సెలింగ్, లీగల్ ఇతర రకాల సేవలు అందిస్తుందని, బాధితులకు అండగా ఉంటూ మనోధైర్యం కల్పిస్తుందన్నారు. భరోసా కేంద్రం ద్వారా బాధిత మహిళలకు న్యాయం జరిగేలా కృషి చేస్తుందని పేర్కొన్నారు. భరోసా సహాయ కేంద్రాలు సమగ్రమైన సహాయాన్ని అందించడానికి, అలాగే హింసకు గురైన మహిళలకు పోలీస్‌స్టేషన్‌లకు, ఆసుపత్రులకు దూరంగా సురక్షితమైన వాతావరణంలో చేయూత అందించడానికి ఏర్పాటు చేయబడ్డాయన్నారు. హింస, లైంగిక వేధింపులకు గురైన పిల్లలు, స్త్రీలకు రక్షణ కల్పించడమే భరోసా కేంద్రాల లక్ష్యమన్నారు. అలాగే భరోసా కేంద్రంలో పనిచేస్తున్న ఉద్యోగినుల సమస్యలను ఎస్‌పిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి డీఎస్పీ సంపత్ రావు, భూపాలపల్లి సిఐ నరేష్ కుమార్, ఎస్సై స్వప్న కుమారి, భరోసా కో–ఆర్డినేటర్ వి.మానస, లీగల్ అడ్వైజర్ కే.అఖిల, సపోర్ట్ పర్సన్స్ రమ్య, తులసి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయిలో 'సన్‌వ్యాలీ' విద్యార్థుల ప్రతిభ



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి:** శ్రీనివాస్ రామానుజన్ అయ్యంగార్ జయంతి ఉత్సవాలను పురస్కరి ంచుకొని ఎస్ఆర్ఎఫ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పుల్లూరిరామయ్య పల్లి గ్రామపంచాయతీ పరిధిలోని సన్ వ్యాలీ హై స్కూల్ కు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి సీనియర్ విభాగంలో పరీక్షలు నిర్వహించారు. దీనిలో భాగంగా ఎనిమిదవ తరగతికి చెందిన ఎం.నిత్య జూనియర్ విభాగంలో నాలుగవ తరగతికి చెందిన ఎస్.రుద్రాంష్, జిల్లాస్థాయికి వి.నిహాన్, ఎం.హార్థిక్, దీక్షిత, శ్రేష్ఠ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం మాట్లాడుదారు.ప్రతి విద్యార్థి గణితం పట్ల మ క్కువ పెంచుకోవాలని ఉన్నత శిఖరాలు అధిరోహించే విధంగా తయారు కావాలని, డైరెక్టర్లు మైనాల సురేష్, మీనం సతీష్, వేముల శంకర్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సమన్వయంతో మహాశివరాత్రికి ఏర్పాట్లు

### జిల్లా కలెక్టర్ ప్రావిణ్య



**ప్రజాపక్షం/హనుమకొండ ప్రతినిధి :** మహాశివ రాత్రి ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లను అధికారులు సమన్వయంతో పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావిణ్య అన్నారు. సోమవారం హనుమకొండ జిల్లాకలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్ లో 26నమహా శివరాత్రి ఉత్సవాలపై దేవాదా య, రెవెన్యూ, పోలీస్, మున్సిపల్, ఆర్టీసీ, విద్యుత్, ఆర్ అండ్ బి, అగ్నిమాపక, వైద్య ఆరోగ్యశాఖ, తదితర శాఖల అధికారులతో కలెక్టర్ సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. హనుమకొండలోని శ్రీరుద్రేశ్వర స్వామి వేయిస్తంభాల దేవాలయంతో పాటు మడికొండలోని శ్రీ మెట్టు రామలింగేశ్వర స్వామి ఆలయాలలో మహాశివరాత్రి ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులతో ఏర్పాట్లపై కలెక్టర్ స మీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మహాశివరాత్రి నేపథ్యంలో ఆలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించాలని, విద్యుత్తు సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా ఆశాఖ అధికారులు మున్సిపల్ అధికారులతో కలిసి సమన్వయంతో పని చేయాలన్నారు. శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలని, మహిళా పోలీస్ సిబ్బంది ఎక్కువగా ఉండే టట్టు చూసుకోవాలని పోలీస్ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, జిల్లా రెవె న్యూ అధికారి వైవి గణేష్, హనుమకొండ ఆర్డీఓ రాథోడ్ రమేష్, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సునీత, హనుమకొండ ఎసిపి దేవేందర్ రెడ్డి, ఇతర శాఖ లఅధికారులతో పాటువేయి స్తంభాల గుడి ప్రధాన అర్చకులు గంగు ఉపేంద్ర శర్మ, ఇతర వేద పాల్గొన్నారు.

## విద్యార్థుల పట్ల అలసత్వం వహిస్తే సహించం

### మోనూ ప్రకారం నాణ్యమైన ఆహారాన్ని పెట్టాలి

### జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమర్ సింగ్



**ప్రజాపక్షం/గూడూరు :** విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు వార్డెన్ ఎవరైనా అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకుం టామని, గురుకుల పాఠశాలలో మోను ప్రకారమే నాణ్యమైన తాజా ఆహారాన్ని అందించాలని జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ అధికారులను ఆదెశించారు. సోమవారం గూడూరు మండలం కేంద్రంలోని దామరవంచ ఉన్న తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెడిడెన్షియల్ జూనియర్ కాలేజ్ మహాత్మజ్యోతిరావుపూలే(బాలికల) హాస్టల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన వసతి గృహంలోని కిచన్ షేడ్ స్టోర్ రూమ్ డైనింగ్ హాల్ స్టడి రూమ్ టాయిలెట్స్ తరగతి గదులు పరిసరాలను పరిశీలించారు. ఉదయం బ్రేక్ ఫాస్ట్ మధ్యా హ్నం భోజనం రాత్రిడిన్నర్ మోనూ ప్రకారం పక్కాగా అమలు చేయాలని నాణ్యమైన ఆహార పదార్థాలను వెంట వెంటనే తయారు చేసి అందించాలన్నారు. సిబ్బంది తగిన జాగ్రత్తలు పాటిస్తూ భోజనం సిద్ధం చేయాలన్నారు.వసతి గృహాల పరిసరాలలో శానిటేషన్ చేస్తూ పరిశుభ్రముగా ఉంచుకోవాలని సూచించారు. కలెక్టర్ వెంట స్థానిక తహసీల్దార శ్వేత మండల పరిషత్ అభివృద్ధి అధికారి వీరస్వామి, సంబంధిత సిబ్బంది ఉన్నారు.

## ఇసుక మీద ఉన్న శ్రద్ధ రేషన్‌పై లేకపాయే!

### ప్రభుత్వ అధికారుల తీరు మారేనా?



**ప్రజాపక్షం/మంగపేట :** మండలంలో రేషన్ బియ్యం యధేచ్చగా అక్రమ వ్యాపారం జరుగుతుంటే ప్రభుత్వ అధికారులు టాస్క్‌ఫోర్స్ సివిల్ సప్లయి, రెవెన్యూ, పోలీస్ అధికారులకు పట్టించుకున్న పాపాన పోలేదని స్థానిక ప్రజలు తెలుపుతున్నారు. పేద ప్రజలకు అందాల్సిన రేషన్ బియ్యం పక్క రాష్ట్రాలకు జిల్లాలకు వెళుతుంటే ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతుంటే అదేమీ తప్పుకాదన్నటూ నేరం కాదు అన్నట్లుగా ప్రభుత్వ అధికారులు చూస్తున్నారన్నారు. కొన్ని చోట్ల రేషన్ డీలర్లే కార్డు హో ల్డర్ దగ్గర కొని షాపులకు మిల్లులకు కోళ్ళ పెంపకం యజమానులకు గుత్తికోయ వారికి యథేచ్ఛగా వ్యాపారం చేస్తుంటే ఒక్క అధికారి అయినా మండలంలో తనిఖీ చేసి డీలర్‌పై షాప్‌పై కేసుగాని, సీజ్ గాని చేసిన దాఖలాలే లేవన్నారు. తూతూ మంత్రంగా తనిఖీలు చేసి వదిలేసినా ఘటనలు చాలా ఉన్నాయని పలువురు ఆరోపించారు. మండల డీలర్ల సంఘం నుండి ముడుపులు అధికారులకు అందుతున్నాయనే భావన ప్రజల్లో ఉందని, దీని అర్థం రాష్ట్ర, జిల్లా అధికారులు ఆదేశిస్తే చర్యలు ఉంటాయా అని ప్రజలు వాపోతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇసుక మీద తనిఖీలు చేసి అక్రమ ఇసుకపై ఉక్కుపాదం మోపిన తీరు ప్రభుత్వం పిడిఎస్ బియ్యం రేషన్ డీలర్లపై నిఘా పెట్టి అక్రమ రేషన్ బియ్యం దందాలకు చెక్ పెట్టాలని ప్రజలు, ప్రభుత్వ అధికారులను కోరుతున్నారు.

# వణుకు పుట్టిస్తున్న పులి సంచారం



**ప్రజాపక్షం/కాళేశ్వరం:** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని మహదేవపూర్, కాటారం అటవీ ప్రాంతాల్లో పెద్దపులి సంచారం వణుకు పుట్టిస్తోంది. ఇటీవల అటవీ ప్రాంతాల్లో పులి సంచారం నేపథ్యంలో అటవీ గ్రామాల ప్రజలను భయాందోళనలకు గురి చేస్తోంది. అటవీ ప్రాంతాల్లో పులి సంచారం పై ఏర్పాటు చేసిన ట్రాకింగ్ కెమెరాలకు పులి జాడ చిక్కలే దని కేవలం పులి పాద ముద్రల ఆనవాళ్లను గుర్తించి అటవీ ప్రాంతంలో పులి సంచరిస్తున్నట్లు అటవీ అధికారుల నుండి అభిప్రాయం వ్యక్తమవుతోంది. మహాదేవపూర్ రేంజ్‌లోని బీరాసాగర్ అటవీ ప్రాంతంలో పులి పాద ముద్రలు గుర్తించిన ట్రాకింగ్ ప్రత్యేక బృందాలు ఆదివారం అన్నారం అటవీ ప్రాంతం గుండా కాటారం రేంజ్ పరిధిలోని గుంద్రాత్ పల్లి అటవీ ప్రాంతంలోకి పులి ప్రవేశించినట్లు గుర్తించారు. పెద్దపులి ఏకంగా 20 నుండి 25 కిలోమీటర్ల మేర సంచరించే అవకాశాలు ఉంటాయని అధికారులు అంటున్నారు. మహాదేవపూర్, కాటారం అటవీ ప్రాంతాల్లో పులి సంచారం ఒక్కసారిగా వెలుగు చూడటంతో అటవీ గ్రామాల ప్రజలు భయాందోళనలు చెందుతున్నారు. దట్టమైన అటవీ ప్రాంతం కావడంతో నాలుగు బృందాలుగా ఏర్పడిన ట్రాకింగ్ టీం ఎప్పటికప్పుడు పులి కదలికలపై ఆటవీ ప్రాంతాలను జల్లెడ పడుతున్నాయి. గత కొన్నేళ్లుగా అటవీ ప్రాంతాల్లో పులి సంచరించిన దాఖలాలు కనుమరుగు కావడంతో అటవీ మార్గాల గుండా నిర్భయంగా రాత్రనక, పగలన యదేచ్ఛగా రాకపోకలు కొనసాగించిన అటవీ గ్రామాల ప్రజలు తాజాగా అటవీ ప్రాంతాల్లో పులి సంచారం పట్ల అటవీ మార్గాల గుండా వెళ్ళేందుకు ప్రజలు జంకుతున్నారు. కాగా అటవీ ప్రాంతాల్లో పులి జాడలను గుర్తించేందుకు అటవీ ప్రాంతాల్లో ట్రాకింగ్ కెమెరాలు ఏర్పాటు చేసి ప్రత్యేక బృందాలు అన్వేషణ కొనసాగిస్తు న్నాయి.అటవీ ప్రాంతాలకు వెళ్ళకుండా టాంటాం ద్వారా అటవీ గ్రామాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు.

## ప్రజల వినతులు పరిష్కరించండి

### * బల్దియా కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే



**ప్రజాపక్షం/ఖిలావరంగల్:** నిబద్ధతతో ప్రజల వినతులపై స్పందించి పరిష్కరించాలని బల్దియా కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే అన్నారు. సోమవారం ప్రజా వాణి కార్యక్రమాన్ని పురస్కరించుకొని బల్దియా ప్రధాన కార్యాయలంలోని కౌన్సిల్ హాలులో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి కమిషనర్ హాజరై వివిధ సమస్యల పరిష్కారం కోసం ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తులను పరిష్కార నిమిత్తం ఆయా విభాగాల ఉన్నతాధికారులకు అందచేశారు. ఈ సందర్భంగా స్వీకరించిన ఫిర్యాదుల వివరాలు ఇంజినీరింగ్ 22, హెల్త్, సానిటేషన్ 7, ప్రాపర్టీ టాక్స్ 4, టౌన్ ప్లానింగ్ 31 మంచినీటి సరఫరా 10, హార్టికల్చర్ 2 మొత్తం 76 వినతులు స్వీకరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ జోనా, ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర, డిఎంహెచ్ఓ డాక్టర్ రాజారెడ్డి, హెచ్ఒలు రమేశ్, లక్ష్మారెడ్డి, ఇన్‌ఛార్జి సిపి రవీందర్ రాడేకర్, డిప్యూటీ కమిషనర్లు ప్రసన్నరాణి, రాజేశ్వర్, పన్నుల అధికారి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఇసుకను అక్రమంగా తరలిస్తున్న వారిపై కేసు నమోదు

**ప్రజాపక్షం/వాజేడు:** ట్రాక్టర్ల ద్వారా ఇసుకను అక్రమంగా తరలిస్తూన్నా వారిపై పేరూరు ఎస్సై గుర్రం కృష్ణ ప్రసాద్ సోమవారం కేసు నమోదు చేశారు. పేరూరు ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం ములుగు జిల్లా ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు ములుగు జిల్లా వాజేడు మండలం పేరూరు పోలీస్ సిబ్బందితో కలిసి అకస్మాత్తుగా తనిఖీ చేయగా భీమారం, రాంపూర్ ఇసుక క్వారీల నుండి ఎటువంటి అనుమతులు లేకుండా మూడు ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించి వారిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు. ఇకముందు ప్రభుత్వం నుండి అనుమతులు పొందకుండా ఇసుక అక్రమ రవాణాకు పాల్పడినట్లయితే వారిపై చట్టరీత్యా తకు కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## ఎమ్మెల్సీ ఎన్నికలలో కాంగ్రెస్‌దే విజయం

### హుజురాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్



**ప్రజాపక్షం/కమలాపూర్ :** పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్ రెడ్డి గెలుపు ఖాయమని హుజు రాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జీ వొడితల ప్రణవ్ ధీమా వ్యక్తం చేశారు. మండలంలోని కన్నూర్ గ్రామంలో జరగబోయే ఎమ్మెల్సీ ఎన్నికలలో అనుసరించాల్సిన వ్యూహాలపై కార్యకర్తలకు ప్రణవ్ దిశానిర్దేశం చేశారు. ప్రతి కార్యకర్త సమన్వయంతో పని చేసి విజయం దిశగా అడుగులు వేయాలని సూచించారు. కాంగ్రెస్ చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను వివరిస్తూ ప్రజల్లోకి వెళ్ళాలన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తూ ముందుకు వెళ్తున్నారని, ప్రతి కార్యకర్తకు తాను అండగా ఉంటానని, ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డి గెలుపు కోసం పనిచేసే ప్రతి కార్య కర్తకు గుర్తింపు లభిస్తుందన్నారు.కమలాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తవుటం ఝా న్సీ రాణి, కాంగ్రెస్ పార్టీ బ్లాక్ అధ్యక్షులు బాలసాని రమేష్ గౌడ్, పార్టీ సీనియర్ నాయకులు పుల్లూరి శ్రీనివాస్ రావు, నాంపల్లి ప్రభాకర్, మాజీ ఎంపిపి తడక రాణి శ్రీకాంత్, మాట్ల రమేష్, మాజీ సర్పంచ్ బొల్లం రాజిరెడ్డి, రవీందర్, మాజీ ఎంపిటిసి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

షో కేస్

# యువతరంగం

# చెదురుతున్న 'డాలర్ డ్రీమ్స్'





కారణాలు ఏవైనా, భారత యువత 'డాలర్ డ్రీమ్స్' చెదిరిపోతున్నాయి. అనధికారికంగా తమ దేశంలో ఉంటున్నారంటూ, 'అక్రమ వలసదారులు' ముద్రవేసిన అమెరికా మొదటి విడతలో 104 మందిని, రెండో విడతగా 117 మందిని భారత్‌కు పంపింది. మరో 112 మందితో మరో విమానం బయ లుదేరనుంది. కాగా, తమ దేశం నుంచి పంపుతున్న వాళ్లను ఉగ్రవాదులుగా... కరడుగట్టిన నేరస్థుల మాదిరి, కాళ్లూ చేతులకు బేడీలు వేసి మరీ విమానం ఎక్కించింది. ఇంతకంటే ఘోరం ఏముంటుంది! స్వదేశంలో చదివిన చదువుకు తగిన ఉద్యోగం దొరక్క ఏటా వేలాది మంది మన దేశం నుంచి అమెరికా తదితర దేశాలకు వెళ్లడం చూస్తునే ఉన్నాం. ఎన్నో కష్టాలను, సమస్యలను ఎదుర్కొని మరీ అమెరికా వెళ్లి, ఎంతోకొంత సంపాదించి, కుటుంబానికి అండగా నిలవాలనుకోవడమే యువతను పరుగులు తీయిస్తున్నది. అక్కడి పరిస్థితులు చాలామందిని బెంబేలెత్తిస్తున్నాయి. డాలర్ల సంపాదన మాట అటు ఉంచి, ఎప్పుడు ఏం జరుగుతుందోనన్న ఆందోళనతో బరోజులు గడపాల్సిన దుస్థితి ఏర్పడింది. 2047 నాటికి ప్రపంచ మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగల దేశంగా ఎదగాలని కలలు గంటున్న భారత్ వాస్తవాలను నిర్లక్ష్యం చేస్తున్నది. దశాబ్ద క్రితం ఏటా కోటి ఉద్యోగాల హామీనిచ్చిన బిజెపి ప్రభుత్వం, కేంద్రంలో వరుసగా మూడోసారి అధికారంలోకి వచ్చినప్పటికీ, ఆ ఊసే ఎత్తడం లేదు. నిరుద్యోగ సమస్య తాండవిస్తున్నది. యువత ఎక్కువగా ఉన్న మన దేశం, ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటున్న దాఖలాలు లేవు. దేశంలో 35 ఏండ్ల లోపు వయస్సు కలిగిన జనాభా 65 శాతం (దాదాపు 80 కోట్లు) ఉంది. మన దేశం ఆర్థిక, సాంస్కృతిక, రాజకీయ, సామాజిక రంగాల్లో సమగ్రాభివృద్ధి సాధించడానికి ఇంతకంటే మంచి తరుణం లేదు. సరికొత్త ఆలోచనలు, శక్తియుక్తులతో పాటు సృజన, విలక్షణ భావనలు పురుడు పోసుకోవడానికి యువత ప్రధాన పాత్రను నిర్వహించాల్సిన యువతను మోదీ సర్కారు ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యం చేస్తున్నదన్న విమర్శలు లేకపోలేదు. కార్పొరేట్ సంస్థలు కొనసాగించే శ్రమ దోపిడీకి కేంద్రం పరోక్షంగా మద్దతునిస్తున్నదని ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న ఆరోపణల్లో నిజం లేకపోలేదు. చదువుతో సంబంధం లేని కొలువులు చేస్తున్న వారు కోకొల్లలు. దిక్కులేక గిగ్ వర్కర్లుగా మారుతున్న వారు ఎందరో.. ఈ పరిస్థితుల్లో విదేశాలకు వెళ్లి, మెరుగైన ఉద్యోగం.. పనికి తగిన ఆదాయం పొందాలనుకోవడంలో తప్పు లేదు. ఆ అభిప్రాయమే యువతను విదేశాల బాట పట్టిస్తున్నది. సౌదీ లేదా దుబాయ్... ఆస్ట్రేలియా లేదా అమెరికా... కెనడా లేదా జర్మనీ... ఎక్కడైతేనేం? ప్రతిక్షణం భయంతో వణకడమే. కూలిన కలలను ఏరుకుంటూ రేపటి మార్పుకోసం ఎదురుచూడడమే. విదేశాలకు వెళ్లిన ప్రతి ఒక్కరి బతుకూ ఇదే విధంగా ఉందని చెప్పడానికి వీల్లేదు. కానీ, మధ్య, దిగువ తరగతులకు చెందిన వారిలో అత్యధిక శాతం మంది పరిస్థితి ఇదే. కనీసం ఇప్పటికైనా మోదీ సర్కారు ఈ సమస్యకు పరిష్కారాన్ని చూపాలి. తిరుగు టపాలో వస్తున్న యువతకు ఆసరాగా నిలవగాలి. యువతను పీడిస్తున్న ప్రధాన సమస్యల్లో ఒకటైన నిరుద్యోగం ఒకటి. దీనికి సమాధానం ఆలోచించాలి. దేశ జనాభాలో 36 శాతంగా ఉన్న 15 నుంచి 34 ఏండ్ల లోపు వయస్సు కలిగిన యువత విలువను గుర్తించకపోతే, దేశ బంగారు భవిష్యత్తుకు బాటలు ఎలా పడతాయి? ఐఐటి ముంబాయిలో చదివిన 36 శాతం యువతకు, వారి అర్హతకు తగిన ఉద్యోగాలు రాలేదని, ఉద్యోగాలకు ఎంపికైన కొందరు యువతకు రూ 10 లక్షల వార్షిక వేతనం మాత్రమే లభించిదని వచ్చిన వార్తలను ఈ సందర్భంగా ప్రస్తావించుకోవాలి. మన దేశంలో నిరుద్యోగ సమస్య ఎంత తీవ్రంగా ఉందో దీనిని బట్టి స్పష్టమవుతున్నది. దేశ శ్రామిక శక్తిలో 80 శాతం వరకు యువత మాత్రమే నిరుద్యోగులుగా లేదా అర్హతకు తగిన ఉద్యోగం దొరక్క సమస్యలకు ఎదుర్కొంటున్నారు. గత రెండు దశాబ్దాల్లో భారత్‌లో యువత నిరుద్యోగ రేటు 5.7 శాతం నుంచి 17.5 శాతానికి పెరిగింది. యువతలో 90 శాతం వరకు అసంఘటిత రంగాల్లోనే మగ్గుతున్నారు. అధిక శాతం శ్రామిక శక్తి వ్యవసాయ లేదా వ్యవసాయ అనుబంధ రంగాల్లో పని చేస్తున్నారు. ఈ వాస్తవాలు ప్రభుత్వానికి తెలియనివి కావు. కానీ, నిరుద్యోగ సమస్యను పరిష్కరించి, యువత విదేశాల బాట పట్టకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. అయితే, మోదీ సర్కారు స్పందిస్తుందా అన్నది అనుమానమే. ఎందుకంటే, దేశం మొత్తం అభివృద్ధి పథంలో పరుగులు తీయాలంటే 'గుజరాత్ మోడల్'ను అమలు చేయాలని ఊదరగొడుతున్న నేటి ప్రధాని, ఒకప్పటి ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మోదీ చెప్పింది వాస్తవం కాదని ప్రస్తుత పరిస్థితులు స్పష్టం చేస్తున్నాయి. ట్రంప్ ప్రభుత్వం బహిష్కరించిన వారిలో అత్యధిక శాతం మంది గుజరాతీయులే కావడమే ఇందుకు నిదర్శనం. 2023లో అమెరికాలో అక్రమంగా ఉంటున్న 67,391 మంది భారతీయుల్లో గుజరాతీలు 41,330 మంది ఉన్నారు. కేవలం అమెరికాకు మాత్రమేకాదు.. కెనడా, జర్మనీ, బ్రిటన్, ఆస్ట్రేలియా తదితర దేశాలకు భారీగానే వెళుతున్నారు. నిజంగానే గుజరాత్ అంత గొప్పగా అభివృద్ధి చెందితే, అవకాశాలు వెతుక్కుంటూ వస్తే, అక్కడి యువత విదేశాలకు వెళ్లాల్సిన అవసరం ఏమిటి? ఈ ప్రశ్నకు సమాధానం రాదు.. లేదు... గుజరాత్ అభివృద్ధి నేతిబీరకాయ చందమే. ఈ రాష్ట్రాన్ని చూపిస్తూ, దేశాన్ని అభివృద్ధి పరుస్తామని హామీ ఇస్తున్న మోదీ ప్రభుత్వం ముందుగా వాస్తవాలు గ్రహించాలి. యువశక్తిని సద్వినియోగం చేసుకోవడానికి సరైన ప్రణాళికలు రూపొందించి, అమలు చేయాలి. ప్రటనలతో లాభం లేదు... గట్టి ప్రయత్నం అత్యవసరం.

## ఉద్యోగ కల్పన ఎక్కడ?

ఏటా కోటి ఉద్యోగాల హామీ బాటలోనే నడుస్తున్నది గుజరాత్. అక్కడ ఉద్యోగావకాశాలు పెరగడం లేదు. దీనికితోడు ఉద్యోగాల స్థాయి కూడా మెరుగుపడడం లేదు. ఉద్యోగ మార్కెట్‌లో ఉద్యోగ భద్రత లేనివారే అత్యధిక శాతం మంది ఉన్నారు. 2022లో జరిగిన సర్వే ప్రకారం, గుజరాతీ కార్మికుల్లో 74 శాతం మందికి ఎలాంటి లిఖితపూర్వక ఒప్పందం లేదు. ఇలాంటి కార్మికులు కర్నాటకలో 41 శాతం, తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లో 53 శాతం, మధ్యప్రదేశ్‌లో 57 శాతం, హర్యానాలో 64 శాతం, మహారాష్ట్రంలో 65 శాతం, బిహార్‌లో 68 శాతం ఉన్నారు. ఈ రాష్ట్రాల్లోనూ ఉద్యోగ భద్రతలేని కార్మికులు ఎక్కువగానే ఉన్నారని గగ్గోలుపెట్టే బిజెపి, గుజరాత్ పరిస్థితిని మాత్రం ఎన్నడూ ప్రస్తావించదు. లిఖితపూర్వక పత్రాలు లేకపోవడంతో, ఎక్కువ మంది క్యాజువల్ లేబర్‌గానే పని చేస్తున్నారని స్పష్టమవుతున్నది. ఫలితంగా వేతనాలు చాలా తక్కువగా ఉంటాయి. 2024 ఏప్రిల్–జూన్ మధ్య, గుజరాత్‌లోని క్యాజువల్ లేబర్ ఆదాయం రోజుకు సగటున రూ. 375. జాతీయ సగటు (రూ. 433) కంటే తక్కువ. కేరళ (రూ. 836), తమిళనాడు (రూ. 584), హర్యానా (రూ. 486), పంజాబ్ (రూ. 449), కర్ణాటక (రూ. 447), రాజస్థాన్ (రూ. 442), ఉత్తరప్రదేశ్ (రూ. 432), బిహార్ (రూ. 426) వంటి రాష్ట్రాలతో పోల్చడానికి వీల్లేదు. క్యాజువల్ లేబర్‌కు వేతనాలు గుజరాత్ కంటే వెనుకబడిన ఏకైక రాష్ట్రం ఛత్తీస్‌గఢ్ (రూ. 295).

## మికైలా ఉల్మెర్




టీనేజ్‌లోనే అటు వ్యాపారం.. ఇటు సామాజిక సేవలో పేరు సంపాదించిన మికైలా ఉల్మెర్ యవతకు మార్గదర్శకురాలు. టెక్సాస్‌లోని హూస్టన్‌లో 2004 సెప్టెంబర్ 28న జన్మించిన ఉల్మెర్ స్థానిక సెయింట్ స్టీఫెన్స్ ఎపిస్కోపల్ స్కూల్‌లో చదువుకుతుంది. తల్లిదండ్రులు డి ఆంద్రా, థియో ఉల్మెర్ వ్యాపార విభాగంలో డిగ్రీలు పొందారు. 1940 దశకంలో ఉల్మెర్ ముత్తాత నిమ్మరసం అమ్మేవాడు. ఆయనను స్ఫూర్తిగా తీసుకొని ఉల్మెర్ కేవలం ఐదేళ్ల వయసులోనే, తన ఇంటి ముందు నిమ్మరసం అమ్మడం ప్రారంభించింది. వచ్చిన ఆదాయంలో పదోవంతు మొత్తాన్ని తేనెటీగల పెంపకందారులకు విరాళంగా ఇచ్చేది. తేనెటీగల సంఖ్య క్రమంగా తగ్గిపోతున్నదని, అందుకే, తాను ఈ నిర్ణయం తీసుకున్నానని అంత చిన్న వయసులోనే ఆమె చెప్పేది. అంతేకాదు, తెనెటీగల పెంపకందారుల నుంచి సేకరించిన తెనెను కూడా తాను తయారు చేసే నిమ్మరసంలో ఉపయోగించేది. ఆమె రెసిపీ అద్భుతంగా ఉండడంతో, ఎంతో మంది ఆమె తయారు చేసే నిమ్మరసం కోసం క్యూ కట్టేవారు. కేవలం ఐదేళ్ల అమ్మాయి కస్టమర్లతో మాట్లాడుతున్న తీరు, నిమ్మరం తయారీపై చూపుతున్న శ్రద్ధ, క్రమంగా వ్యాపారాన్ని పెంచుకుంటున్న వైనం స్థానిక పిజ్జా దుకాణందారుడిని ఆకర్షించింది. ఆ దుకాణం అమ్మకాలు పెంచాలని ఉల్మెర్ ప్రతిపాదన రావడంతో, ఆ బాధ్యతను ఒక సవాలుగా స్వీకరించింది. వ్యాపారాన్ని అభివృద్ధి చేసింది. స్థానిక పాఠశాలలో చదువు పూర్తి చేసుకొని, ఎమోరీ విశ్వవిద్యాలయంలో చేరింది. అక్కడ కూడా ఆమె తన వ్యాపార ఆలోచనలను అందరితో పంచుకునేది. ఉల్మెర్ 2015లో తన తండ్రితో కలిసి షార్క్ ట్యాంక్ అనే టెలివిజన్ షోలో కనిపించింది. అక్కడ ఆమె తన పెరుగుతున్న వ్యాపారానికి మద్దతుగా 60,000 డాలర్ల పెట్టుబడిని అందుకుంది. అదే సంవత్సరం ఆమెకు వైట్‌హౌస్‌లో, అప్పటి అమెరికా అధ్యక్షుడు బరాక్ ఒబామాను కలిసే అవకాశం లభించింది. యుఎస్ ఉమెన్ సమ్మిట్‌లో ఉల్మెర్‌ను కలిసిన ఒబామా ఆమెను 'అద్భుతమైన యువతి' అని ప్రశంసించారు. క్రమంగా తన వ్యాపారాన్ని విస్తరించుకుంటూపోతున్న ఉల్మెర్‌కు 2017లో, ఫుట్‌బాల్ క్రీడాకారుల కన్సార్టియం నుంచి పెట్టుబడిగా 8,00,000 డాలర్లు లభించాయి. ఆమె నిమ్మరసం 'మీ అండ్ ది బీస్' అమ్మకాలు అమెరికాలోని సుమారు 500 దుకాణాల్లో, సంవత్సరానికి 5,00,000 బాటిల్స్‌కు చేరాయి. తనంతరం దుకాణాల సంఖ్య 1,500లకు చేరింది. ఇంకాఇంకా విస్తరిస్తున్న వ్యాపార సామ్రాజ్యానికి రారాణిగా ఎదుగుతున్న ఉల్మెర్ రెండు పదుల వయసులోనే పేరుప్రఖ్యాతులు ఆర్జించింది. లక్షలాది మందికి మార్గదర్శకురాలైంది.

### యూత్ ఐకాన్స్

ఎంతో మంది యువతీయువకులు దేశ కీర్తిప్రతిష్టలను ఇనుమడింపచేశారు. చిన్న వయసులోనే అత్యున్నత శిఖరాలను అధిరోహించారు. యువతకు మార్గదర్శకులుగా నిలిచారు. అలాంటి అద్వితీయ ప్రతిభావంతుల గురించి క్లుప్తంగా తెలుసుకుందాం..

# మిర్చి పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి

సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మొహమ్మద్ మౌలానా



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** మిర్చి పంటలకు గిట్టుబాటు ధరను కల్పించడంతో పాటు బోర్డును ఏర్పాటు చేయాలని సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మొహమ్మద్ మౌలానా ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. సోమవారం ఖమ్మం రూరల్ మండలంలోని ఏదులాపురం మున్సిపాలిటీపరిధిలో గల ముత్తగూడెంలో రైతు సంఘం ఆధ్వర్యంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మౌలానా మాట్లాడుతూ.. వడ్డీలు తెచ్చి పెట్టుబడి పెట్టి ఆరుగాలం కష్టపడి పంట పండించిన రైతు నష్టపోతున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. కానీ ఆ రైతు కష్టాన్ని వ్యాపారులు, అధికారులు సొమ్ము చేసుకుంటున్నారని దుయ్యబట్టారు. తక్షణమే ప్రభుత్వాలు గిట్టుబాటు ధరకు కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర రైతు సంఘం కార్యవర్గ సభ్యులు మిడకంటి చిన్న వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. గత సంవత్సరంలో క్వింటా ధర రూ.25 వేలు పలికినప్పుడు నేడు 9,10,11వేలకు పడిపోవడం ఏంటని ప్రశ్నించారు. ఇది అధికారులు, దళారులు కలిసి చేస్తున్న కుట్రగా కనిపిస్తుందన్నారు. ఈ వ్యవహారాలను నిరసిస్తూ మిర్చికి గిట్టుబాటు ధర కల్పించాలని నేటి ఉదయం 10 గంటలకు ఖమ్మంలోని మిర్చి మార్కెట్ వద్ద సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. రైతులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు బానోత్ రాంకోటి, ఎడ్లపల్లి శంకరయ్య, సిపిఐ మండల కార్యదర్శి పుచ్చకాయల సుధాకర్, రైతు సంఘం ఖమ్మంరూరల్ మండల అధ్యక్షులు మామిడి శంకర్‌రెడ్డి, వెన్నం భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## రాములు ఆశయ సాధనకు కృషి : సిపిఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** పుట్టల రాములు మృతి పార్టీకి తీరని లోటని ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం అన్నారు. సిపిఐ వేములపల్లి గ్రామ కార్యదర్శి పుట్టల రాములు శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తలకు తీవ్ర గాయాలై మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. రాములు మృతి విషయాన్ని తెలుసుకోని సోమవారం ఆయన భౌతికఖాయాన్ని సందర్శించి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేసి మాట్లాడారు. రాములు మృతి బాధాకరమన్నారు. గ్రామ కార్యదర్శిగా పనిచేస్తూ పార్టీ అభివృద్ధికి,పేద వర్గాల సాధనకు కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. సంతాపం తెలిపిన వారిలో సీపీఐ జిల్లా కార్యవరగ సభ్యుడు బంటు వెంకటేశ్వర్లు, గీత పనివారాల సంఘం జిల్లా కార్యదర్శి పబ్బు వీరస్వామి, కార్యదర్శిలు మహమ్మద్ సయ్యద్, ధీరావత్ లింగా నాయక్, జిల్లా యాదగిరి, దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు వల్లంపట్ల వెంకన్న, పరమేష్ తదితరులు ఉన్నారు.

'నేడు' కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక బడ్జెట్‌ను నిరసిస్తూ

# వామపక్షాల నిరసన

### సిపిఐ జిల్లా కార్యదర్శి మేకల రవి




**ప్రజాపక్షం/ వరంగల్ ప్రతినిధి:** కేంద్రంలోని మోదీ ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను నిరసిస్తూ ఈనెల 18,19 తేదీలలో దేశవ్యాప్తంగా ఆందోళన చేపట్టాలని సిపిఐ జిల్లా కార్యదర్శి మేకల రవి, సహాయ కార్యదర్శి పనాస ప్రసాద్, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నలిగంటి రత్నమాల, ఎంసిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి నర్రా ప్రతాప్, సిపిఐఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి అక్కినపల్లి యాదగిరి, ఆర్ ఎస్ పి జిల్లా కార్యదర్శి వల్లందాస్ కుమార్, ఎస్‌యుసిఐ( సి) నాయకులు సత్యనారాయణలు పిలుపునిచ్చారు. కమ్యూనిస్టు పార్టీల పిలుపుమేరకు వరంగల్ జిల్లా కమ్యూనిస్టు, విప్లవ పార్టీల సమావేశం సోమవారం శివనగర్ సిపిఐ తమర భవన్‌లో న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు రాచర్ల బాలరాజు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో మాదిరిగానే మోదీ ప్రభుత్వం ప్రజల అవసరాలకు అనుగుణంగా బడ్జెట్లో కేటాయింపులు చేయకుండా ఇంకా తగ్గించి సంపన్నులకు రాయితీలు కల్పించిందన్నారు. ఇది ప్రజా వ్యతిరేక బడ్జెట్ అని సమావేశంలో పాల్గొన్న నాయకులు విమర్శించారన్నారు. వ్యవసాయ ఉత్పత్తులకు మద్దతు ధర లేదు, భారత ప్రభుత్వ రంగ సంస్థ ఎల్ఐసి పూర్తిగా ప్రైవేటీకరణ చేయడం, గ్రామీణ ఉపాధి హామీ పథకం కు నిధులు తగ్గించడం, వైద్య, విద్యా రంగాలకు రంగాలను నిర్లక్ష్యం చేయడం ప్రజా పంపిణీ వ్యవస్థకు సబ్సిడీలు తగ్గించడం మొదలగు ప్రజా ద్రోహ విధానాలను మోదీ ప్రభుత్వం బడ్జెట్‌లో ప్రవేశపెట్టిందని ఆరోపించారు. దేశంలోని 200 మంది శతకోటీశ్వరులపై సంపద పన్ను ప్రవేశపెట్టాలని, కార్పొరేట్ సంస్థలపై పన్ను పెంచాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మోదీ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలు నిరసిస్తూ ఈ నెల 19వ తేదీన వరంగల్ హెడ్ పోస్ట్ ఆఫీస్ సెంటర్లో ఉదయం 11 గంటలకు జరిగే నిరసన కార్యక్రమంను జయప్రదం చేయాలని కోరారు.

**నిర్మల్ టౌన్ :**
సిపిఐ జిల్లా కౌన్సిల్ సమావేశం ఇంద్రనగర్ కాలనీలోని సిపిఐ కార్యాలయంలో ఎస్.కైలాష్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ఎస్.విలాస్ సి పిఐ జిల్లా కార్యదర్శి ముఖ్య అతిథిగా హాజరైనారు. ఎల్ ఆర్.ఉపాలి. జిల్లా సహాయ కార్యదర్శి హాజరైనారు. ఈ సందర్భంగా ఎస్.విలాస్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వ్య తిరేక బ డ్జెట్‌ను నిరసిస్తూ ఈ నెల 18,19న నిరసన కార్యక్రమం విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ నెల 27న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికలలో పూట్కూర్ నరేందర్ రెడ్డి అల్ఫోర్స్‌కి సిపిఐ సంపూర్ణ మద్దతు తెలుపుతుందని వారిని అత్యధిగా మెజారిటీతో గెలిపించాలని అన్నారు. పార్టీ సభ్యత్వంకు నిర్మల్ జిల్లాలో బాగా ఆదరిస్తున్నారని కావున ఈ నెల 28లోగా అందించాలని అన్నారు. ఇందిరమ్మ ఇళ్లలో అవకతవకలు జరుగుచున్నవని దీనికి కడెం, దస్తూరాబాద్ మండలలో ధర్నా నిరసన కార్యక్రమాలు చేపటడతమని అన్నారు. స్కీమ్ వర్కర్స్ నీ ప్రభుత్వం ఉద్యోగులుగా గుర్తించాలని అన్నారు. సివిల్ సప్లై హమాలీలకు పెరిగిన కూలీ రెట్ల బకాయిలు వెంటనే చెల్లించాలని అన్నారు. భవన నిర్మాణ కార్మికులకు పెన్షన్ రూ.7500/ చెల్లించాలని, వలస కార్మికులు లోకల్ కార్మికులతో కలసి యూనియన్ సభ్యత్వం చెల్లించి పని చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో భూక్యా రమేష్, దస్తూరాబాద్, లక్మణ్, సోమేష్ బైంసా, బాదర్ ముధోల్‌లు పాల్గొన్నారు.




## ఉచిత వైద్య శిబిరం

**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో ఎఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో కరీంనగర్ మెడికవర్ హాస్పిటల్ వారి సౌజన్యంతో ప్రజల సౌకర్యార్థం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం జరిగిందని ఎఐఎస్‌ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం అన్నారు. ఈ కార్యక్రమానికి సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు గోశిక మోహన్, గౌతమ్ గోవర్ధన్, నగర కార్యదర్శి కే కనకరాజులు ముఖ్య ఆదిలా హాజరైనారు. ఈ సందర్భంగా ఎఐఎస్‌ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం మాట్లాడుతూ అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఎఐఎస్‌ఎఫ్) విద్యారంగ సమస్యల పరిష్కారంతోపాటు, ప్రజల ఆరోగ్య పరిస్థితులను కూడా తెలుసుకొని, ప్రజల సౌకర్యార్థం ఉచిత వైద్య శిబిరంను ఏర్పాటు చేసి, అనుభవజ్ఞులైన డాక్టర్ల, బృందంతో వైద్యం అందించడం జరిగిందని ఆయన అన్నారు. అదేవిధంగా అధునాతన పరికరాలతో బిపి, షుగర్, ఇసిజి పరీక్షలు కూడా చేయడం జరిగిందని ఆయన అన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు శనిగారపు చంద్రశేఖర్, మార్కపూరి సూర్య, ఆసాల రమ, శనిగారపు తిరుమల, అబ్దుల్ కరీం,ఎజ్జ రాజయ్య, ఎఐఎస్‌ఎఫ్ నగర&అధ్యక్ష కార్యదర్శులు ఎల్కపల్లి సురేష్, మాతంగి సాగర్, మెడికవర్ హాస్పిటల్ డాక్టర్ వంశీ ఎంబిబిఎస్, బృందం శ్రీకాంత్ ,సరస్వతి ,శిరీష, స్నేహ తదితరులు పాల్గొన్నారు.




## రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్‌కు ప్రతిష్టాత్మక 'స్కోచ్ సిల్వర్' అవార్డు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ కు జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మక స్కోచ్ సిల్వర్ అవార్డు రావడం పట్ల వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర గిడ్డంగుల ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఎండి కొర్ర లక్ష్మి , అధికారులను మంత్రి తుమ్మల అభినందించారు. రాష్ట్రంలో గిడ్డంగుల కార్పొరేషన్ పరిధిలో ఉన్న గిడ్డంగుల నిర్వహణ వ్యవస్థను పూర్తిస్థాయిలో డిజిటలైజేషన్ చేసినందుకు గాను 2024 స్కోచ్ అవార్డు లభించింది. న్యూఢిల్లీలో ప్రతిష్టాత్మక స్కోచ్ సిల్వర్ అవార్డును అందుకున్నారు. డిజిటలైజేషన్ ద్వారా గిడ్డంగులలో ఖాళీ సామర్థ్యం గుర్తించడంలో, గిడ్డంగుల కేటాయింపు, రిజర్వేషన్లలో, గేట్ ఇన్, గేట్ అవుట్ రశీదులు ఇవ్వడంలో, ఇన్వాయిస్‌లను జనరేట్ చేయడంలో ఎలాంటి జాప్యంలేకుండా ఎప్పటికప్పుడు పనిచేయడానికి వీలుకలిగిందని మంత్రి అన్నారు. దీనివల్ల సంస్థ పనితీరుని మెరుగుపడడంతో పాటు వేగంగా పనిచేయడానికి వీలు కలిగిందన్నారు.

## మన్సూరాబాద్ డివిజన్ కార్యదర్శిగా సుధాకర్ ఏకగ్రీవంగా ఎన్నిక



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్:** భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) మన్సూరాబద్ డివిజన్ కార్యదర్శిగా కందుల సుధాకర్‌ను ఏకగ్రీవంగా ఎన్నికున్నారు. సోమవారం ఎల్‌బి నగర్ నియోజకవర్గం పార్టీ కౌన్సిల్ సమావేశం ఎస్ఏ డాంగే భవనం నాగోల్‌లో సిపిఐ సరూర్ నగర్ మం డల కార్యదర్శి బాత రాజు నరసింహ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో డివిజన్ కార్యదర్శులను ఎన్నుకోవడానికి సమావేశం ము ఖ్య ఉద్దేశం అని ఆయన తెలిపారు. పార్టీ కోసం ప్రజలకు అనునిత్యం శ్రమించే వారికి పార్టీలో గుర్తింపు ఉంటుందన్నారు. తన ఎన్నికకు సహకరించిన సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆం దోజు రవీంద్ర చారి, ఎల్‌బి నగర్ నియోజకవర్గ కార్యదర్శి సామిడి శేఖర్‌రెడ్డి వారి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## మెనూ ప్రకారం భోజనం పెట్టాలి

కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి:** నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ ప్రతి రోజు కామన్ డైట్ మెనూ ప్రకారం బోజనాలు పెట్టాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. తంగళ్లపల్లిలోని సిరిసిల్ల మైనార్టీ సంక్షేమ రెసిడెన్షియల్ విద్యాలయాన్ని సోమవారం కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వంటగదిలోని బియ్యం, కూరగాయలు, పండ్లు, కోడి గుడ్లు, ఇతర ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. ఆర్ఓ ప్లాంట్ పరిశీలించి స్వయంగా కలెక్టర్ ఆ నీటిని తాగి నాణ్యతను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ కామన్ మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందించాలని సూచించారు. పబ్లిక్ పరీక్షల దృష్ట్యా విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి నిత్యం చదివించాలని ఆదేశించారు. ఉత్తమ ఫలితాలు సాధించేలా తీర్చిదిద్దాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రూసా ఫాతిమా, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ నిర్మాణాలపై ప్రజావాణిలో ఫిర్యాదు




**ప్రజాపక్షం/చందుర్తి:** మండల కేంద్రంలోని అక్రమ నిర్మాణాలపై మండల కేంద్రానికి చెందిన కోన శ్రీనివాస్ అనే వ్యక్తి సోమవారం ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ కి ఫిర్యాదు చేశారు.మండల కేంద్రానికి చెందిన ఒకరు గ్రామ పంచాయితి నుండి ఇంటి నిర్మాణానికి అనుమతి తీసుకొని స్థానిక పీహెచ్‌సి కి ఎదురుగా ఉన్న రోడ్డును ఆక్రమించి రేకులు నిర్మించారని దాని వల్ల ప్రభుత్వ బోరు వద్ద నీరు పట్టుకునే పరిస్థితి లేదని అన్నారు. అక్రమ నిర్మాణం వల్ల ప్రజలు రోడ్డు పై నడవలేని పరిస్థితి ఏర్పడిందని దీని పై చర్యలు తీసుకోవాలని స్థానిక అధికారులను కోరిన పట్టించుకోలేదని వాపోయారు. గ్రామ పంచాయితి పాలకవర్గం లేకపోవడం వల్ల ఈ పరిస్థితి దాపురించిందని,గ్రామంలో అక్రమ నిర్మాణాలు చేసిన వారి వద్ద డబ్బులు తీసుకొని గ్రామ పంచాయితి సెక్రటరీ,ఎంపిడిఓ వారికి అనుకులంగా వ్యవహరిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.ఈ విషయం పై పూర్తి స్థాయిలో విచారణ చేసి గ్రామంలో అక్రమ నిర్మాణాలు చేసిన వారిపై, వారికి సహకరించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

## పోలీస్ శాఖ గౌరవాన్ని పెంచే విధంగా పనిచేయాలి




**ప్రజాపక్షం/జగిత్యాల ప్రతినిధి :** పోలీస్ శాఖ గౌరవాన్ని పెంచే విధంగా ప్రతి పోలీస్ పనిచేయాలని జగిత్యాల ఎస్పి అశోక్ కుమార్ అన్నారు. జిల్లా ఆర్మ్డ్ రిజర్వు విభాగంలో హెడ్ కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్న సయ్యద్ తకి ఉద్దీన్ కి హెడ్ కానిస్టేబుల్ నుండి ఎస్సైగా పదోన్నతి పొందిన సందర్భంగా సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ అశోక్ కుమార్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీ ఆయనకు పదోన్నతి చిహ్నం స్టార్‌ను అలంకరించి శుభాకాంక్షలు తెలిపారు. పోలీస్ శాఖలో పదోన్నతులు మరింత బాధ్యతను పెంచుతాయని అన్నారు. పదోన్నతులు పొందిన మీరు రెట్టింపు ఉత్సాహంతో ప్రజలకు సేవలు అందించాలని ఎస్పీ కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పి భీమ్ రావు, రిజర్వ్ ఇన్స్పెక్టర్ కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

## 71కేజీల భారీ కేక్ కట్ చేసిన మాజీ మంత్రి గంగుల




**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి:** తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు 71వ జన్మదినం సందర్భంగా కరీంనగర్‌లోని తెలంగాణ చౌక్‌లో నగర బిఆర్ఎస్ అధ్యక్షుడు చల్ల హరిశంకర్ ఆధ్వర్యంలో 71 కేజీల భారీ కేక్ కట్ చేశారు. మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ హాజరై మిఠాయిలు పంపిణీ చేసి పూలు, పండ్ల మొక్కలు పంపిణీ చేశారు. కెసిఆర్ కారణ జన్ముడని, ఆయన నూరేళ్లు నిండుగా జీవించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పొన్నం అనిల్ కుమార్ గౌడ్, కొత్తపెల్లి మాజీ మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రెడ్డవేణి మధు, కొత్తపల్లి మండలం మాజీ ఎంపిపి పిల్లి మహేష్, కొత్తపల్లి బిఆర్ఎస్ అధ్యక్షుడు కాసారం శ్రీనివాస్, బిఆర్ఎస్ నగర ప్రధాన కార్యదర్శి గడ్డం ప్రశాంత్ రెడ్డి, మైనార్టీ అధ్యక్షుడు సౌకత్, బిఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు దీకొండ కుల్దీప్, బిఆర్ఎస్ నియోజకవర్గ యూత్ ప్రధాన కార్యదర్శి గంగాధర చందు, నాయకులు సాయికృష్ణ తదితరులున్నారు.

## నదిలో దూకి మహిళ ఆత్మహత్యా యత్నం



**ప్రజాపక్షం/గోదావరిఖని :** గోదావరిఖని సమీప గంగానగర్ ప్రైవంతెన నుంచి స్థానిక ముస్త్యాల గ్రామానికి చెందిన లక్ష్మీ గోదావరినదిలోకి దూకి ఆత్మహత్య యత్నానికి సోమవారం సాయంత్రం పాల్పడింది. అయితే నదిలో నీరు లేకపోవడంతో ఖాళీ ప్రదేశంలో ఇసుకలో కింద పడింది. తీవ్రగాయాలైన లక్ష్మీ ని చికిత్సకై గోదావరిఖని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆత్మహత్య యత్నానికి గల కారణాలు తెలియరాలేదు. పోలీసులు విచారణ చేపట్టారు.

# ఉద్యమకారుల సంక్షేమానికి కృషి చేయండి



**ప్రజాపక్షం/పెద్దపల్లిరూరల్:** పెద్దపల్లి జిల్లా కేంద్రానికి విచ్చేసిన రాష్ట్ర ఐటీ, పరిశ్రమల, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుదిళ్ళ శ్రీధర్ బాబు పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయ రమణ రావు, రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్సీ బానుప్రసాద్ లను ఎమ్మెల్సీ అభ్యర్థి అల్ఫోరెస్ నరేందర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి బొకే అందజేసి తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమానికి కృషి చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కన్వీనర్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు గుండేటి ఐలయ్య యాదవ్ అందజేశారు. అనంతరం మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం గల్లీ నుండి ఢిల్లీ రాక తొలి , మలిదశ ఉద్యమంలో పాల్గొన్న తెలంగాణ ఉద్యమకారులు అందరికీ ప్రజా కాంగ్రెస్ ప్రభుత్వం తగిన న్యాయం చేయాలని ఎన్నికల్లో ఇచ్చిన హామీ 250 గజాల ఇంటి స్థలాన్ని అందరికీ వర్తింపచేయాలనికేవలం ఎఫ్ఐఆర్ ఉన్న వాళ్ళకి కాకుండా ఉద్యమాన్ని ఉవ్వెత్తిన లేపి నష్టపోయిన ఉద్యమకారులను కూడా గుర్తించి అందరికీ న్యాయం చేయాలని కోరారు. తెలంగాణ రాష్ట్రం వస్తేనే మన నీళ్లు , నిధులు, నియామకాలు మనకు వస్తాయని తమ జీవితాలను త్యాగం చేసి ఉద్యమంలో 13 ఏళ్లు అన్ని పక్కన పెట్టి కేవలం తెలంగాణ రాష్ట్రం కోసమే పని చేశామని అన్ని రకాలుగా నష్టపోయి జీవితాలే భారంగా ఉద్యమకారులు అందరు బతుకుతున్నారని వారి బ్రతుకులు చూసిన ఏఐసీసీ అగ్ర నాయకురాలు తెలంగాణ ఇచ్చిన తల్లి సోనియా గాంధీ మేనిఫెస్టోలో ఉద్యమకారుల గురించి ఆలోచించి వారికి భూమి, పెన్షన్ ఇస్తామని చెప్పడం హర్షణీయమని, ఉద్యమకారులను గుర్తించడానికి ప్రభుత్వం ఒక కమిటీ వేసి ప్రభుత్వం నుండి గుర్తింపు కార్డులు ఇవ్వాలని, ఉద్యమకారుల పూర్తి సంపూర్ణ మద్దతు కాంగ్రెస్ పార్టీకే ఉంటుందని అసెంబ్లీ ఎన్నికల సమయంలో వేల మంది ఉద్యమకారులు కాంగ్రెస్ పార్టీలో చేరి పార్టీని అధికారంలో తీసుకురావడానికి కృషి చేశారని గుర్తు చేశారు. ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని అన్నారు ప్రజా కాంగ్రెస్ ప్రభుత్వం, సిఎం రేవంత్ రెడ్డి మీదనే ఉద్యమకారులు అందరూ ఆశలు పెట్టుకున్నారని వెంటనే ప్రభుత్వం ఉద్యమకారుల గురించి ఆలోచించి వారికి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు నూనె రాజేశం, ఉత్తర తెలంగాణ కన్వీనర్ బత్తుల శంకర్, రాష్ట్ర కార్యదర్శి కందుల సదాశివ్, కాసరపు ఐలయ్య గౌడ్, బోగె సురేష్, జనగామ రవి, గోగుల రాజిరెడ్డి, దబ్బట చంద్రకళ, అట్టి పెల్లి రాజు, గాజుల శివ శంకర్, జంగెం కొమురయ్య, కొడూరి రాజవీర్ గౌడ్ , జిన్క సంతోష్, తొట్లా రాములు, అమ్ముల మల్లయ్య , పత్తి తిరుపతి రెడ్డి ,ఓదెల రాజు, రౌతు సందీప్, కంకటి శ్రీనివాస్, పెంచాల మల్లయ్య, దామసది తదితరులు పాల్గొన్నారు.

## పిఎసిఎస్ పదవీ కాలం పొడిగింపుపై హర్షం



**ప్రజాపక్షం/ధర్మపురి:** ప్రాథమిక వ్యవసాయ సాహకార సంఘాల (పిఎసిఎస్) ల పదవీ కాలాన్ని ప్రభుత్వం ఆరు నెలల పొడగించడంపై పాలకవర్గాలు హర్షం వ్యక్తం చేశారు. ధర్మపురితో పాటు నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన సహకార సంఘాల పాలక వర్గ సభ్యులు సోమవారం ధర్మపురిలో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం పదవీ కాలం పొడగింపుపై చొరవ తీసుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సొల్లనరేష్, సత్యనారాయణ, రత్నాకర్, ఉన్నారు.

## బీరప్ప కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న ప్రభుత్వ విప్



**ప్రజాపక్షం/చందురి:** మండలంలోని ఆశిరెడ్డిపల్లి అనుబంధ గ్రామం అయిన గొల్లపల్లి లో నిర్వహిస్తున్న బీరప్ప కమరాతి కళ్యాణ మహోత్సవంలో రాష్ట్ర ప్రభుత్వ విప్,వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ సోమవారం పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి బీర్ల పూజరుల ఆశీర్వాదాలు తీసుకున్నారు.గొల్ల కురుమల ఆరాధ్య దైవం అయిన బీరప్ప కమరాతి కళ్యాణ మహోత్సవ కార్యక్రమం ప్రతి 5 సంవత్సరాలకు ఒకసారి జరుపుకోవడం ఆనవాయితిగా వస్తోంది. అందులో భాగంగా ఆదివారం స్వామి వారికి బోనాలు సమర్పించగా సోమవారం యాటలు సమర్పించుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్‌పిటిసీ నాగం కుమార్, బొజ్జ మల్లేశం, రామస్వామి, గొట్టె ప్రభాకర్ పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించాలి

ఎన్నికల అధికారి,కలెక్టర్ మనుచౌదరి



**ప్రజాపక్షం/సిద్దిపేట ప్రతినిధి:** పట్టభద్రులు,ఉపాధ్యాయ శాసనమండలి ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించేలా అధికారులు సిద్ధం కావాలని జిల్లా కలెక్టర మనుచౌదరి అన్నారు. ఈనె 27న జరుగనున్న కరీంనగర్, మెదక్,నిజమాబాద్,ఆదిలాబాద్ ఉపాధ్యాయ, పట్టభద్రులు, నల్గొండ, ఖమ్మం, వరంగల్ ఉపాధ్యాయ శాసనమండలి ఎన్నికల పోలింగ్ నిర్వహణపై ఎన్నికల ప్రిసిడింగ్ అధికారులకు, అసిస్టెంట్ ప్రిసిడింగ్ అధికారులకు సోమవారం కలెక్టరేట్‌లో కాన్ఫరెన్స్‌హాల్‌లో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మనుచౌదరి మాట్లాడుతూ ఈనెల 27న జరుగనున్న ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు ఎన్నికల సంఘం నిబంధనల మేరకు సమర్థవంతంగా నిర్వహించేలా ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులకు ఎన్నికల మార్గదర్శకలకు సంపూర్ణంగా తెలుసుకోవాలన్నారు. ముఖ్యంగా ఎన్నికల్లో ఓటు వేసేవారందరు చదువుకున్న వారు కాబట్టి బ్యాలెట్ పేపర్ ద్వారా ఏల ఓటు వేయాలో వారికి పూర్తి అవగాహన ఉన్న కూడ ఓటు వేసే సమయంలో ఏలాంటి ఇబ్బందులు కలుగకుండ ప్రిసిడింగ్ అధికారులు , అసిస్టెంట్ ప్రిసిడింగ్ అధికారులు జాగ్రత్త పడాలన్నారు. ఈసమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్, మాస్టర్ ట్రైనర్స్ ఎన్నికల పిఓలు. ఓపిఓలు తదితరులు పాల్గొన్నారు.

**ఎంఎన్‌ఆర్ఇజిస్‌లో చేపట్టిన అభివృద్ధి పనుల నిర్మాణం వేగవంతం చేయాలి**

ఎంఎన్‌ఆర్ఇజిస్‌లో చేపట్టిన సిసి రోడ్లు, డ్రైనేజీలు గ్రామపంచాయతీ భవనాలు తదితర నిర్మాణ పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ మనుచౌదరి పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్‌హాల్ సిసిరోడ్లు డ్రైనేజీలు, గ్రామపంచాయతీ భవనాలు, అంగన్‌వాడి తదిరత నిర్మాణ పనుల ప్రగతిపై మండలాల వారిగా జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్, డిఆర్‌డిఎ పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షించారు. ఈకార్యక్రమంలో డిఆర్‌డిఎ జయదేవ్ ఆర్య, పంచాయతీరాజ్ శ్రీనివాస్‌రెడ్డి, చిరంజీవి, డిఈలు అన్ని మండలాల ఎఈలు పాల్గొన్నారు.

## ప్రతి విద్యార్థి హాజరు ఎఫ్‌ఆర్‌ఎస్ ద్వారా నమోదు

కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి:** ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ప్రతి విద్యార్థి హాజరు ఎఫ్.ఆర్.ఎస్ ద్వారా కట్టుదిట్టంగా నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పెద్దపల్లి పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత బాలికల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో బాలికల హాజరు శాతం, మధ్యాహ్నం భోజన పథకం అమలు, విద్యార్థినులకు అందుతున్న విద్య బోధన తదితర అంశాలను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు, పనిచేసే ఉపాధ్యాయుల హాజరు ఎఫ్‌ఆర్‌ఎస్ ద్వారా నమోదు చేయాలని, హాజరు వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కలెక్టర్ తెలిపారు. భవిష్యత్తులో మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించి బిల్లులు త్వరగా జనరేట్ చేసి చెల్లింపులు జరిపేందుకు కూడా ఎఫ్‌ఆర్‌ఎస్ హాజరు పరిగణలోకి తీసుకునే అవకాశం ఉందని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధన అందాలని, ప్రతి విద్యార్థిని పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, పాఠ్యాంశాలు విద్యార్థినులకు అర్థమయ్యే విధంగా బోధన జరగాలని అన్నారు. 10వ తరగతి పాఠశాల విద్యార్థినిలు మంచి మార్కులతో ప్రత్యేక తరగతులు నిర్వహించాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ తనిఖీల్లో జిల్లా కలెక్టర్ వెంట జిల్లా విద్యాశాఖ అధికారి డి. మాధవి, ఎంఈఓ సురేందర్, ప్రధానోపాధ్యాయురాలు అరుణ, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రాణాలు పోయినా 'ఫ్లై ఓవర్' వద్దు

రంగధాంపల్లి గ్రామస్తుల నిరసన...



**ప్రజాపక్షం/సిద్దిపేట అర్బన్:** మెదక్ నుండి ఎల్కతుర్తి వరకు నిర్మిస్తున్న 765డిజి జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా అమరవీరుల స్తూపం వద్ద రంగధాంపల్లి నుండి బ్లాక్ ఆఫీస్ వరకు ఫ్లై ఓవర్ నిర్మిస్తే రంగధాంపల్లి రెండుగా చీలి గ్రామ ఉనికికే ప్రమాదమని, ఆ రహదారి వెంట గ్రామస్తులం చిన్న చిన్న వ్యాపారాలు పెట్టుకొని జీవిస్తున్నామని మా బతుకులను ఆగం చేయొద్దని గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. సోమవారం రంగధాంపల్లి చౌరస్తాలో గ్రామ ప్రజలు టెంట్ వేసుకొని నిరసన బాట పట్టారు. ఈ సందర్భంగా గ్రామస్తులు వంగ నాగిరెడ్డి,కనకయ్య,ఐలయ్య, తిరుమల్‌రెడ్డిలు మాట్లాడుతూ మా ప్రాణాలు పోయినా ఫ్లై ఓవర్ వద్దని, గతంలో రాజీవ్ రహదారి, రైల్వే లైన్, కాళేశ్వరం కాలువల కోరకు అనేక ఎకరాల భూములను కోల్పోయినామని, గ్రామ వ్యవసాయ భూమిలో సగానికి పైగా భూములను కోల్పోయి భూబాధితులమై, ఉపాధిని కోల్పోయామని తెలిపారు. మిగిలిన కొద్ది భూమిని అమ్ముకొని రహదారి వెంట సెటర్లు నిర్మాణం చేసుకొని చిన్న వ్యాపారం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నామని, ఫ్లై ఓవర్ నిర్మిస్తే నిర్మాణాలు కోల్పోయి మా కుటుంబాలు ఆగమవుతాయని ఆవేధన వ్యక్తం చేశారు. ఫ్లై ఓవర్ డిజైన్‌ను మార్చి రద్దీ ఎక్కువగా ఉండే హైదరాబాద్,కరీంనగర్ రాజీవ్ రహదారిపై నిర్మాణం చేపట్టాలన్నారు. అధికారులు నిత్యం రద్దీగా ఉండే రాజీవ్ రహదారిపై ఫ్లై ఓవర్ నిర్మాణం చేపట్టి ప్రమాదాలను అరికట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో రంగధాంపల్లి శ్రీను, పరుశరాం, ప్రశాంత్, పద్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఫిర్యాదుదారుల వద్దకు వచ్చి ఫిర్యాదులు స్వీకరించిన సిపి

**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి:** సోమవారం రోజున రామగుండం పోలీస్ కమీషనర్ ప్రధాన కార్యాలయంలో రామగుండం పోలీస్ కమీషనర్ ఎం. శ్రీనివాస్ ఐపిఎస్., ఐజి నేరుగా ఫిర్యాదుదారుల వద్దకు వచ్చి వారి సమస్యలను విని వాటిని చట్టప్రకారం పరిష్కరించాల్సిందిగా సంబందిత అధికారులను ఆదేశించారు.రామగుండం కమీషనరేట్ పరిధిలోనీ వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారుల నుండి దరఖాస్తు లను స్వీకరించి వాటిని తక్షణ పరిష్కారం కోసం సంబంధిత స్టేషన్ ల యొక్క ఎస్ఐ మరియు సిఐలకు ఫోన్ ద్వారా మాట్లాడి సమస్య స్థితిని మరియు పరిష్కారానికి సూచనలు చేయడం జరిగింది. ప్రజలు నిర్భయంగా, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా ఎలాంటి, పైరవీలు లేకుండా స్వచ్ఛందంగా పోలీసు సేవల్ని వినియోగించుకుంటూ, వారి వారి సమస్యలు చట్ట ప్రకారం పరిష్కరించుకొనేల, పోలీసులు ప్రజలకు మరింత దగ్గరయ్యేలా, శాంతి భద్రతలు పరిరక్షిస్తూ ముందుకు సాగడమే లక్ష్యంగా రామగుండం కమీషనరేట్ పోలీస్ శాఖ పని చేస్తుందని రామగుండం పోలీస్ కమీషనర్ తెలియజేశారు.



## ఇసుక అక్రమ రవాణాచేస్తే కఠిన చర్యలు


కలెక్టర్ సత్య ప్రసాద్



**ప్రజాపక్షం/జగిత్యాలప్రతినిధి/కోరుట్ల:** ఇసుక అక్రమంగా తవ్వకాలు, రవాణాపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం జగిత్యాల జిల్లాలోని కథలాపూర్ మండలం సిరికొండ, కోరుట్ల మండలం పైడిమడుగు గ్రామాల్లోని ఇసుక రీచ్ వాగులను ఆర్డీవో జివాకార్ రెడ్డి కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు జరిపితే తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పోలీసు, రెవెన్యూ, మైనింగ్, రవాణా అధికారులు నిరంతరం నిఘా ఉంచాలని అన్నారు. ఎక్కడైనా అక్రమంగా ఇసుక తవ్వకాలు గుర్తిస్తే వెంటనే పోలీసులు బాధ్యులపై కేసులు నమోదు చేసి చర్య తీసుకోవాలన్నారు.అధికారులు సమన్వయంతో బృందాలుగా ఏర్పడి తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. సామాన్య ప్రజలకు అతి తక్కువ ధరకు ఇసుక అందుబాటులోకి రావాలని,నిర్ణీత ధరకు మాత్రమే ఇసుక అమ్మకాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని, అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని అన్నారు. ఇసుక రీచ్ ల వద్ద 360 డిగ్రీల కెమెరాలు, లైట్స్ ఏర్పాటు చేయాలని, ఇసుక స్టాక్ యార్డుల వద్ద కట్టుదిట్టమైన ఫెన్సింగ్ తో పాటు ఒకే ఎంట్రీ ఎగ్జిట్లను ఏర్పాటు చేయాలని , ఇసుక రవాణా పర్యవేక్షణకు ప్రత్యేక సిబ్బందిని నియమించాలని అన్నారు. బ్లాక్ మార్కెట్ అరికట్టి పేదలకు ఇసుకను అందుబాటులో ఉండేలా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.అంతకు ముందు జిల్లా కలెక్టర్ కోరుట్ల మండలం నాగులపేట గ్రామంలోని శివారులో నిల్వ చేసి ఉన్న డంపు, ఇసుక రిచ్ పరిశీలించారు. డంప్ చేసి ఉన్న ఇసుకను వెంటనే సీజు చేయాలని అధికారులకు ఆదేశించారు. కలెక్టర్ వెంట, జీవకార్ రెడ్డి, తహసిల్దార్ , అధికారులు, పాల్గొన్నారు.

## ఫేక్‌యాప్‌లను ప్రమోట్ చేసిన వ్యక్తిపై కేసు నమోదు

**ప్రజాపక్షం / రాజన్న సిరిసిల్ల ప్రతినిధి:** సిరిసిల్ల పోలీస్ స్టేషన్ పరిదిలో ఇన్‌స్టాగ్రాం వేదికగా ఫేక్ ఆప్‌లను ప్రమోట్ చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు సిరిసిల్ల పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ కృష్ణ వెల్లడించారు. నిందితుడు సిరిసిల్ల పట్టణంలోని విద్యానగర్‌కు చెందిన అనే వ్యక్తి కాంసాని ఆకాష్(23) ఇన్‌స్టాగ్రాంలో వీడియోలు చేస్తూ ఫేక్ ఆప్‌లను ప్రమోట్ చేస్తూ వీడియోలు చేసి ఇన్‌స్టాగ్రాంలో పోస్టు చేసి యువతను ఆకర్షించే విధంగా తప్పు త్రోవ పట్టే విదంగా రాజా గేమ్స్ అనే ఫేక్ యాప్‌ను ప్రమోట్ చేసి సులభంగా డబ్బులు సంపాదించవచ్చునని తన ఇన్‌స్టాగ్రాంలో పోస్ట్ చేసి యువతను తప్పుతోవ పట్టిస్తున్నాడని పిర్యాదు రాగా, అతనిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. యువతను తప్పుదోవ పట్టించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎవరూ కూడా తప్పుడు ఫేక్ ఆప్‌లలో మీ యొక్క డబ్బులను ఇన్వెస్ట్‌మెంట్ పెట్టి మోసపోవద్దని ఇలాంటి మోసపూరిత ఆప్‌లను నమ్మవద్దని ప్రజలకు సూచించారు.





## రైతు దీక్షకు తాత్కాలిక బ్రేక్

### ఎలక్షన్ కోడ్ నేపథ్యం

**ప్రజాపక్షం / ఆర్మూర్ :** పసుపు క్వింటాలుకు రూ. 17 వేలు ధర ఇవ్వాలని కోరుతూ ఆర్మూర్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో సోమవారం ఉదయం 12 గంటలకు రైతులు రిలే నిరాహార దీక్ష ప్రారంభించారు. ఈ రైతు దీక్ష ఐదురోజులు నిర్వహించాల్సి ఉంది. దీక్ష స్థలానికి ఆర్మూర్ ఏసిపి జె. వెంకటేశ్వర్ రెడ్డి తన బలగాలతో చేరుకొని రైతు నాయకులతో మాట్లాడుతూ ఎన్నికల కోడ్ ఉన్నందున దీక్షను విరమింపజేయాలని, ఎన్నికల కోడ్ ముగిసిన తరువాత దీక్ష చేసుకోవాలని రైతు నాయకులకు సూచించినట్టు సమాచారం. రైతు నాయకుడు కె.వినోద్ రెడ్డి మాట్లాడుతూ చట్టాన్ని గౌరవిస్తు దీక్షను తాత్కాలికంగా విరమింప జేస్తున్నామని ఎన్నికల కోడ్ ముగిసిన తరువాత రైతులతో చర్చించి దీక్ష కొనసాగిస్తామని తెలిపారు. దీక్షలో పాల్గొన్న ప్రతి రైతు నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

## విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న బైక్.. ఇద్దరు మృతి

**ప్రజాపక్షం/మోర్తాడ్:** నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో విద్యుత్ స్తంబానికి బైక్ ఢీ కొనడం వల్ల ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. మోర్తాడ్ ఎస్సై తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సోమవారం మధ్యాహ్నం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన మహమ్మద్ సోహెల్, మహమ్మద్ సుమేర్ లు బైక్ పై వెళ్తుండగా మార్గమధ్యలో తిమ్మాపూర్ జ్ఞానోదయ స్కూల్ వద్ద ఉన్న స్తంబానికి ఢీకొన్నారు. అజాగ్రత్తగా నడపడంతో ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్లు తెలిసింది. ఈ ఘటనలో వారికి తీవ్రగాయాలై వారు ఇద్దరు మృతి చెందారన్నారు. సోహెల్ భార్య మహమ్మద్ రజియా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై బి.విక్రమ్ తెలిపారు.

## చెట్టుకు బైక్ ఢీ ..ఒకరు దుర్మరణం

**ప్రజాపక్షం/సారంగాపూర్ :** చెట్టును ఢీకొన్న సంఘటనలో ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలైన సంఘటన సారంగాపూర్ మండలం చించొలి(బి)లో సోమవారం చోటు చేసుకుంది.స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ధని గ్రామానికి చెందిన కొప్పుల సాయన్న,అయిటి మహేందర్ బైక్‌పై గ్రామానికి వెళ్తున్నారు.బైక్ అదుపుతప్పి చెట్టును ఢీకొంది. సాయన్న మృతి చెందగా..మహేందరుకు తీవ్ర గాయాలయ్యాయి. ఘటనాస్థలానికి పోలీసులు చేరుకున్నారు. మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

## మెడికల్ కౌన్సిల్ దాడులు నిలిపేయాలి



**ప్రజాపక్షం/ రామకృష్ణాపూర్ :** పేద ప్రజలకు వైద్యం అందిస్తున్న ఆర్ఎంపి,పిఎంపి వైద్యులపై మెడికల్ కౌన్సిల్ దాడులు ఎక్కువ అయ్యాయని; మెడికల్ కౌన్సిల్ దాడులు నిలిపివేయాలని రామకృష్ణాపూర్ పట్టణానికి చెందిన ఆర్ఎంపిపి, పిఎంపి వైద్యులు ప్రభుత్వాన్ని కోరారు. హైదరాబాదు ఇందిరాపార్కులో మంగళవారం జరగనున్న హలో ఆర్ఎంపి చలో హైదరాబాద్ గ్రామీణ వైద్యుల ఆత్మ గౌరవ సభ పోస్టర్లను సోమవారం రామకృష్ణాపూర్ పట్టణంలోని ఆర్ఎంపి,పిఎంపి వైద్యులు అనుభవ వైద్యుల సంఘం కార్యాలయంలో విడుదల చేశారు. పట్టణ అధ్యక్షులు ఒడ్నాల సత్యనారాయణ, బుచ్చన్న మాట్లాడుతూ గ్రామీణ వైద్యుల ఆత్మ గౌరవ సభను విజయవంతం చేయాలని కోరారు. గతంలో డాక్టర్ రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వంలో 1273 జివో ఇచ్చారని జివో ప్రకారం తెలంగాణలో 13 వేల మందికి శిక్షణ కూడా ఇచ్చారని అన్నారు. వీఆర్ఎంపి,పిఎంపిల వైద్యులు ఎండి సలీం,లక్ష్మి నారాయణ, చాంద్ పాషా, డిఆర్ స్వామి, రవి, రాజన్న, కుమార్, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాసంఘాల ఆధ్వర్యంలో బ్రూనో వర్ధంతి




**ప్రజాపక్షం/ మంచిర్యాల :** మంచిర్యాల జిల్లా కేంద్రంలో సోమవారం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఇటాలియన్ తత్వవేత్త గ్యార్డెనో బ్రూనో వర్ధంతిని సత్యాన్వేషణ దినోత్సవంగా జరుపుకున్నారు. డిహెచ్‌పిఎస్ జిల్లా కార్యదర్శి దేవి పోచన్న మాట్లాడుతూ మనువాదానికి వ్యతిరేకంగా పోడాలని ప్రజలకు పిలుపినిచ్చారు. బ్రూనో కోపర్నికస్ సూర్యకేంద్ర సిద్ధాంతాన్ని ఆధారం చేసుకొని అనంత విశ్వ సిద్ధాంతాన్ని ప్రతిపాదించడంతో క్రైస్తవ మత పెద్దలు అతనిని విభేదించారని అన్నారు. భూకేంద్ర సిద్ధాంతాన్ని తిరస్కరించినందుకు 1600 ఫిబ్రవరి 17న బ్రూనోను సజీవదహనం చేశారని, తాను నమ్మిన సత్యం అచంచలమని చివరి శ్వాస వరకు నిలబడ్డాడని తెలిపారు. ఎఐవైఎఫ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మొగిలి లక్ష్మణ్, మాడిశెట్టి సత్యనారాయణ, కీర్తి రాజు, వెన్న మొండి, పురం శెట్టి శ్రీధర్, మాడిశెట్టి సురేష్, మాడిశెట్టి రాజు, తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర మంత్రి బండి సంజయ్‌తో భేటీ




**ప్రజాపక్షం/ బాన్సువాడ :** కరీంనగర్ జిల్లా కేంద్రంలోని మైత్రి రెసిడెన్సిలో సోమవారం బిజెపి ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశానికి విచ్చేసిన కేంద్రహోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ను బాన్సువాడ బిజెపి పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ గుడుగుట్ల శ్రీనివాస్ మర్యాదపూర్వకంగా కలిశారు. శ్రీనివాస్ మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రుల అభ్యర్థి అంజిరెడ్డి, టీచర్ అభ్యర్థి కొమురయ్యలను భారీ మెజార్టీతో గెలిపించాలని కేంద్రహోం శాఖ సహాయ మంత్రి బండి సం జయ్ దిశా నిర్దేశం చేశారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు నిరుద్యోగులకు చేసిన మోసాలను క్షేత్రస్థాయిలో పట్టభద్రులను కలిసి వారిని చైతన్యపరిచి బిజెపికి ఓటు వేసే విధంగా కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలన్నారు. పట్టణ అధ్యక్షుడు తుప్తి ప్రసాద్, మండలాల అధ్యక్షులు, సున్నం సాయిలు, హరికృష్ణ పాల్గొన్నారు.

## విద్యార్థులకు కంటి సమస్యలు

**ప్రజాపక్షం/ ఆసిఫాబాద్ :** ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో దృష్టిలోప నివారణకు రాష్ట్ర ప్రభుత్వం కంటి పరీక్షలు నిర్వహిస్తుందని విద్యార్థులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని డిఎంహెచ్ఓ సీతారాం అన్నారు. విద్యార్థుల్లో దృష్టి లోపాన్ని నివారించేందుకు సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో విద్యార్థులకు నేత్ర వైద్య నిపుణులు విశాల కంటి పరీక్షలు నిర్వహించారు. డిఎంహెచ్ఓ మాట్లాడుతూ రెండు విడతలుగా రాష్ట్రంలోని ప్రభుత్వ బడుల్లో శిబిరాలను ఏర్పాటు చేసిందని తెలిపారు. కంటి పరీక్ష శిబిరాలు 10 రోజుల పాటు కొనసాగుతాయని తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకు 931మంది విద్యార్థులకు కంటి చూపులో ఇబ్బందులు ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. వీరందరికి కంటి పరీక్షలు అనంతరం అద్దాలను పంపిణి చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో ఆర్‌బిఎస్‌కె నోడల్ అధికారి నరేంద్ర, ఆప్టోమెట్రిస్ట్ జగన్ మోహన్, దినేష్ పాల్గొన్నారు.

# కెసిఆర్ వల్లే అప్పులపాలు

### రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు




**ప్రజాపక్షం/నిజామాబాద్‌ప్రతినిధి :** బిఆర్ఎస్ పరిపాలనతో పోల్చితే కాంగ్రెస్ పరిపాలన జమీన్ ఆస్మాన్ పరక్ ఉన్నదని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటకశాఖమంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని భూమారెడ్డి కన్వెన్షన్‌లో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశంలో మాట్లాడారు. కెసిఆర్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారన్నారు. ఆర్థిక దుర్భర పరిస్థితుల్లో ఉన్నప్పటికీ సం క్షేమ పథకాలను పక్కాగా అమలు చేస్తున్నామన్నారు. ఉద్యోగులకు మొదటి తేదీనే జీతాలిస్తున్నామని, ఉద్యోగులకు ప్రమోషన్లు ఇచ్చామన్నారు. ప్రతి నియోజకవర్గంలో ఇంటిగ్రేటెడ్, రెసిడెన్సియల్ స్కూల్స్ ఏర్పాటు చేసి నాణ్యమైన విద్యనందిస్తున్నామన్నారు. జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు ఖాయమనిచెప్పారు.తెలంగాణకు కేంద్రం చేస్తున్న అన్యాయం తెలియాలంటే కాంగ్రెస్‌కు పట్టభద్రులు ఓటేయాలని కోరారు. కులగణన సర్వే పక్కాగా జరిగిందని, సర్వేలో పాల్గొనని వారి కోసం రీసర్వే చేస్తున్నామన్నారు. కెసిఆర్ ప్రభుత్వం చేసిన సమగ్ర కుటుంబ సర్వేకు చట్టరూపం ఇవ్వలేదన్నారు. ఇప్పుడు తాము చేసిన సర్వేకు చట్టబద్ధత కల్పించామన్నారు. రాష్ట్రం లో 42 శాతం బీసీలకు రిజర్వేషన్లు కల్పిస్తామని చెప్పారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినా పీఎం పదవి తీసుకోకుండా రాహుల్, సోనియాలు పదవీ త్యాగం చేశారని గుర్తు చేశారు. ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డి, మదన్మోహన్, రాష్ట్ర కార్పోరేషన్ చైర్మన్లు, జిల్లా సేవాదళ్ అధ్యక్షులు వైసాక్షి సంతోష్, నియోజకవర్గ ఇన్‌చార్జిలు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## 'ప్రజావాణి'కి 43 విజ్ఞప్తులు

### సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి వల్లూరి



**ప్రజాపక్షం / సంగారెడ్డిప్రతినిధిః** జిల్లాలో ప్రజల సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిద ప్రాంతాల నుండి వచ్చిన దరఖాస్తుదారులు 43 దరఖాస్తులను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి అర్జీని పరిశీలించి తక్షణ చర్యలు తీసుకుని సమస్యలు పరిష్కరించాలని సంబందిత అధికారులను ఆదేశించారు. ప్రజల ప్రధాన సమస్యలపై అధికారులు పూర్తి దృష్టి పెట్టి పరిస్కార ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. కాగా రెవెన్యూ శాఖ 15, సర్వే ల్యాండ్ 2, పంచాయతీ ,పిటి విభాగం 3, పంచాయతీరాజ్,4, డిఆర్‌డిఓ 1, మున్సిపల్,2, వెల్ఫేర్ డిపార్మెంట్ 4, విద్యాశాఖ 2, వ్యవసాయ శాఖ6, వైద్య ,ఆరోగ్యశాఖ 3, ఎక్సైజ్ శాఖ 1, ధరఖాస్తులు అందాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ పద్మజ రాణి, జడ్పీసీఈఓ జానకి రెడ్డి, డిపిఓ సాయిబాబా, వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు ప్రజలు తదితరులు సిబ్బంది పాల్గొన్నారు.

## బాధితులకు అండగా 'భరోసా' కేంద్రాలు

### రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్



**ప్రజాపక్షం/ మంచిర్యాల :** బాధిత మహిళలకు భరోసా కేంద్రాలు ఎల్లవేళలా అండగా ఉంటాయని రామగుండం పోలీస్ కమిషనర్ ఎం. శ్రీనివాస్ అన్నారు. సోమవారం నస్పూర్ పాత పోలీస్ స్టేషన్ భవనంలో ఉన్న భరోసా సెంటర్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లైంగికదాడి కేసుల బాధితులకు న్యాయ, వైద్య, మానసిక సహాయాన్ని అందిస్తూ కేసు ట్రయల్ పూర్తయ్యే వరకు భరోసా కేంద్రాలు అండగా నిలుస్తాయని ఆయన తెలిపారు. ఫోక్సో చట్టం పరిధిలోకి వచ్చే కేసుల్లో బాధిత మహిళలకు వైద్య సేవలు, మానసిక కౌన్సిలింగ్, న్యాయ సహాయం, పోలీసుల మద్దతు అందించడంతో పాటు ప్రభుత్వం నుంచి పరిహారం ఇప్పించేందుకు భరోసా కేంద్రం ప్రధాన భూమిక పోషిస్తుందని అన్నారు.ఫోక్సో, లైంగిక దాడి కేసులు నమోదైన వెంటనే బాధితులను భరోసా కేంద్రానికి తీసుకురావాలని, అక్కడే వారికి అవసరమైన అన్ని సేవలు తక్షణమే అందించాలని పోలీస్ అధికారులను, భరోసా సిబ్బందిని కమిషనర్ ఆదేశించారు. బాధితులకు న్యాయపరమైన సూచనలు, ఆర్థిక సహాయం, అవసరమైతే తాత్కాలిక ఆశ్రయం కూడా కల్పించాలన్నారు. బాధితులను మానసికంగా, ఆర్థికంగా స్వావలంబిగా తీర్చిదిద్దేందుకు భరోసా కేంద్రాలు నైపుణ్య శిక్షణ అందించనున్నామని తెలిపారు. లైంగిక దాడులకు గురైన మహిలలు, చిన్నారులు భయపడకుండా సమాజంలో గౌరవంగా జీవించేందుకు అవసరమైన మద్దతు అందించడమే భరోసా కేంద్రాల ముఖ్య లక్ష్యమని తెలిపారు. భరోసా కేంద్రంలో లీగల్, మెడికల్, చిన్నారుల కౌన్సింగల్ గదులు, స్టేట్మెంట్ రికార్డు సమావేశ గదులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల డిసిపి ఎ. భాస్కర్, అడిషనల్ డిసిపి(అడ్మిన్) సి. రాజు, స్పెషల్ బ్రాంచ్ ఎసిపి రాఘవేంద్ర రావు, మంచిర్యాల ఎసిపి ఆర్.ప్రకాష్, మహిళ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ నరేష్ కుమార్, మంచిర్యాల రూరల్ సిఐ అశోక్ కుమార్, షీటీమ్ ఇంచార్జి ఎస్ఐ హైమ, సిసి హరీష్ తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టులకు అండగాఉంటా: ధర్మపురి



**ప్రజాపక్షం/నిజామాబాద్‌ప్రతినిధిః** ప్రజల కోసం పని చేస్తున్న జర్నలిస్టులకు అండగా ఉంటానని ఎంపీ ధర్మపురి అరవింద్ హామీనిచ్చారు. జిల్లాకు పసుపు బోర్డు సాధించిన తర్వాత తొలిసారిగా నిజామాబాద్‌లో పర్యటించిన అరవింద్‌ను జర్నలిస్టులు సుభాష్‌నగర్‌లోని ఆయన నివాసంలో ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో కలిసి ఘనంగా సన్మానించారు. జిల్లాలో తాజా రాజకీయ పరిస్థితులు అభివృద్ధి పనులు తదితర అంశాలపై చర్చించారు. ఎంపీ అరవింద్ మాట్లాడుతూ జర్నలిస్టుల వరుస మరణాలు బాధాకరమని విచారం వ్యక్తం చేస్తున్నామన్నారు. ఒత్తిడులు తగ్గించుకుంటూ జర్నలిస్టులు ఆరోగ్యం కాపాడుకోవాలని సూచించారు. ఇటీవల వివిధ కారణాలతో మృతి చెందిన జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. వరుస మరణాలు బాధాకరమని, అరవింద్ ధర్మపురి ఫౌండేషన్ ద్వారా ఆపద సమయంలో బీజేపీ నాయకులకు ఆదుకుంటున్నానని, ఫౌండేషన్‌సేవలకు జర్నలిస్టులకు వర్తింపజేసే అంశాన్ని పరిశీలిస్తామని చెప్పారు. జర్నలిస్ట్ వెల్ఫేర్‌సొసైటీకార్యకలాపాలనుఎంపీ అడిగి తెలుసుకున్నారు. ఎంపీని కలిసిన వారిలో ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు రామకృష్ణ, శేఖర్, ఆర్గనైజింగ్ కార్యదర్శి మోహన్, సీనియర్ జర్నలిస్ట్‌లు ప్రమోద్, ప్రసాద్, శ్రీనివాస్, దేవిదాస్, సుదర్శన్, ఆంజనేయులు, అహ్మద్, భూపతి పాల్గొన్నారు.

## టెన్త్‌లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి



**ప్రజాపక్షం/సోన్ః** విద్యార్థులు క్రమశిక్షణ, సమయపాలన పాటిస్తూ పదవ తరగతి పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు.సోమవారం సోన్ మండలం లెఫ్ట్ పోచంపాడ్ ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలికల రెసిడెన్సియల్ పాఠశాల,కళాశాలను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ తో కలిసి కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు.తరగతది గదిలో విద్యార్థులను పలు సబ్జెక్టుల్లో ప్రశ్నలు అడిగి జవాబులు రాబట్టారు. గణితం సబ్జెక్టుకు సంబంధించి లెక్కలను విద్యార్థులచే చేయించారు.పరీక్షలు సమీపిస్తున్నందున ఉన్న సమయాన్ని సరిగ్గా వినియోగించుకుంటూ పరీక్షలకు సిద్ధంకావాలని కలెక్టర్ విద్యార్థులకు సూచించారు.సిలబస్ ను ఎప్పటికప్పుడు పూర్తి చేసుకుంటూ ఒత్తిడి లేకుండా చదవాలన్నారు. విద్యార్థులందరూ పరీక్షలో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు.పదిలో పదికి పది పాయింట్లు సాధించిన విద్యార్థులతో కలిసి భోజనం చేస్తానని విద్యార్థులకు కలెక్టర్ హామీ ఇచ్చారు.సబ్జెక్టుల్లో ఎటువంటి సందేహాలు ఉన్నా ఆయా ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకోవాలని అన్నారు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులను నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు.పాఠశాల పరిసరాలను పరిశీలించి పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.అనంతరం విద్యార్థులతో కలిసి కలెక్టర్,అదనపు కలెక్టర్ మధ్యాహ్న భోజనం చేశారు. జిల్లా విద్యాశాఖ అధికారి పి.రామారావు,కళాశాల ప్రిన్సిపల్ ప్రశాంతి, తహసిల్దార్ మల్లేష్, ఎంపిడిఒ సురేష్, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎంఎల్‌సి ఎన్నికల ఏర్పాట్లపై సమీక్ష

### నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్



**ప్రజాపక్షం/నిర్మల్ ప్రతినిధి :** నిర్మల్ కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో సంబంధిత అధికారులతో ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.రూట్ ఆఫీసర్లు,పోలీస్ అధికారులతో కలిసి అన్ని పోలింగ్ కేంద్రాలకు చేరుకునే దారి, దూరం, పోలింగ్ కేంద్రానికి చేరుకునేందుకు పట్టు సమయం తదితర అంశాలను పరిశీలించాలన్నారు. పోలింగ్ కేంద్రాలలో వెబ్ కాస్టింగ్ నిర్వహణకు ఏర్పాటు చేయాలన్నారు.సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి పటిష్ట పోలీసు బందోబస్తును ఏర్పాటు చేయాలని సూచించారు.అన్ని పోలింగ్ కేంద్రాలలో దివ్యాంగ ఓటర్లకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా వీల్ చైర్,ర్యాంపు వంటి ఏర్పాట్లును పూర్తి చేయాలన్నారు.ఇప్పటివరకు జిల్లాకు చేరుకున్న పోలింగ్ సామాగ్రికి సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.పోలింగ్ సిబ్బంది.సామాగ్రి తరలింపునకు సంబంధించిన వాహనాలను సమకూర్చుకోవాలన్నారు. ఉపాధ్యాయ,పట్టభద్రుల కామన్ పోలింగ్ కేంద్రాలలో ఓటర్లకు ఇబ్బందులు తలెత్తకుండా తగు చర్యలను తీసుకోవాలన్నారు. ఎన్నికల సిబ్బందికి మరోసారి శిక్షణ నిర్వహించి,నమూనా ఎన్నికను ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ కిషోర్ కుమార్,నిర్మల్,బైంసా ల ఆర్డీవోలు రత్న కళ్యాణి,కోమల్ రెడ్డిలు,జెడ్పి సీఈవో గోవింద్,డిపిఓ శ్రీనివాస్,ఎక్సైజ్ అధికారి ఎం.ఎ.రజాక్,ఎన్నికల విభాగం పర్యవేక్షకులు శ్రీనివాస్,ఇతర అధికారులు,సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

## తొలి ప్రాధాన్యత ఓటు నరేందర్‌రెడ్డికే వేయండి

### టిజిఐఐసి చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి

**ప్రజాపక్షం / కొండాపూర్ః** పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నరేందర్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని టీజీఐఐసి చైర్మెన్ నిర్మల జగ్గారెడ్డి కోరారు. సోమవారం సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని టీఎన్‌జిఓ భవన్‌లో కాంగ్రెస్‌పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా నిర్మల రెడ్డి పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న నరేందర్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి ఎమ్మెల్సీగా గెలిపించాలని ఆమె కోరారు. సిడిసి చైర్మన్ రాంరెడ్డి, ఆత్మకమిటీచైర్మెన్ వై. ప్రభు,కాంగ్రెస్ నాయుకులు అంజనేయులు, నాయకులు పాల్గొన్నారు.



## రెసిడెన్సియల్ స్కూల్ కోసం స్థల పరిశీలన



### నిజామాబాద్ కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి :** అన్ని హంగులతో ప్రభుత్వం నూతనంగా నిర్మించదల్చిన సమీకృత రెసిడెన్సియల్ విద్యాసంస్థలు, వసతిగృహ సముదాయం కోసం మెండోరా మండలం పోచంపాడ్‌లోని శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు చెందిన స్థలాన్ని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు సోమవారం పరిశీలించారు. స్థానిక రెవెన్యూ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో ఈ ప్రాంతాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్ ఇంటిగ్రేటెడ్ రెసిడెన్సియల్ స్కూల్స్ నిర్మాణానికి అనువైన పరిసిథతులు, అనుకూల వాతావరనం తదితర అంశాలను పరిశీలించారు. 25 ఎకరాల స్థలం అవసరమున్నందున సమగ్ర వివరాలతో ప్రతిపాదనలు పంపాలని మెండోరా తహసీల్దార్ సంతోష్‌రెడ్డిని ఆదేశించారు. కలెక్టర్ వెంట ఆర్ఐ వేణుగోపాల్, సర్వేయర్ మమత, సంబంధిత అధికారులున్నారు.



## రైతుల రుణాలకు ప్రాధాన్యత

**ప్రజాపక్షం/పాపన్నపేట :** జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో రైతులకు అన్ని రకాల రుణ సౌకర్యం కల్పిస్తున్నట్లు ఆ బ్యాంక్ మేనేజర్ కిషన్ వెల్లడించారు. సోమవారం మండల పరిధిలోని చికోడ్ గ్రామంలో రైతులకు, బ్యాంక్ కస్టమర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. మేనేజర్ మాట్లాడుతూ, తమ బ్యాంక్‌లో పౌల్ట్రీ, డైరీ, షిప్, రైతు నేస్తం, హౌసింగ్, విద్య ల్యాండ్ డెవలప్మెంట్ తదితర పథకాలకు రుణాలు అందజేస్తామని వెల్లడించారు. డిసిసిబి బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేస్తే అన్ని బ్యాంకుల కన్నా వడ్డీ అధికంగా ఉంటుందని అన్నారు. అంతేకాకుండా ఫోన్ పే, గూగుల్ పే, ఏటీఎం సౌకర్యాలు సైతం కల్పించినట్లు ఆయన వివరించారు. బంగారు ఆభరణాలకు తక్కువ డ్డీకి గోల్డ్ లోన్ సౌకర్యం కల్పించినట్లు పేర్కొన్నారు. మాజీ ఎంపీపీ సుధీర్, చంద్ర దేశ్ పాండే, మాజీ సర్పంచ్ తిరుపతి రెడ్డి, కొండల్‌రెడ్డితోపాటు రైతుల పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


## విద్యావంతుడైన నరేందర్‌రెడ్డిని గెలిపిద్దాం




**ప్రజాపక్షం/నర్సాపూర్:** నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన విద్యావంతుడైన పట్ట భద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డి కి పట్టబద్రులు ఓటు వేసి గెలిపించాలని, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సువాసిని రెడ్డి, నియోజకవర్గ పార్టీ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి అన్నారు. సోమవారం నర్సాపూర్ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులకు సమావేశం ఏర్పాటు చేశారు. వారి ఉద్దేశించి మాట్లాడుతూ విద్యావంతుడైన నరేందర్ రెడ్డి కి కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి మెదక్ జిల్లా, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేసే అవకాశం కల్పించిందన్నారు. విద్యావంతులైన పట్టభద్రులు కాంగ్రెస్ పార్టీ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డి కి ఓటు వేసి గెలిపించాలన్నారు. బిజెపి పార్టీ తరపున పోటీ చేస్తున్న వ్యక్తి వ్యాపార వేత అని ఆయన ఎప్పుడు ఏ పార్టీ మారుతాడొ అతడికే తెలియదని అన్నారు. అటువంటి వ్యక్తికి పట్ట భద్రులు ఓటు వేసి మోసపోవద్దని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి 52, లా మందికి ఉద్యోగాలు కల్పించడం కాకుండా మరో 72,వేల మందికి ప్రమోషన్లు కల్పించిన ఘనత కాంగ్రెస్ పార్టీకి దక్కుతుందన్నారు. ఈ ఎన్నికల్లో బిఆర్ఎస్ బిజెపి పార్టీలు కుమ్మక్కయ్యాయని ఆ పార్టీలకు బుద్ధి చెప్పి కాంగ్రెస్ పార్టీ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డిని గెలిపించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీనివాస్ గుప్తా, కృష్ణ, మణిదీప్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

## గర్భిణులు, బాలింతలకు నాణ్యమైన ఆహారం

### మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్




**ప్రజాపక్షం/మెదక్ ప్రతినిధి :** గర్భిణులు, బాలింతల కోసం తయారుచేసిన భోజనం నాణ్యతకు రాజీ పడేది లేదని, ఇప్పుడు అందుతున్న భోజనము చాలా నాణ్యతగా ఉన్నదని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పిల్లికొటాల్లో ఉన్న మాతాశిశు ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ఆకస్మికంగా పరిశీలించారు. పేడియాట్రిక్ వార్డు, ఐ సి వార్డు, గైనిక్ ఆపరేషన్ వార్డులను సందర్శించారు, ఆసుపత్రి పరిసరాలను పరిశీలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పేషంట్లను నాణ్యమైన భోజనం అందుతుందా అని అడిగి తెలుసుకున్నారు రోగులు నాణ్యమైన ఆహార పదార్థాలు అందిస్తున్నారని కలెక్టర్ కు తెలపడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం క్యాంటీన్లో ఆహారపార్థాలను నాణ్యతను పరిశీలించారు. నాణ్యతలో రాజీ పడకుండా పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా ఉండాలంటే నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని చెప్పారు. అనంతరం రోగులకు ఏ ఆహారము వడ్డిస్తునారో అదే ఆహారము వడ్డించమని చెప్పి ఉన్నత వైద్యులతో కలసి భోజనము చేశారు. ఈ కార్యక్రమంలో సూపరిండెంట్ శివ దయాల్, ఆర్ఎంఓ షర్మిల, ప్రిన్సిపల్ రవీంద్ర కుమార్, గైనిక్ హెచ్ఓడిలు సునీత, రాజేశ్వరి తదితరులు ఉన్నారు.

# క్రీడ



కొత్త వివాదానికి తెరలేపిన పాకిస్థాన్..

## కనిపించని భారత్ జెండా!

ఐసిసి చాంపియన్స్ ట్రోఫీ రేపటి నుంచి మొదలుకానున్నది. పాకిస్థాన్ ఆతిథ్యం ఇవ్వబోతున్నది. ప్రారంభ మ్యాచ్‌లో న్యూజిలాండ్‌తో ఆతిథ్య పాకిస్థాన్ తలపడనున్నది. అయితే, భారత్ జట్టు మ్యాచలన్నీ దుబాయిలో ఆడుంది. ఐసీసీ ఈవెంట్ హైబ్రిడ్ మోడల్‌లో జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ వెంట్‌కు ముందు పాకిస్థాన్ కొత్త వివాదానికి తెరలేపింది. అయితే, ఐసీసీ నిబంధనల ప్రకారం ఏదైనా టోర్నీ జరుగుతున్న సమయంలో.. టోర్నీలో పాల్గొనే జట్లకు సంబంధించిన జెండాలను ఎగుర వేయాల్సి ఉంటుంది. చాంపియన్స్ ట్రోఫీ సందర్భంగా కరాచీ స్టేడియంలో భారత జెండాను పాకిస్థాన్ ఎగుర వేయలేదు. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. పలువురు పాక్ చర్యలపై మండిపడుతున్నారు. కరాచీ స్టేడియంలో న్యూజిలాండ్ దక్షిణాఫ్రికా, అఫ్ఘనిస్తాన్, పాకిస్తాన్ ఇంగ్లాండ్ జట్ల మ్యాచ్‌లు జరుగనున్నాయి. టోర్నీలో పాల్గొంటున్న ఏడు దేశాల జెండాలను కరాచీ స్టేడియంపై కనిపించాయి. ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్ మ్యాచ్‌లు కరాచీ స్టేడియంలో షెడ్యూల్ చేయలేదు. అయినా.. ఆ రెండు దేశాల జెండాలను మాత్రం ఎగుర వేశారు. వాస్తవానికి భద్రతా కారణాలను చూపుతూ భారత జట్టు చాంపియన్స్ ట్రోఫీ కోసం పాక్‌కు వెళ్లేందుకు నిరాకరించింది. దాంతో ఐసీసీ టోర్నీని హైబ్రిడ్ మోడల్‌లో నిర్వహించేందుకు పాకిస్థాన్‌ను ఒప్పించింది. భారత్ ఫైనల్‌కు అర్హత సాధిస్తే.. దుబాయిలోనే ఫైనల్ జరుగుతుంది. లేకపోతే పాక్‌లో జరుగుతుంది. బీసీసీఐ, పీసీబీ, ఐసీసీ మధ్య జరిగిన ఒప్పందం ప్రకారం.. భారత్ ఆతిథ్యం ఇవ్వనున్న ఐసీసీ ఈవెంట్స్‌లో సైతం పాకిస్థాన్ హైబ్రిడ్ మోడల్‌లోనే ఆడుతుంది.

## ఉప్పల్‌లో 9 మ్యాచ్‌లు.. నిరాశలో ఎస్ఆర్‌హెచ్ ఫ్యాన్స్!

ఐపిఎల్ 2025 షెడ్యూల్ ప్రకారం.. ఉప్పల్‌లోని రాజీవ్ గాంధీ స్టేడియం వేదికగా మొత్తం 9 మ్యాచ్‌లు జరగనున్నాయి. సన్‌రైజర్స్ హైదరాబాద్ హోమ్ గ్రౌండ్ అయిన ఉప్పల్‌లో ఆ జట్టు ఏడు లీగ్ మ్యాచ్‌లు ఆడనుంది. గతేడాది సన్‌రైజర్స్ హైదరాబాద్ రన్నరప్‌గా నిలిచిన విషయం తెలిసిందే. దాంతో ఉప్పల్ వేదికగా క్వాలిఫయర్–1తో పాటు ఎలిమినేటర్ మ్యాచ్‌లు కేటాయించారు. ఉప్పల్ వేదికగా 9 మ్యాచ్‌లు జరగనున్నా సన్‌రైజర్స్ అభిమానులు నిరాశలో ఉన్నారు. ఆర్‌సీబీ, చెన్నై సూపర్ కింగ్స్‌తో ఉప్పల్ వేదికగా ఒక్క మ్యాచ్ లేకపోవడమే ఇందుకు కారణం. తమ అభిమాన ఆటగాళ్లు అయిన విరాట్ కోహ్లీ, మహేంద్ర సింగ్ ధోనీలను ప్రత్యక్షంగా చూసే అవకాశం లేకపోవడంతో ఆవేదనకు గురవుతున్నారు. అయితే ముంబై ఇండియన్స్‌తో ఏప్రిల్ 23న మ్యాచ్ ఉండటం కాస్త ఊరటనిస్తోంది. క్వాలిఫయర్1, ఎలిమినేటర్ మ్యాచ్‌లకు ఆ జట్లు అర్హత సాధిస్తేనే వారిని చూసే అవకాశం హైదరాబాద్ అభిమానులకు దక్కనుంది.



ఐపీఎల్ 2025 సీడింగ్ గ్రూప్స్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ గ్రూప్‌బీలో ఉంది. ఆ జట్టు ఢిల్లీ క్యాపిటల్స్, గుజరాత్ టైటాన్స్, ముంబై ఇండియన్స్, లక్నో సూపర్ జెయింట్స్‌తో రెండేసి మ్యాచ్‌లు ఆడనుంది. గ్రూప్‌ఏలో ఉన్న కేకేఆర్, ఆర్‌సీబీ, రాజస్థాన్ రాయల్స్, సీఎస్‌కే, పంజాబ్ కింగ్స్‌లతో ఒక్కో మ్యాచ్ ఆడనుంది. ఆర్‌సీబీ, సీఎస్‌కేలతో ఆయా జట్ల హోమ్ గ్రౌండ్స్‌లో తలపడనుంది. దాంతోనే ఆ జట్లతో ఉప్పల్ వేదికగా మ్యాచ్‌లు లేవు.

ఛాంపియన్స్ ట్రోఫీ

## భారత్‌దే

### టాప్ స్కోరర్‌గా రోహిత్
### ఆసీస్ మాజీ కెప్టెన్

ఛాంపియన్స్ ట్రోఫీ విజేతగా టీమ్‌ఇండియా నిలుస్తుందని ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ మైకెల్ క్లార్క్ జోస్యం చెప్పాడు. అలాగే భారత కెప్టెన్ రోహిత్ శర్మ అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా నిలుస్తాడని క్లార్క్ వ్యాఖ్యానించాడు. ఒక్కసారి అతడు కుదురుకుంటే ఆపడం ఎవరి వల్లా కాదని.. తాజాగా ఇంగ్లండ్‌తో సిరీస్‌లో ఫామ్ అందుకోవడం టీమ్‌ఇండియాకు కలిసొచ్చే అంశమని స్పష్టం చేశాడు. ''భారతే ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీని గెలవబోతుందని చెబుతున్నా. సారథి రోహిత్ శర్మ మళ్లీ ఫామ్‌లోకి రావడం బాగుంది. అందుకే, టీమ్‌ఇండియా టైటిల్‌ను సొంతం చేసుకోగలదని భావిస్తున్నా. టోర్నీలో అత్యధిక పరుగులు సాధించే బ్యాటర్‌గానూ నిలుస్తాడు. ఇక టాప్ వికెట్ జోఫ్రా ఆర్చర్ అవుతాడనుకుంటున్నా. జట్టుపరంగా ఇంగ్లండ్‌కు టైటిల్ అవకాశాలు తక్కువే. కానీ, ఆ జట్టులో అతడే సూపర్ స్టార్. ప్లేయర్ ఆఫ్ ది టోర్నీగా ట్రావిస్ హెడ్ నిలుస్తాడనుకుంటున్నా. ఐపీఎల్ ఫామ్ కొనసాగిస్తాడని ఆశిస్తున్నా. గత వన్డే ప్రపంచ కప్‌లోనూ కీలక ఇన్నింగ్స్‌లు ఆడాడు'' అని క్లార్క్ వెల్లడించాడు.




### గేల్ రికార్డుపై విరాట్ గురి

ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ బరిలోకి దిగుతోన్న విరాట్ కోహ్లీ ముంగిట ఓ రికార్డు ఉంది. అదీనూ యూనివర్సల్ బాస్ క్రిస్ గేల్ రికార్డు కావడం గమనార్హం. ఇప్పటి వరకు ఛాంపియన్స్ ట్రోఫీ చరిత్రలో విరాట్ కోహ్లీ 13 మ్యాచుల్లో 529 పరుగులు చేశాడు. కెరీర్‌లో ఇదే చివరి ఛాంపియన్స్ ట్రోఫీగా భావిస్తోన్న విరాట్ మరో 263 పరుగులు చేస్తే.. టోర్నీలోనే అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా అవతరిస్తాడు. ప్రస్తుతం క్రిస్ గేల్ (791) అందరికంటే ముందున్నాడు. ఈ జాబితాలో శిఖర్ ధావన్ (701) మూడో స్థానంలో ఉన్నాడు. ఫిబ్రవరి 19 నుంచి టోర్నీ ప్రారంభం కానుండగా.. భారత్ తన తొలి మ్యాచ్‌లో ఫిబ్రవరి 20న బంగ్లాదేశ్‌తో తలపడనుంది. ఫిబ్రవరి 23న పాక్‌తో, మార్చి 2న న్యూజిలాండ్‌తో భారత్ ఆడనుంది.

## 'మహా కుంభమేళా' మూలాలను గౌరవించాలి

విజయ్ దేవరకొండ



ప్రస్తుతం యావత్ భారతదేశ ప్రజలు ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళా వైపు చూస్తున్నారు. అక్కడ త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు ఎలా జరుగుతున్నాయో అని అందరూ ఆరా తీస్తున్నారు. అయితే, సామాన్య ప్రజలతో పాటు సినీ, రాజకీయ ప్రముఖులు కూడా ఈ పుణ్యస్నానాల్లో పాల్గొంటున్నారు. ఇటీవల టాలీవుడ్ రౌడీ స్టార్ విజయ్ దేవరకొండ కూడా ఈ మహా కుంభమేళాలో పాల్గొన్నాడు. ఆయన ప్రయాగ్‌రాజ్‌లోని త్రివేణి సంగమంలో పుణ్యస్నానం ఆచరించారు. 144 సంవత్సరాలకు ఒకసారి జరిగే ఈ మహా కుంభమేళాలో పాల్గొనడం జీవితంలో ఎప్పటికీ మరిచిపోలేని అనుభూతి అని.. మన దేశ సంప్రదాయాలు, మన మూలాలను గుర్తుంచుకునేలా ఈ మహా కుంభమేళాలో పాల్గొనాలని ఆయన పేర్కొన్నారు. తన తల్లితో పాటు ఆయన ఈ మహా కుంభమేళాలో పాల్గొన్నారు. అయితే, దీనికి సంబంధించిన ఫోటోలను ఆయన తాజాగా సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు.

## తెలుగు హీరోయిన్లపై బేబీ నిర్మాత షాకింగ్ కామెంట్స్



బ్లాక్ బస్టర్ 'బేబీ' సినిమాను అందించిన టాలీవుడ్ నిర్మాత ఎస్‌కేఎన్ చేసిన కామెంట్స్ ప్రస్తుతం అందరినీ షాక్‌కు గురిచేశాయి. ప్రదీప్ రంగనాథన్ నటించిన లవ్, రొమాంటిక్ ఎంటర్‌టైనర్ 'డ్రాగన్'. తెలుగులో ఈ సినిమాను 'రిటర్న్ ఆఫ్ డ్రాగన్' పేరుతో విడుదల చేస్తున్నారు. అశ్వత్ మారిముత్తు దర్శకత్వంలో అనుపమ పరమేశ్వరన్ కథానాయికగా ఈ సినిమా రాబోతుంది. ఐతే, ఈ సినిమా ప్రీరిలీజ్ ఈవెంట్‌లో ఎస్‌కేఎన్ షాకింగ్ కామెంట్స్ చేశాడు. ఇంతకీ, ఎస్‌కేఎన్ ఏం మాట్లాడారు అంటే.. 'మేము తెలుగు రాని అమ్మాయిలను అభిమానిస్తాం. ఎందుకంటే.. తెలుగువచ్చిన అమ్మాయిలను ప్రోత్సహిస్తే ఏమౌతుందో ఈమధ్యే తెలుసుకున్నాం. ఇక నుంచి తెలుగు అమ్మాయిలను ప్రోత్సహించకూడదని నేను, దర్శకుడు సాయిరాజేశ్ గట్టిగా నిర్ణయించుకున్నాం'' అంటూ ఎస్‌కేఎన్ చెప్పుకొచ్చారు. అసలు ఎస్‌కేఎన్ ఈ కామెంట్స్ చేయడానికి కారణం మాత్రం ఇంకా తెలియలేదు.

# రీల్

## లాజిక్‌తో పనిలేదు

### కరణ్ జోహార్ కామెంట్స్



బాలీవుడ్ ప్రముఖ నిర్మాత, దర్శకుడు కరణ్ జోహార్ గొప్ప సినిమాలకు లాజిక్‌తో అవసరం లేదంటూ చేసిన కామెంట్స్ ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారాయి. డైరెక్టర్‌కి తన కథపై నమ్మకం ఉంటే సినిమా బ్లాక్ బస్టర్ అవుతుందని.. తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో కరణ్ జోహార్ ఈ కామెంట్స్ చేశారు. ఈ సందర్భంగా రాజమౌళి, సందీప్ వంగా, అనిల్ శర్మల చిత్రాల గురించి కరణ్ చెప్పుకొచ్చారు. కరణ్ జోహార్ మాట్లాడుతూ.. 'కొన్ని సినిమాలు లాజిక్ కంటే నమ్మకం ఆధారంగానే విజయాన్ని సాధిస్తాయి. గొప్ప దర్శకుల సినిమాల్లో ఈ విషయం స్పష్టంగా తెలుస్తుంది. ముఖ్యంగా సినిమాపై నమ్మకం ఉంటే ప్రేక్షకులకు లాజిక్ అవసరం లేదు. ఉదాహరణకు రాజమౌళి సినిమాలను పరిశీలిస్తే.. ఆయన చిత్రాల్లో లాజిక్‌ల గురించి ప్రేక్షకులు ఎప్పుడూ ఆలోచించరు. ఆయనకు తన కథపై పూర్తి నమ్మకం ఉంటుంది. ఎలాంటి సన్నివేశాన్నైనా ప్రేక్షకులకు నమ్మకం కలిగేలా తెరకెక్కిస్తారు' అంటూ కరణ్ జోహార్ చెప్పారు. గతేడాది ఐదు సినిమాలకు నిర్మాతగా వ్యవహరించిన కరణ్ ప్రస్తుతం 'ధడక్ 2'తో బిజీగా ఉన్న సంగతి తెలిసిందే.

## 'భాగ్యశ్రీ'కి మరో క్రేజీ ఆఫర్!



తమిళ హీరో సూర్య తెలుగులో ఎప్పుడు మంచి సినిమా చేస్తారా ? అని తెలుగు ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. మొత్తానికి ఆ సమయం ఇప్పుడు వచ్చేసింది. ఈ క్రమంలో వెంకీ అట్లూరికి సూర్య ఓకే చెప్పారు. ఏ గెటప్ లు, సందేశాలు ఏమీ లేకుండా చక్కటి లవ్ స్టోరీని వెంకీ, సూర్యకి చెప్పారు. ఈ సినిమా మే నుంచి స్టార్ట్ కాబోతుంది. సితార నాగవంశీ ఈ సినిమాకి నిర్మాత. అన్నట్టు ఈ సినిమాకు హీరోయిన్‌గా భాగ్యశ్రీ భోర్సే ను తీసుకునే ప్లాన్‌లో ఉన్నారు. అయితే, భాగ్యశ్రీ భోర్సేను ఇంకా ఫైనల్ చేయలేదు. కాకపోతే, ఆమెనే మెయిన్ హీరోయిన్‌గా తీసుకోవడానికి ఎక్కువ అవకాశం ఉందట. ఇప్పటికే, భాగ్యశ్రీ భోర్సే.. విజయ్ దేవరకొండ, రామ్ సరసన సినిమాలు చేస్తోంది. నిజానికి భాగ్యశ్రీ భోర్సే, తొలి సినిమా మిస్టర్ బచ్చన్ ప్లాప్ అయింది. అయినప్పటికీ, భాగ్యశ్రీకి మాత్రం తెలుగులో వరుస అవకాశాలు వస్తున్నాయి. ఈ క్రమంలోనే సూర్య సరసన ఆమెకు ఛాన్స్ వచ్చింది.



తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో రూపొందించిన 'తెలంగాణ స్టేట్ స్టాటిస్టికల్ అబ్‌స్ట్రాక్ట్ (అట్లస్)-2024''ను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు హైదరాబాద్‌లోని సచివాలయంలో సోమవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, ప్రణాళిక ముఖ్యకార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, డిప్యూటీ సీఎం కార్యదర్శి కృష్ణ భాస్కర్, ప్లానింగ్ డైరెక్టర్ షేక్ మీరా తదితరులు పాల్గొన్నారు.

## ఎస్‌సి వర్గీకరణతో ఏ కులానికీ అన్యాయం జరగదు

### వైద్య ఆరోగ్యశాఖమంత్రి దమోదర రాజనర్సింహ



ప్రజాపక్షం/హైదరాబాద్ : ఎస్‌సి వర్గీకరణలో ఏ కులానికి అన్యాయం జరగదని వైద్య ఆరోగ్య శాఖమంత్రి దమోదర రాజనర్సింహ అన్నారు. ఎస్‌సి వర్గీకరణపై మాదిగ సామాజిక వర్గానికి చెందిన శాసనసభ్యులు, మాదిగ, మాదిగ అనుబంధ కులాల సంఘాల ప్రతినిధులతో హైదరాబాద్ బేగంపేట్‌లోని టూరిజం ప్లాజాలో సోమవారం జరిగిన సమావేశంలో మంత్రి దామోదర్ రాజనర్సింహ ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఎస్‌సి రిజర్వేషన్ల కోసం జరిగిన పోరాటంలో అమరులైన మాదిగ కుటుంబ సభ్యులను మంత్రి దామోదర్ రాజనర్సింహ ఘనంగా సన్మానించారు. ఈ సంధర్భంగా దామోదర్ రాజనర్సింహ ఎస్‌సి క్లాసిఫికేషన్‌పై పవర్ పాయింట్ ప్రజంటేషన్ చేసి రిజర్వేషన్ ప్రక్రియపై వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎస్‌సి వర్గీకరణ అమలు ద్వారా మాదిగ, మాదిగ అనుబంధ కులాలలో విద్యా, ఉద్యోగ రంగాల్లో అవకాశాలు పెరుగుతాయన్నారు. ఎస్‌సి వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు అమలుకు రాష్ట్రంలో శ్రీకారం చుట్టిన ఘనత సిఎం రేవంత్ రెడ్డికి దక్కుతుందన్నారు. సిఎం రేవంత్ రెడ్డికి మాదిగ సమాజం తరుపున మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. ఎస్‌సి వర్గీకరణపై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించేందుకు క్షేత్రస్థాయి రిజర్వేషన్‌ల ప్రక్రియను ప్రజలకు వివరించాలన్నారు. అణగారిన కులాల్లో అసమానతలు రూపుమాపడానికే ఎస్‌సి రిజర్వేషన్లను వర్గీకరిస్తున్నామన్నారు. దేశంలోనే ఎస్‌సి వర్గీకరణను అమలుకు శ్రీకారం చుట్టిన తొలి రాష్ట్రంగా తెలంగాణ నిలవనుందన్నారు. ఈ కార్యక్రమంలో శాసనసభ్యులు వేముల వీరేశం, తోట లక్ష్మి కాంతారావు, డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, మాజీ మంత్రులు మోత్కుపల్లి నరసింహులు, చంద్రశేఖర్, మాజీ పార్లమెంట్ సభ్యులు పసునూరు దయాకర్, టిపిసిసి ప్రధాన కార్యదర్శి కొండేటి మల్లయ్య, ప్రొఫెసర్ మల్లేశం, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ముంజగల విజయ్ కుమార్, ప్రజా సంఘాల జెఎసి నేత గజ్జల కాంతం, కృపాకర్ మాదిగ, మేరీ మాదిగ, తెలంగాణ స్టూడెంట్ పొలిటికల్ జెఎసి ఛైర్మన్ చంద్రశేఖర్, కాంగ్రెస్ నాయకులు గోపి, బుల్లెట్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## 2036 నాటికి 4.6 శాతం పెరగనున్న తెలంగాణ జనాభా



ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర ప్రస్తుతం ఉన్న జనాభా 2036 నాటికి 4.6 శాతం పెరుగుతుందని, జాతీయ జనాభాలో రాష్ట్ర జనాభా 2031 నాటికి 0.23 శాతం తగ్గే అవకాశాలు ఉన్నాయని తెలంగాణ రాష్ట్ర గణాంకాల విభాగం అంచనా వేసింది. రాష్ట్రంలో 2011 జనాభా లెక్కల ప్రకారం 3,50,03,674 కోట్ల మందిగా ఉండగా, ఇందులో పట్టణ జనాభా 1,36,08,665 మంది, గ్రామీణ జనాభా 2,13,95,009 మంది ఉన్నారు. కాగా వారిలో ఆరేళ్ల లోపు పిల్లలు 38,99,166 మంది, ఎస్‌సి జనాభా 54,08,800 మంది, ఎస్‌టి జనాభా 31,77,940 మంది ఉన్నట్టు 'తెలంగాణ స్టేట్ స్టాటిస్టికల్ అబ్‌స్ట్రాక్ట్ (అట్లస్)2024' నివేదిక వెల్లడించింది. లింగ నిష్పత్తి వెయ్యి మంది పురుషులకు గాను 988 మంది మహిళలు ఉన్నారు. అక్షరాస్యత రేటు 66.5 శాతం నమోదైంది. 2026 నాటికి జనాభా 3.86 కోట్లకు చేరుతుందని తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక విభాగం అంచనా వేసింది. రాష్ట్రంలో మొత్తం ఒప్పందిత విద్యుత్ సామర్థ్యం 19,576 మెగావాట్లు ఉండగా, టిజి జెన్‌కో ద్వారా 6,485 మెగావాట్లు ఉత్పత్తి అవుతున్నది. 2023–24లో 9.76 లక్షల వాహనాలు ఉన్నట్టు నమోదవ్వగా, 202425 తొలి త్రైమాసికంలో రాష్ట్రంలో 5,034 షెడ్యూల్ బ్యాంకులు ఉన్నాయి.

2023–24 తాత్కాలిక అంచనాల ప్రకారం తెలంగాణ జిఎస్‌డిపి ప్రస్తుత ధరల వద్ద రూ. 15,01,981 కోట్లు కాగా, భారతదేశ జిడిపిలో తెలంగాణ రాష్ట్రం 5.1 శాతం వాటాగా ఉన్నది. నాన్ స్పెషల్ కేటగిరీ రాష్ట్రాలలో తెలంగాణ రాష్ట్ర జిఎస్‌డిపి వృద్ధి రేటు 14.5 శాతం నమోదు కాగా, 2023–24 లెక్కల ప్రకారం రాష్ట్రంలో తలసరి ఆదాయం రూ.3,56,564గా ఉన్నది. 2023–24 విద్యా సంవత్సరంలో తెలంగాణలో మొత్తం 40,975 పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 20,539 ప్రాథమిక, 7,482 అప్పర్ ప్రైమరీ, 11,561 హై స్కూల్స్, 1,393 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. డ్రాప్ వుట్ ఔట్ రేటులో ప్రాథమిక పాఠశాలలో 2.23 శాతం, అప్పర్ ప్రైమరీలో 0.34 శాతం, హైస్కూల్‌లో 11.95 శాతంగా ఉన్నది. (2024 మార్చి 31 నాటికి మహాలక్ష్మి పథకం కింద ఉచిత బస్సు ప్రయాణం నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం రూ.1163.08 కోట్లను ఖర్చు చేయగా, 2024 ఆగస్టు 31 నాటికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గృహ జ్యోతి పథకం కింద రూ. 808.33 కోట్లను ఖర్చు చేసింది.

### మొత్తం ధాన్యం 207.93 లక్షలటన్నుల ఉత్పత్తి

**57.22 లక్షల టన్నుల పాల ఉత్పత్తి**

2023–24 వ్యవసాయ ఉత్పత్తిలో బియ్యం 260.88 లక్షల టన్నులు, మిల్లెట్లు 30.33 లక్షల టన్నులు, కందులు 3.61 లక్షల టన్నులు ఉన్నది. మొత్తం ధాన్య ఉత్పత్తి 207.93 లక్షల టన్నులుగా నమోదైంది. పంట రుణ మాఫీ పథకం ద్వారా 16,76,418మంది రైతులు లబ్ధి పొందారు, మొత్తం మాఫీ కింద రూ.11,581.60 కోట్లను ఖర్చు చేసినట్టు నివేదికలో పొందుపర్చింది. 202324 సంవత్సరానికగాను తాత్కాలిక అంచనాల ప్రకారం తెలంగాణ రాష్ట్రంలో 57.22 లక్షల టన్నుల పాల ఉత్పత్తి అవుతుంది. 10.97 లక్షల టన్నుల మాంసం, 184 కోట్ల గుడ్లు ఉత్పత్తి అవుతున్నాయి. తెలంగాణ వ్యవసాయ రంగంలో పశుసంవర్ధక విభాగం 46.71 శాతం, జిఎస్‌డిపిలో 7.4 శాతం వాటాను కలిగి ఉన్నది. దేశంలోని మొత్తం ఫ్యాక్టరీలలో తెలంగాణ రాష్ట్రం 5.16 శాతంతో 8వ ర్యాంక్‌లో నిలిచింది. పారిశ్రామిక జివిఎలో రాష్ట్రం దేశవ్యాప్తంగా 9వ స్థానంలో, ఉద్యోగ అవకాశాల పరంగా 7వ స్థానంలో ఉన్నది.

## 'వికటన్' వెబ్‌సైట్‌ను పునరుద్ధరించాలి: ఐజెయు

చండీగఢ్ : ప్రధానమంత్రి నరేంద్రమోదీ గురించి కార్టూన్‌ను ప్రచురించినందుకు వికటన్ మ్యాగజైన్ వెబ్‌సైట్‌ను బ్లాక్ చేయడాన్ని ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజెయు) అధ్యక్షులు కె.శ్రీనివాస్ రెడ్డి, సెక్రెటరీ జనరల్ బల్వీందర్ సింగ్ జమ్మూ ఒక ప్రకటనలో ఖండించారు. కేంద్ర ప్రభుత్వ చర్య మీడియా స్వేచ్ఛపై ప్రత్యక్ష దాడి వంటిదని పేర్కొన్నారు. తమిళనాడు బిజెపి అధ్యక్షుడు కేంద్ర సమాచార, ప్రసార శాఖకు ఫిర్యాదు అనంతరం ప్రజాదరణ కలిగిన మ్యాగజైన్ వికటన్ వెబ్‌సైట్ అందుబాటులో లేకుండా పోయింది. కేవలం ఒక్క బొమ్మతో ప్రజలకు అనేక విషయాలను తెలియపరిచే శక్తివంతమైన రూపం కార్టూన్ అని, అది జర్నలిజంలో భాగమని, దానిపై వ్యతిరేకత ప్రదర్శించడమంటే భావ ప్రకటనా స్వేచ్ఛపై దాడి అని ఐజెయు నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. స్వతంత్ర పాత్రికేయంపై, భిన్నాభిప్రాయాలపై కేంద్ర ప్రభుత్వం అసహనం ప్రదర్శించటం ఇది మొదటిసారి కాదన్నారు. ఈ వైఖరి ప్రజాస్వామ్యానికి మంచిది కాదని, తక్షణమే వికటన్ మ్యాగజైన్ వెబ్‌సైట్‌ను పునరుద్ధరించాలని ఐజెయు నాయకులు డిమాండ్ చేశారు.

## పాములు, మొసళ్లు దాటుకుంటూ...

(మొదటి పేజీ తరువాయి)

తాను ఓ ఏజెన్సీని సంప్రదించగా చట్టపరంగా తీసుకెళ్తానని నమ్మించి రూ.40లక్షలు వసూలు చేశారని వాపోయాడు. తర్వాత వారు చెప్పినట్లుగా కాకుండా ట్రావెల్ ఏజెంట్ తనను ప్రమాదకరమైన డంకీ మార్గంలో తీసుకువెళ్లాడని గుర్తుచేసుకున్నాడు. మొదట అమృత్‌సర్ నుంచి విమానంలో ఢిల్లీకి తీసుకెళ్లి.. అక్కడి నుంచి ముంబయి, నైరోబీ, ఆమ్‌స్టర్ డామ్ మీదుగా సురినామ్ చేరుకున్నట్లు వివరించాడు. అక్కడి నుంచి ఓ చిన్న, ఇరుకైన వాహనంలో తనలాంటి మరికొంతమందిని ఎక్కించి గయానాకు తీసుకెళ్లారన్నాడు. ఆ మార్గంలో రోజుల తరబడి ఆహారం లేకుండా.. పనామా అడవుల్లో, కాలువల్లో ప్రమాదకర పాములు, మొసళ్లను దాటుకుంటూ తమ ప్రయాణం సాగిందని పేర్కొన్నాడు. దీని గురించి ప్రశ్నిస్తే చంపేస్తామని ఏజెంట్ బెదిరించారన్నాడు. అలా రోజుకు 12 గంటలు నడుస్తూనే ఉండేవాళ్లమని తెలిపాడు. కెన్యా, నెదర్లాండ్స్, గయానా, సురినామ్, కొలంబియా, పనామా, నికరగ్వా దేశాల మీదుగా అమెరికా చేరుకున్నట్లు తెలుపుతూ.. ప్రయాణానికి సంబంధించిన పలు వీడియోలను చూపించాడు. అలా ఎన్నో కష్టాలను దాటుకుని ఈ ఏడాది జనవరి 27న మెక్సికోలోని టిజువానాకు చేరుకొన్నామన్నాడు. అక్కడి నుంచి యుఎస్‌లోకి వెళ్లడానికి ప్రయత్నిస్తున్న సమయంలో బోర్డర్ పెట్రోల్ అధికారులు తనను అరెస్ట్ చేశారని తెలిపాడు. అనంతరం విమానంలో తిప్పి పంపినట్లు చెప్పాడు. దీంతో అగ్రరాజ్యంలో స్థిరపడి జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని తాను కన్న కలలు పేక మేడల్లా కూలిపోయాయని ఆవేదన వ్యక్తం చేశాడు.

## కెసిఆర్‌కు సిఎం బర్త్‌డే విషెస్

(మొదటి పేజీ తరువాయి)

60 లక్షల గులాబీ దండు పనిచేయాలని పిలుపునిచ్చారు. కెసిఆర్ కొడుకుగా పుట్టడం తన పూర్వజన్మ సుకృతమన్నారు.

**ప్రజలందరికీ పండుగదినం : హరీశ్ రావు**

కెసిఆర్ జన్మదినం రాష్ట్ర ప్రజలందరికీ పండుగ దినమని హరీశ్ రావు అన్నారు. కెసిఆర్‌తో సహా తెలంగాణ వాదులు ఇష్టం ఉన్నా.. లేకున్నా.. ఆంధ్ర పాలకుల పార్టీల్లో పని చేశారన్నారు. కెసిఆర్ కూడా తెలుగుదేశంలో పని చేశారని, తెలంగాణ ప్రయోజనాల కోసం ప్రశ్నిస్తూ వచ్చారని తెలిపారు. తెలంగాణ బాగు పడాలంటే రాష్ట్ర ఏర్పాటు తప్ప మరొక దారి లేదని బయటికి వచ్చారన్నారు. 2001 నుంచి కెసిఆర్‌తో పనిచేసే అదృష్టం తనకు దక్కిందన్నారు. మొండి ధైర్యంతో పోరాటం చేశాడని, తెలంగాణ ప్రజల ఆకాంక్షను నెరవేర్చిండన్నారు. తెలంగాణ వచ్చిందంటే అది కెసిఆర్ మొండి పట్టుదల, పోరాటంతోనే అన్నారు.

**తెలంగాణను పునర్నిర్మించిన ఘనత బిఆర్ఎస్‌దే**

రాష్ట్ర పునర్నిర్మాణంలో నీళ్ళు, నిధులు, నియామకాలకు సంబంధించి బలమైన పునాదులు వేయగలిగామని, అదే ప్రగతిని ఆర్‌బిఐ తన నివేదికలో తెలియచేసిందని మాజీ సిఎం కె.చంద్రశేఖర్ రావు అన్నారు. ఎర్రవల్లి ఫాంహౌస్‌లో కెసిఆర్ పుట్టినరోజు సందర్భంగా జూలూరు గౌరీశంకర్ సంపాదకత్వంలో వెలువరించిన 'వందేళ్ళ ముందుచూపు' పుస్తకాన్ని ఆయనకు కానుకగా అందచేశారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు వొద్దిరాజు రవిచంద్ర, ఎంఎల్‌సిలు సిరికొండ మధుసూదనాచారి, దేశపతి శ్రీనివాస్, తక్కెళ్ళపల్లి రవీందర్ రావు, వి. ప్రకాష్, మహ్మూద్ అలీ పాల్గొన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM - 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com